ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 138 పేజీలు: 10+4 వెల: 6.50

విద్యుత్ ఉద్యోగుల డిఏ 1.6 శాతం పెంపు 2

ఒప్పందం నచ్చకపోతే మళ్లీ దాడులే: ట్రంప్ హెచ్చరిక 5

## ఎల్‌నినో ప్రభావంతో.. దిక్కులేని పంటల బీమా

ఖరీఫ్ సాగుపై నెలకొన్న అనిశ్చితి

వాతావరణ పరిస్థితులపై కలవరం

పంటల బీమాపై వ్యవసాయ శాఖ నిర్లిప్తత

వర్షాభావంపై రైతాంగంలో తీవ్ర ఆందోళన



**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం రుతుపవనాలపై పడి వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రాష్ట్రంలోని ఖరీఫ్ సీజనుపై ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతుల్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో పంటల బీమా అమలు చేసినట్లయితే నష్టాల నుండి కొంత వరకూ అయినా కోలుకోవచ్చని రైతాంగం భావిస్తోంది. తెలంగాణలోని లక్షలాది మంది రైతులు, ఈ ఖరీఫ్ సీజన్‌లో తాము పండించే పంటలు, అంచనా వేసిన బలహీనమైన రుతుపవనాల కాలాన్ని తట్టుకుని నిలబడగలుగుతామా లేదా అనేదానిపై రైతుల్లో సందిగ్ధత నెలకొంది. రైతు భరోసా ఇన్‌పుట్ సబ్సిడీ పథకం కింద ఉన్న సుమారు 73 లక్షల లబ్ధిదారులలో, అందరూ కాకపోయినా దాదాపు 55 లక్షల నుంచి 60 లక్షల మంది క్రియాశీల రైతుల్లో బలహీనమైన రుతుపవనాల ముప్పు గందరగోళాన్ని రేకెత్తిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టం వాటిల్లినప్పుడు ఆధారపడటానికి తెలంగాణ రైతులకు పంటల బీమా పథకం ఏదీ లేదనేది ఈ ఆందోళనకు ముఖ్య కారణంగా చెబుతున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో పరిస్థితులతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని ముందుగానే వాతావరణ శాఖ హెచ్చరించినా కూడా తెలంగాణలో పంటల బీమా ప్రస్తావన మాత్రం వ్యవసాయ శాఖ తీసుకురాలేదు. వానా కాలం ప్రారంభానికి నెల రోజుల ముందు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది, కానీ ఇప్పటివరకు అలాంటి ప్రకటన ఏదీ రాలేదు. తక్కువ వర్షాల కారణంగా నదులు, జలాశయాలలో నీటిమట్టాలు తగ్గే అవకాశం ఉంది, అలాగే భూగర్భ జలాల లభ్యత కూడా ప్రభావితమవుతుంది. ఈ పరిస్థితుల్లో వారికి ఉన్న ఏకైక రక్షణ కవచం పంటల బీమా మాత్రమే అని వ్యవసాయశాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం పీఎం ఫసల్ బీమా యోజన నుండి వైదొలగడానికి ముందు, రాష్ట్రంలో 39,04,037మందిరైతులు ఈపథకంలో నమోదుచేసుకోగా, 1,221, 538 మంది రైతులు బీమా ప్రయోజనాలుగా రూ. 1,906.38 కోట్లు అందుకున్నారు.



బుధవారం ఆరుట్లలో విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

## విద్యలో కొత్త శకం ఆరుట్ల నుంచే ఆరంభం

తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం

విద్యకు బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు

డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

**రంగారెడ్డి అర్బన్/ ఇబ్రహీంపట్నం, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యా వ్యవస్థలో నూతన అధ్యాయానికి ఆరుట్ల గ్రామం వేదికగా నిలిచిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ఆయన ఘనంగా ప్రారంభించి విద్యార్థులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన అణగారిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గాల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర >>2

## భారత్‌తో త్వరలోనే ట్రేడ్ డీల్

ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చల్లో ప్రకటించిన యుఎస్ అధ్యక్షుడు ట్రంప్



బుధవారం ఎవియాన్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

**ఎవియాన్ (ఫ్రాన్స్), జూన్ 17:** హార్మూజ్ జలసంధిని తెరవడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. అదే సమయంలో హార్మూజ్ జలసంధిలో నావికుల భద్రత భారత్‌కు ఎంతో ముఖ్యమని ప్రధాని మోడీ అమెరికాకు స్పష్టంచేశారు. ఫ్రాన్స్‌లో దాదాపు 16 నెలల తర్వాత ప్రధాని మోడీ, ట్రంప్ ప్రత్యేకంగా సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు జరిపారు. ఈ ద్వైపాక్షిక చర్చల్లో భారత్, అమెరికా మధ్య సంబంధాలను రీసెట్ చేయడంపైనే ఇరు నేతలు ప్రధానంగా దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ 'మిస్టర్ ప్రెసిడెంట్, మిమ్మల్ని కలవడం చాలా సంతోషంగా ఉంది. గత ఏడాది వాషింగ్టన్‌లో మనం కలుసుకున్నప్పటి నుండి మన దేశాల బంధంలో సరికొత్త వేగం, సరికొత్త శక్తి వచ్చాయి. మన రెండు బృందాలు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి తాము వేగంగా ప్రయత్నాలు చేస్తున్నాము" అని ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను ప్రధాని >>2

మోడీ మాకు ఆప్త మిత్రుడు.. త్వరలోనే భారత్‌కు వస్తా

నావికుల భద్రత భారత్‌కు కీలకమన్న మోడీ

హార్మూజ్ తెరవడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకం

పశ్చిమాసియా శాంతికి కృషి చేసిన ట్రంప్‌కు ప్రధాని మోడీ ప్రశంసలు


బుధవారం కేబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో డి.సిఎం భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

## లాభసాటి సాగువైపు అడుగులు

పేదలు సన్న బియ్యం తినాలి...

రైతులు ఆర్థికంగా ఎదగాలి

కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డి.సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. ఈ సందర్భంగా రైతులకు లాభదాయకమైన తీశిగి 5204, తెలంగాణ సోనా (శివిళి 15048), రీవిలీ1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మేలుజాతి వంగడాలు సమృద్ధిగా ఉన్నాయని.. కాబట్టి వీటిని సాగు చేస్తే రైతులకు ఆదాయం గణనీయంగా ఉంటుదని వ్యవసాయ కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కమిషన్ తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమిషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్‌ను >>2


బుధవారం దేవరకద్రలో కారుపై కూలిన గోడ

## దేవరకద్రలో గాలి బీభత్సం

బొలెరోపై గోడకూలి ఇద్దరు మృతి

**దేవరకద్ర, జూన్ 17 ప్రభాతవార్త:** బతుకుతెరువు కోసం ఎక్కడి నుండో వచ్చారు... కుటుంబాల కోసం కష్టపడాలని ఆశపడ్డారు... కానీ విధి వారిని మధ్యలోనే కబళించింది. పొట్టకూటి >>2

## గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

యుద్ధప్రాతిపదికన క్షేత్రస్థాయిలో సర్వే

రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** రాష్ట్రంలో ఒక్క నిరుపేద కుటుంబం కూడా గుడిసెల్లో జీవించకుండా, ప్రతి కుటుంబం సురక్షితమైన సొంత ఇంటిలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గుడిసెలులేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, గుడిసెల గుర్తింపు, రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం, అసంపూర్తి గృహాల వివరాల సేకరణ తదితర అంశాలపై మంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసిన తర్వాతే ఇతర దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గుడిసెలను యుద్ధప్రాతిపదికన గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వద్ద ఇప్పటికే >>2





'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్'లో భాగంగా బుధవారం ముంబైలో నిర్వహించిన 'ఫిట్ ఇండియా సైక్లోథాన్ – సైక్లింగ్ బై ద సీ' కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్‌తో కలిసి సైకిల్ తొక్కుతున్న కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

# తెలంగాణలో ఇహెచ్‌ఎస్ ట్రస్ట్ బోర్డు పునర్వ్యవస్థీకరణ జిఒ విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** ఉద్యోగుల ఆరోగ్య పథకం ట్రస్ట్ బోర్డును తెలంగాణ ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈహెచ్ఎస్ అమలుకు కొత్త బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఏర్పాటు చేస్తూ జీఓ నంబర్40 విడుదల చేసింది. చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన ఈహెచ్ఎస్ ట్రస్ట్ బోర్డు కొనసాగనుంది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల ప్రతినిధులకు బోర్డులో ప్రభుత్వం స్థానం కల్పించింది. ఉద్యోగులకు హెల్త్ కార్డుల జారీ విధానంపై మార్గదర్శకాలని ఈ బోర్డు రూపొందించనుంది. త్వరలో సమావేశమై ఈహెచ్ఎస్ అమలు మార్గదర్శకాలను ట్రస్ట్ బోర్డు ఖరారు చేయనుంది. ఆరోగ్య, ఆర్థిక, విద్య, హోం తదితర శాఖల ఉన్నతాధికారులు సభ్యులుగా నియమించింది. టీఎన్‌జీఓ, టీజీఓ, పీఆర్‌టీయూ, టీఎస్‌యూటీఎఫ్ సహా ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించింది. పెన్షనర్ల సంఘాల ప్రతినిధులకు కూడా ట్రస్ట్ బోర్డులో చోటు దక్కింది. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 40 ద్వారా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలను పునర్వ్యవస్థీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన బోర్డులో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల ప్రతినిధులకు సభ్యులుగా అవకాశం కల్పించినప్పటికీ, రాష్ట్రంలోని దాదాపు 2.6 లక్షల మంది కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రాతినిధ్యం వహిస్తున్న మా "తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్" కు చోటు కల్పించకపోవడం తీవ్ర విచారకరమని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ..స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, మరియు కోశాధికారి నరేష్ గౌడ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎస్సీ స్టడీ సర్కిల్ నుంచి యుపిఎస్సీ ప్రిలిమ్స్‌లో 30 మంది అభ్యర్థులు విజయఢంకా

## -మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** సామాజిక న్యాయం, సమాన అవకాశాలు నాణ్యమైన కోచింగ్ ద్వారా బలహీన వర్గాల యువతను దేశ అత్యున్నత సేవల్లోకి తీసుకురావాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం ఫలితంగా తెలంగాణ ఎస్సి స్టడీ సర్కిల్ మరోసారి విశిష్ట ఫలితాలను నమోదు చేసిందని ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగుల శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఇటీవల యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్-2026, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షల ఫలితాలలో తెలంగాణ ఎస్సి స్టడీ సర్కిల్‌కు చెందిన ఇప్పటి వరకు 26 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో 4 మంది అభ్యర్థులు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా, యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025 తుది ఫలితాలలో తెలంగాణ ఎస్సి స్టడీ సర్కిల్‌కు చెందిన ఎ. ఆశిష్ (ఏఐఆర్-676), డి. ప్రవీణ్ కుమార్ (ఏఐఆర్-793) తుది ఎంపిక సాధించడం విశేషమని, వీరికి ఐపిఎస్ లభించే అవకాశం ఉందని తెలిపారు. ఇక ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ తుది ఫలితాలలో డి. శశాంక్ (అఖిల భారత 78వ ర్యాంకు), జి. శ్రీకాంత్ (అఖిల భారత 115వ ర్యాంకు) సాధించిన విజయాలు రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన దళిత, గిరిజన బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన యువత దేశ అత్యున్నత సేవల్లో స్థానం సంపాదించేలా ప్రత్యేక కోచింగ్, అధ్యయన సామగ్రి, వసతి, ఆర్థిక సహాయం మరియు నిపుణుల మార్గదర్శకత్వంతో కూడిన శిక్షణా కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇటువంటి ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమాలకు అవసరమైన నిధులను సకాలంలో మంజూరు చేసి, అన్ని వర్గాల అభ్యున్నతికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు మంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సివిల్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ తుది ఎంపిక సాధించిన అభ్యర్థులతో పాటు ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, రాబోయే మెయిన్స్ పరీక్షల్లోనూ అత్యుత్తమ విజయాలు సాధించి తెలంగాణకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.

# యుఎఇలో భారతీయుడికి జాక్‌పాట్

## ఖాతా తెరిచిన 2 నెలల్లోనే రూ.5 కోట్ల విజేత

**షార్జా, జూన్ 17:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో నివసిస్తున్న ఒక ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. బ్యాంకులో ఖాతా ప్రారంభించిన రెండు నెలలు కూడా గడవకముందే ఆయన ఏకంగా 2 మిలియన్ దిర్హామ్‌ల (భారత కరెన్సీలో సుమారు రూ.5.15 కోట్లు) భారీ జాక్‌పాట్‌ను సొంతం చేసుకున్నాడు. అబుదాబిలో నివసిస్తున్న 34 ఏళ్ల షజీర్ వెంగా ఈ బంపర్ ప్రైజ్ విజేతగా నిలిచాడు.

షార్జా ఇస్లామిక్ బ్యాంక్ (ఎస్ఐబి) తన వినియోగదారుల కోసం ఏటా నిర్వహించే 'మిలియనీర్ క్యాంపెయిన్'లో భాగంగా, జూన్ నెలకు సంబంధించి నిర్వహించిన డ్రాలో షజీర్‌ను విజేతగా ప్రకటించారు. కేవలం రెండు నెలల క్రితమే షజీర్ ఎస్ఐబి డిజిటల్ యాప్ ద్వారా సేవింగ్స్ ఖాతా తెరిచాడు. బ్యాంకు నిబంధనల ప్రకారం, ఖాతాలో జమ చేసే ప్రతి 10,000 దిర్హామ్‌ల డిపాజిట్‌కు ఒక డ్రా ఎంట్రీ లభిస్తుంది. ఖాతాదారులలో పొదుపు అలవాటును ప్రోత్సహించేందుకు బ్యాంక్ ఈ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తోంది.

ఈ విజయంపై షజీర్ వెంగా హర్షం వ్యక్తం చేశాడు. ఈ బహుమతి తన జీవితాన్ని గొప్ప మలుపు తిప్పుతుందని, గెలుచుకున్న సొమ్ముతో భారతదేశంలో ఉన్న తన కుటుంబాన్ని యుఎఇకి తీసుకువస్తానని ఆయన తెలిపారు. ఈ క్యాంపెయిన్ గురించి తెలుసుకున్న నాటి నుండి, ఎప్పటికైనా విజేతగా నిలవాలనే ఆశతో ఇందులో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ డ్రాలో షజీర్‌తో పాటు మరికొందరు నగదు బహుమతులను, ఒక లగ్జరీ కారును కూడా గెలుచుకున్నారు.

# గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

>> ఉన్న సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తులన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించాలని ఆదేశించారు. ఎంపీడీవో స్థాయిలో జాబితాలను సిద్ధం చేసి సంబంధిత ఇన్‌చార్జి మంత్రుల ఆమోదానికి పంపించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హుల ఎంపికలో కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా ఎటువంటి పొరపాట్లు, వివక్షకు తావు లేకుండా అనర్హుల చొరబాటుకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. గుడిసెల్లో నివసిస్తూ గతంలో ప్రజాపాలన లేదా ఇతర కార్యక్రమాల్లో దరఖాస్తు చేసుకోని నిరుపేద కుటుంబాలు ఇప్పుడు కూడా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. అటువంటి దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున మంజూరు చేసిన నేపథ్యంలో అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రెండో విడతలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు టార్పాలిన్ షీట్లు, రేకులు, నాపరాళ్లు లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పైకప్పుల కింద నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను గుర్తించి వారికి ఆర్‌సీసీ స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.

## వారం - వర్జ్యం

18-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
చవితి రా.7.05
పుష్యమి ఉ.11.36
వర్జ్యం : రా.11.38-రా.1.09
దు.ఉ.9.57-ఉ.10.49,
2)మ.3.12-సా.4.04
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ధైర్యం, పట్టుదలతో ముందుకు సాగుతారు. ఋణాలు తీరుస్తారు. ఇళ్ల కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. రాజకీయ రంగాల వారికి అన్ని విధాలా అనుకూలిస్తుంది.

**మిథునం:** మిత్రుల సహాయంతో అనుకున్న కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ధనలాభం పొందుతారు. ఆస్తి వివాదాలు తీరుతాయి.

**కర్కాటకం:** ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు. సమస్యలను ఎంతో నేర్పుతో పరిష్కరించుకుంటారు.

**సింహం:** అభివృద్ధి కార్యక్రమాలు వెనువెంటనే కాక భవిష్యత్తులో కలిసి వస్తాయి. ఉద్యోగాల వేటలో సఫలత సాధిస్తారు.

**కన్య :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. కోర్టు కేసుల నుండి బయట పడతారు. దీర్ఘకాలి ఋణాలు తీరుస్తారు.

**తుల:** సంఘంలో పేరు ప్రఖ్యాతలు ఇనుమడిస్తాయి. అమ్మకాలు కొనుగోలు వ్యవహారాలలో లాభపడతారు.

**వృశ్చికం:** చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వివాదాలకు దూరంగా ఉండండి.

**ధనుస్సు:** పెద్దల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మీరు మనో ధైర్యంతో ముందుకు సాగుతారు.

**మకరం:** ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలను శ్రమించి సాధిస్తారు. ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించండి. వాహనసౌఖ్యం.

**కుంభం:** తండ్రి నుండి వారసత్వ రీత్యా రావలసిన ఆస్తి రాకపోగా అపవాదులను ఎదుర్కోవలసి వస్తుంది. స్పెక్యులేషన్స్‌కు దూరంగా వుండండి.

**మీనం:** మోసకారి మాటలు చెప్పే వారి నుండి దూరంగా ఉండటం చెప్పదగినవి. కొంతలో కొంత మంచిఫలితాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్





బుధవారం ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయిన ప్రధాని మోడీ

# త్వరలోనే ట్రేడ్ డీల్

>> మోడీ అభినందించారు. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నావికుల్లో దాదాపు 10శాతం మంది భారతీయులే ఉన్నారని గుర్తు చేస్తూ, వారి భద్రతపై మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర వాణిజ్యంలో భారతదేశానికి చెందిన లక్షలాది మంది నావికులు ప్రపంచంలోని వివిధ సముద్రాల్లో తమ సేవలను అందిస్తున్నారని, ప్రపంచ ప్రగతిలో గొప్ప సహకారం అందిస్తున్నారని వివరించారు. ఇటీవల హార్మూజ్‌లో భారత జెండా ఉన్న నౌకపై అమెరికా దాడి చేసిన నేపథ్యంలో ప్రధాని ఆ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. నావికుల భద్రత తమకు చాలా కీలకమన్నారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛా నౌకాయానం ఉండేలా చూడాలన్నారు.

హార్మూజ్ ప్రాంతం వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండకూడదని, అంతర్జాతీయ నౌకాయానం స్వేచ్ఛగా సాగాలని ఆయన నొక్కి చెప్పారు.

త్వరలోనే ట్రేడ్ డీల్: 'మోడీ మాకు ఆప్తమిత్రుడు.. భారత్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటాం' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. త్వరలోనే ఇరుదేశాల మధ్య మెగా ట్రేడ్ డీల్ కుదురబోతుందని ప్రకటించారు.

ఇరుదేశాల మధ్య గత కొంతకాలంగా నడుస్తున్న వాణిజ్య వివాదాలకు త్వరలోనే తెరపడనుందని ఈ భేటీ ద్వారా స్పష్టమైంది. భారత్‌అమెరికా మధ్య త్వరలోనే ఒక భారీ ట్రేడ్ డీల్ కుదరబోతుందని ఇరుపక్షాలు వెల్లడించాయి. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూలంగా స్పందిస్తూ 'భారతదేశంలో తాము భారీగా పెట్టుబడులు పెడుతున్నాం. ప్రధాని మోడీ మాకు అత్యంత ఆప్తమిత్రుడు. అమెరికా ఎల్లప్పుడూ భారత్‌కు అండగా ఉంటుంది" అని చెప్పారు. ప్రధాని మోడీతో మంచి చర్చలు జరిగినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. తాము వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నట్లు చెప్పిన ఆయన అమెరికా, భారత్ మధ్య చాలా మంచి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అమెరికా మునుపెన్నడూ లేనంతగా అద్భుతంగా రాణిస్తోందన్నారు. యుఎస్‌కు 19.2 ట్రిలియన్లపైగా ఆదాయం వస్తోందని తాము ఫ్యాక్టరీలతో పాటు మరెన్నో నిర్మిస్తున్నామని ట్రంప్ వివరించారు. ప్రధాని మోడీ అమెరికాలో చాలా ప్రాజెక్టులు చేపడుతున్నారని ట్రంప్ వెల్లడించారు. అమెరికాలో చాలా డబ్బు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. మోడీ నాయకుడిగా ఉన్నంతకాలం ప్రపంచ వేదికపై భారత్ కీలక పాత్ర పోషిస్తుందని తాను భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. "ఆయన (మోడీ) చాలా సమర్థుడు. ఆయన చాలా కఠినమైనవారు.

కానీ చూడటానికి చాలా మంచిగా కనిపిస్తారు. కాబట్టి ఆయన మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తారు. కానీ ఇలాంటి వారు చాలా తక్కువ మంది ఉంటారు. ఆయన చాలా మంచివాడని ప్రజలు అంటారు. నేను అంటాను, మంచివాడా? ఆయన చాలా కఠినమైనవారు. ఆయన కఠినమైన సంధానకర్త. ఈయన భారత ప్రజలను ప్రేమిస్తారు, అమెరికాను కూడా ప్రేమిస్తారు. హ్యూస్టన్‌లో తాము 'హౌడీ మోడీ' కార్యక్రమం నిర్వహించాము, గుర్తుంది కదా? అప్పుడు స్టేడియం మొత్తం నిండిపోయింది. పశ్చిమాసియాలో భారత్ కూడా కీలక పాత్ర పోషిస్తుందని అని చెబుతున్నా. ప్రతి విషయంలోనూ భారత్ కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నా. తాను చెప్పినట్లు, తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం, వైట్ హౌస్‌లో వారికి (భారత్‌కు) ఒక గొప్ప స్నేహితుడు ఉంటాడు. ఎక్కడైనా సమస్య ఉందేమో నాకు తెలియదు. కానీ నేను అలా అనుకోవడం లేదు. ఇక్కడున్న ప్రతి ఒక్కరూ భారతదేశాన్ని ప్రేమిస్తారని, ఈయన పట్ల వారికి అపారమైన గౌరవం ఉందని తాను మీకు చెప్పగలను" అని డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా రక్షణ సహకారం బలంగా ఉందని ట్రంప్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భారత్‌పై దాడి జరిగితే అమెరికా అక్కడ వెంటనే ఉంటుందని హామీ ఇచ్చారు. 'ఒకవేళ భారత్‌కు కొత్త నాయకుడు వస్తే మాత్రం, దాని గురించి నాకు కచ్చితంగా తెలియదు. కొత్త నాయకుడు ఉంటే, నాకు తెలియదు. కానీ ఈయన నాయకుడిగా ఉన్నప్పుడు వారిపై దాడి జరిగితే, తాము సహాయం చేయడానికి అండగా ఉంటాము' అని ట్రంప్ పేర్కొన్నారు. త్వరలోనే భారత్ పర్యటనకు వస్తానని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు.

**భారత నిపుణుల అవకాశాలకు ట్రంప్ మద్దతు**

అమెరికాలో అత్యున్నత నైపుణ్యం కలిగిన భారతీయ నిపుణులకు లభించే అవకాశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం మద్దతు ప్రకటించారు. భారతీయులను "అత్యంత ప్రతిభావంతులు"గా అభివర్ణించిన ఆయన, రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా ఉన్న ఉపాధి సంబంధాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. తన అధ్యక్షతన కూడా అత్యున్నత నైపుణ్యం కలిగిన భారతీయ నిపుణులకు అమెరికాలో అవకాశాలు లభిస్తూనే ఉంటాయా అని అడిగినప్పుడు, ట్రంప్ సానుకూలంగా స్పందించారు. "ఓహ్ అవును, ఖచ్చితంగా. ఎప్పుడూ అలాగే ఉంటుంది," అని ట్రంప్ అన్నారు. "ఉపాధి విషయంలో భారత్‌తో మాకు ఎప్పుడూ అద్భుతమైన సంబంధాలు ఉన్నాయి. అమెరికాకు అత్యున్నత నైపుణ్యం కలిగిన కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులను అందించే ప్రధాన దేశాలలో ఒకటిగా ఉన్న భారత్‌లో ఈ వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తించే అవకాశం ఉంది" అని వాషింగ్టన్, న్యూఢిల్లీ మధ్య ఉన్న సంబంధాల బలాన్ని పదేపదే నొక్కి చెబుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఆరుట్ల నుంచే ఆరంభం

>> చరిత్రలో తొలిసారిగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి విద్యా రంగంలో సమగ్ర సంస్కరణలు చేపట్టామని తెలిపారు. పక్క రాష్ట్రాల విద్యా విధానాలను అధ్యయనం చేసి కేశవరావు కమిటీ సూచనలతో కొత్త విధానాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రూ.3 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో 8.5 శాతం నిధులను విద్యా రంగానికే కేటాయించినట్లు వెల్లడించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని గుర్తు చేసుకున్న సీఎం ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గతంలో కులాల వారీగా విద్యాసంస్థలు ఏర్పడితే, ఇప్పుడు అందరికీ ఒకే వేదికపై నాణ్యమైన విద్య అందించే తెలంగాణ ఇంటిగ్రేటెడ్ విద్యా వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు.

రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఆరుట్ల రామచంద్రారెడ్డి స్ఫూర్తి ఈ నేలలో నిండి ఉందని, ఆ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో సాంకేతిక, పారిశ్రామిక రంగాల్లో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందిస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా సమాచారం అందించి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ కోసం భారీగా నిధులు కేటాయించామని, అభివృద్ధిని చూసి కొందరు చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మబోరని అన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విద్యా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని



బుధవారం ఆరుట్ల పబ్లిక్‌స్కూలులో చపాతిలు చేస్తున్న సిఎం రేవంత్

చెప్పారు. ఎన్నికల హామీ మేరకు ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించడం ద్వారా ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. పోరాటాల గడ్డ ఆరుట్ల నుంచే విద్యా అభివృద్ధిలో నూతన శకం ప్రారంభమైందని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు కొత్త గుర్తింపు తీసుకొచ్చిన ప్రభుత్వం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ప్రభుత్వవిప్ పట్నం మహేందర్ రెడ్డి, నల్గొండ పార్లమెంట్‌సభ్యులు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు చారకొండ వెంకటేష్, జోష్న శివారెడ్డి, ప్రొఫెసర్ సుభాష్ వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల డిఎ1.621% పెంపు

## 70,804 మంది ఉద్యోగులకు ప్రయోజనం

## డిమాండ్ ఉన్నా నిరంతరాయ సరఫరా

### వర్షాకాలం అలర్ట్‌గా విద్యుత్ సిబ్బంది: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంచుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ఈ ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా 1.621 శాతం మేర డీఏను పెంచే ప్రతిపాదనను అమలు చేయనున్నట్లు ప్రకటించారు. దీనితో డీఏ 17.651 నుంచి 19.272 కి చేరినట్లు అయింది. ఈ డీఏ పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు సుమారు రూ. 9.35 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుందని తెలిపారు. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న మొత్తం 70,804 మంది సిబ్బంది, పెన్షనర్లు ఈ డీఏ పెంపు వల్ల ప్రయోజనం పొందనున్నారని చెప్పారు. ప్రధానంగా రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా విద్యుత్ అధికారులు సన్నద్ధం కావాలని స్పష్టం చేశారు. రానున్న పదేళ్లను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ రంగ సంస్థల్లో మౌలిక సదుపాయాల కోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ ఏడాది మార్చి 27న పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు చేరిందన్నారు. అయినా సరఫరాలో అంతరయాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా చేయడం జరిగిందని వెల్లడించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, రాబోయే దశాబ్ద కాలానికి సమగ్రమైన, దీర్ఘకాలిక విద్యుత్ ప్రణాళికను సిద్ధం చేయాలని విద్యుత్ రంగ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. వచ్చే పదేళ్లలో రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించాలని అన్నారు. రాష్ట్రంలో 2035-36 నాటికి పీక్ డిమాండ్ 34,137 మెగావాట్లకు చేరుకుంటుందని అంచనాగా చెప్పారు. ఈ ఏడాది నమోదైన పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు దాదాపు రెట్టింపుగా ఉంటుందని అన్నారు. అంతేకాకుండా 203536 నాటికి వార్షిక విద్యుత్ అవసరాలు 1,52,626 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ప్రధానంగా క్షేత్రస్థాయి అధికార్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే వాటిని వెంటనే సరిచేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి అవసరమైన ముందస్తు చర్యలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

# లాభసాటి సాగువైపు అడుగులు

>> ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది. ఈ సమావేశంలో రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో గాలి బీభత్సం

>> కోసం వచ్చిన ఇద్దరు వ్యక్తులు ప్రమాదంలో ప్రాణాలు వదిలి విషాదాన్ని మిగిల్చారు. బుధవారం సాయంత్రం దేవరకద్రలో గాలి బీభత్సం సృష్టించింది. వడగండ్ల వాన అల్లకల్లోలం చేసింది. ఈ క్రమంలో బొలెరోపై గోడ కూలి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. నిర్మాణంలో ఉన్న ఇంటి పక్కన బొలెరో వాహనం పార్కు చేయగా రెండు అంతస్తులపై నుంచి గాలికి గౌడ కుప్ప కూలింది. దీంతో ఆ బొలెరో వాహనం నుజ్జు నుజ్జు కాగా ఇద్దరు వ్యక్తులు అందులోనే ఇరుక్కుపోయారు. వెంటనే అక్కడున్న ప్రజలు, యువకులు, పోలీస్ సిబ్బంది వారిని బయటికి తీశారు. వారికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్ లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఇద్దరు మృతి చెందారు. మృతి చెందిన ఇద్దరు వ్యక్తులు భారత్ మాల రోడ్డుకు సంబంధించిన సిబ్బంది గా గుర్తించారు. ఇందులో చిత్తూరు వాసి జగన్నాథ్ రెడ్డి( 40) అకౌంటెంట్ గా పని చేస్తుండగా, సంతోష్ (42) డ్రైవర్ వెస్ట్ బెంగాల్ కు చెందినవారు.

# తెలంగాణ యువతకు అంతర్జాతీయ విద్యావకాశాలపై ముందడుగు

## మంత్రి వాకిటి శ్రీహరి సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రతిష్టాత్మక చిచెస్టర్ విశ్వవిద్యాలయం ప్రతినిధులతో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామిక అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యా సహకారం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఉన్నత విద్యా అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం, చిచెస్టర్ విశ్వవిద్యాలయం మధ్య విద్యా, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకార అవకాశాలను పరిశీలించారు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం కామారెడ్డి :: జిల్లా కామారెడ్డి
తైబజార్ మరియు మేకల సంత బహిరంగ వేలము ప్రకటన

ఎ1/1007/2026-27 తేది: 16.06.2026

2019వ సంవత్సరము తెలంగాణ పురపాలక సంఘం చట్టము మరియు ఈ చట్టము క్రింద గల సంబంధిత రూలు ప్రకారము 2026-27 సంవత్సరమునకు అనగా 01.07.2026 నుండి 31.03.2027 వరకు ఈ క్రింది షెడ్యూల్‌లోని అంశములపై గత సంవత్సరము విధించిన రేట్ల ప్రకారము రోజువారి ఫీజులు వసూలు చేసుకునే హక్కు గలదు తేది: 30.06.2026 మంగళవారము ఉదయము 11.00 గం.లకు కామారెడ్డి పురపాలక సంఘ కార్యాలయములో మున్సిపల్ కమీషనర్ గారిచే గానీ లేదా వారిచే అధికారము పొందిన వారిచే బహిరంగ వేలం వేయబడును. వేలము నందు పాల్గొనదలచిన వారు ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్ణయించిన సాల్వెన్సీ ధ్రువపత్రం పొంది మరియు ధరావత్తు సొమ్మును డి.డి. రూపంలో చెల్లించి వేలములో పాల్గొనవలెను. లేని యెడల పాటలో పాల్గొనుటకు అనర్హులు. వేలం నిబంధనలు మొదలగు వివరములు కార్యాలయము పని వేళలో తెలుసుకొనవచ్చును. కావున ఇట్టి వేలములో పాల్గొనుటకు ఆసక్తి గల వారు ఈ క్రింద తెలియపరిచిన ధ్రువ పత్రములు సంబంధిత అధికారులకు సమర్పించవలెను.

| క్ర. సం. | వివరములు | ధరావత్తు సొమ్ము (డి.డి.రూపంలో) | సాల్వెంసి/వాల్యువేషన్ సర్టిఫికేట్ విలువ |
| --- | --- | --- | --- |
| 1 | కామారెడ్డి పట్టణ పరిధిలో వ్యాపారము చేయు వారి వద్ద రోజువారి తైబజార్ ఫీజును వసూలు చేసుకొనే హక్కును వేలం వేయుట. | రూ.4,00,000/- | రూ.15,00,000/- |
| 2 | కామారెడ్డి పట్టణములో మేకలు కొనుగోలు అమ్మకము చేయువారి నుండి ఫీజును వసూలు చేసుకొనే హక్కును వేలం వేయుట. | రూ.50,000/- | రూ.5,00,000/- |

గమనిక: వేలంపాట దక్కించుకున్న వారు వేలం పాట దక్కించుకున్న తేది నుండి మొత్తం రూపాయలు (7) రోజులలోపు పురపాలక సంఘం నందు చెల్లించి రశీదు పొందగలరు. చెల్లించని యెడల అత్యధికముగా రెండవ పాట పాడిన పాటదారునికి వేలం ఇవ్వబడును. షరతులు :- 1. సాల్వెన్సీ/వాల్యుయేషన్ సర్టిఫికెట్ కామారెడ్డి పట్టణ పరిధిలోని ఆస్తులను చెందివుండవలెను. 2. ధరావత్తు సొమ్ము డి.డి. రూపంలోనే స్వీకరించబడును. (In favour of Commissioner, Municipal Council, Kamareddy). 3. ధరావత్తు సొమ్ము డి.డి. మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్లు తేది: 27.06.2026 సాయంత్రం 5.00గం.లలోపు సమర్పించిన వారు మాత్రమే వేలములో పాల్గొనుటకు అర్హులు. 4. సర్వీసు టాక్స్ ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్ణయించబడును.

సం/-. కమిషనర్, పురపాలక సంఘం కామారెడ్డి.
DIPR.NO. 4439-PP/CL/ADVT/1/2026-27 తేది: 17.06.2026



# చిన్నారి నిరంజన్ చిరు కోరిక తీర్చిన పవన్


అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామర్శించిన ఏపి డిసిఎం

హనుమకొండలో ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా

వైద్య ఖర్చు నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం

వరంగల్ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**హనుమకొండ బ్యూరో, జూన్ 17, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన డి.ఎం.డి అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ ఎదుగుదల లేని స్థితిలో, మంచానికే పరిమితమైన యువ అభిమాని కోరికను మన్నించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్థిక భరోసాతోపాటు భగవంతుని తీర్థప్రసాదాలు అందజేశారు. హనుమకొండలోని హనుమాన్‌నగర్‌కు చెందిన నిరంజన్ (17) అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్ కలవాలని అభిలషించాడు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప ముఖ్య మంత్రి బుధవారం స్వయంగా నిరంజన్ ఇంటికి వెళ్లి అతన్ని దగ్గరకు తీసుకుని పరామర్శించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్, మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? అతన్ని కాపాడుకోవడానికి ఏం చేయొచ్చు అన్న విషయాలపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఉంటాయని చెప్పి కుటుంబసభ్యులకు మనోధైర్యం నింపారు. వెంకటేశ్వర స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ విఖ్యాత భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తున్నాని తెలిపారు. నిరంజన్‌ను చూసేందుకు వచ్చిన పవన్ ఆతనితో చాలా సమయం గడిపారు. ఇంట్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ లేవలేని స్థితిలో ఉన్న అభిమానిని చూసి చలించిపోయారు. ఆతని మంచంపై కూర్చుని ఆత్మీయంగా పొత్తుకున్నారు. నుదిటిపై ముద్దుపెట్టి ఆప్యాయంగా పలకరించారు. 'చిన్నతనం నుంచి మీరంటే అభిమానం' అని నిరంజన్ చెప్పిన మాటలు విని కదిలిపోయారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని ఆతనికి కప్పి, కళ్యాణం అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. భద్రకాళి అమ్మవారి వెండి ప్రతిమను ఆలయంలో పూజ చేయించి కుటుంబసభ్యులకు అందజేస్తున్నని తెలిపారు. నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్‌కళ్యాణ్ అనుకరిస్తూ చేసిన డాన్సుల తాలూకు వీడియోలు, ఫోటోలను తిలకించారు. అంతా తనని పోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని నిరంజన్ చెప్పాడు. నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపి పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి జీవనోపాధి మెరుగు పర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ నాయకులకి దిశానిర్దేశం చేశారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ కళ్యాణ్ నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. పవన్ కళ్యాణ్ తోపాటు జనసేన పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జి శంకర్‌గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.




# రూ.175 మోమోస్ బిల్లు కోసం గన్ తీసి చూపించి..

అర్ధరాత్రి వివాదాస్పదంగా సైబరాబాద్ కానిస్టేబుల్ వ్యవహారశైలి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 17, ప్రభాతవార్త:** అర్ధరాత్రి ఫుడ్‌కోర్టులో తిన్న మోమోస్ బిల్లు కోసం ఓ కానిస్టేబుల్ గన్ తీసి చూపించి బెదిరించడం సంచలనంగా మారింది. ఫుడ్‌కోర్టు యజమాని ఐడి కార్డు అడిగితే, గన్ను ఉందంటూ బయటకు తీసి హల్‌చల్ చేయడం వివాదస్పదంగా మారింది. ఈ విషయమై పిర్యాదు అందుకున్న గచ్చిబౌలి పోలీసులు విచారణ చేపడుతున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని యాంటి స్నాచింగ్ టీమ్‌లో ఎఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వివేక్ బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో డిఎల్‌ఎఫ్ వద్ద ఉనన మోమోస్ డిలైట్ ఫుడ్‌కోర్టుకు వెళ్లాడు. మోమోస్ తిన ్న తరువాత 175 రూపాయల బిల్లును ఫుడ్‌కోర్టు యాజమాన్యం ఇచ్చారు. దీంతో రేటు ఎక్కువగా ఉందని తాను బిల్లు ఇవ్వనని వివేక్ వాగ్వాదానికి దిగాడు. నేను పోలీసునని, బిల్లు ఎక్కువ వేశావని దబాయించాడు. దీంతో దుకాణం యజమాని పోలీసు ఐడి కార్డు చూపించాలని అడుగగా, తనవద్ద ఐడి కార్డు లేదని, గన్ను ఉందంటూ తన వద్ద ఉన్న గన్ను బయటకు తీసి హల్‌చల్ చేశాడు. దీంతో ఫుడ్‌కోర్టు యజమాని భయాందోళనకు గురై డయల్ 100కు ఫోన్ చేశాడు. దీంతో గచ్చిబౌలి మొబైల్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని వివేక్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, తాను మోమోస్ తినకముందే రేటు విషయంలో వివాదం జరిగిందని, ఐడీ కార్డు లేకపోవడంతో పోలీసునని తెలిపేందుకు గన్ను చూపించానని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ఈ విషయమై గచ్చిబౌలి పోలీసులు విచారణ చేపట్టారు.

# పట్టుబడిన సుంకరి నరహరికి రిమాండు.. జైలుకు తరలింపు

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో మంగళవారం నాడు అరెస్టయిన మల్టీ జోన్ 2 సర్వే లాండ్ రికార్డుల డిప్యూటీ డై రక్టర్ సుంకరి నరహరికి నాంపల్లి ఎసిబి కోర్టు బుధవారం ఉదయం రెండు వారాల రిమాండు విధించింది. నరహరి వద్ద 13 కోట్ల ఐదు లక్షల 67 వేల 100 రూపాయల అక్రమాస్తులను ఎసిబి జప్తు చేయడం తెలిసిందే. నరహరిని ఎసిబి అధికారులు మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయే వరకు విచారించిన ఎసిబి అధికారులు, ఆ తరువాత ఆయనను అబిడ్స్ పోలీసు స్టేషన్‌లో వుంచారు. బుధవారం ఉదయం ఏడు గంటల సమయంలో ఆయనను నాంపల్లి ఎసిబి కోర్టుల న్యాయమూర్తి ఇంట్లో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి నరహరికి రెం డు వారాల రిమాండు విధించారు. దీని తరువాత ఆయనను ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా ఈ కేసులో నరహరి ని మరింతగా విచారించేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఎసిబి అధికారులు ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయిం చారు. రెండు రోజుల్లో ఈ పిటిషన్ దాఖలయ్యే వీలుంది.

# ముంబయి ఐనాక్స్ గ్రూప్‌కు సైబర్ నేరగాళ్ల టోకరా

కంపెనీ ఇడి పేరిట డిజిఎంకు వాట్సాప్ సందేశం పంపి రూ.10.40 కోట్లు కాజేసిన వైనం

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** ముంబయిలోని ప్రముఖ భవన నిర్మాణ సంస్థ ఐ నాక్స్‌కు సైబర్ నేరగాళ్లు నూ.10.40 కోట్ల రూపా యలను టోకరా వేశారు. సంస్థ ఈడీ పేరిట అకౌంట్స్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు వాట్సాప్ సందేశం పంపి రెండు వారాల్లో 63 విడతల్లో ఈ సొమ్మును కాజేశారు. ఈ ఘటనలో వెంటనే స్పందించిన నేషనల్ సైబర్ క్రైం పోర్టల్ విభాగం అధికారులు, ముంబాయి సైబర్ క్రైం పోలీసులు నలుగురు నేరగాళ్లను అరెస్టు చేసి, వారి బ్యాంకు ఖాతాలను జప్తు చేశారు. వివరాలు ఇలావున్నాయి. ముంబాయి కేంద్రంగా పనిచేసే ఐనాక్స్‌కు దేశ వ్యాప్తంగా అనేకచోట్ల కార్యాలయాలు వున్నాయి. సంస్థ ప్రధాన కార్యాలయంలో వెలుగు చూసిన భారీ సైబర్ మోసం అటు కంపెనీ నిర్వాహకులను, ఇటు పోలీసులను షాక్‌కు గురిచేసింది. కంపెనీ ఈడి సిద్దార్థ్ జైన్ పేరుతో ఆయన ఫోటో డిపిగా వుంచి అకౌంట్స్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరీష్ అమిన్‌కు జూన్ మూడవ తేదీన గుర్తు తెలియని నంబర్ నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది. తాను ఐ నాక్స్ ఈడీ సిద్దార్థ్ జైన్ అని చెబుతూ ఇది తన వ్యక్తిగత నంబర్ అని సైబర్ నేరగాడు పరిచయం చేసుకున్నాడు. దీంతో పాటు వా ట్సాప్ ప్రొఫైల్ పిక్చర్‌గా కంపెనీ ఈడి సిద్దార్థ జైన్ ఫోటో వుండడంతో తనకు సందేశం పంపిన వ్యక్తి నిజంగానే కంపెనీ ఈడిగా డిజిఎం అమి న్ నమ్మాడు.

తాను అత్యవసరంగా విదేశాలకు వెళుతున్నానని, అర్జంటుగా డబ్బు కావాలని సందేశంలో వుండడంతో ఇది నిజమని నమ్మాడు. దీని తరువాత ఈ నెల మూడవ తేదీ నుంచి ఈ నెల 15వ తేదీ మధ్య 63 విడతల్లో 10 కోట్ల 40 లక్షల రూపాయలను వివిధ బ్యాంకు ఖాతాలకు సైబర్ నేరగాళ్లు బదలీ చేయించు కున్నారు. దీని తరువాత ఈ నెల 16వ తేదీన కంపెనీ అకౌంట్స్ సమీక్ష సమయంలో బదలీ చేసిన నగదుకు సంబంధి ంచిన ఇన్‌వాయిస్ కోసం అకౌంట్స్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ అమిన్ అధికారికంగా కంపెనీ ఇడి సిద్దార్థ్ జైన్‌ను సంప్రదించడంతో ఈ సైబర్ మోసం వెలుగు చూసింది. తాను ఎలాంటి నగదు బదలీ కోరలేదని, ఎలాంటి సందేశం పంపలేదని సిద్దార్థ్ జైన్ చెప్పడంతో అకౌంట్స్ విభాగం అధికారులు షాక్ అయ్యారు. దీంతో కంపెనీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు నేషనల్ సైబర్‌క్రైం పోర్టల్ ముంబయి సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు.

కాగా ఈ కేసుతో సంబంధం వున్న నలుగురు వ్యక్తులను ఢిల్లీలో పోలీసులు అరెస్టు చేశారు. ఈ గోల్‌మాల్ వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందని, విదేశాల నుంచి సైబర్ నేరగాళ్లు ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

# మెట్రో ఆలస్యానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణం

ప్రజలను తప్పదారి పట్టించేందుకే రేవంత్‌రెడ్డి లేఖ

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే అబద్ధాన్ని నిజం చేయాలని చూస్తూ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీద, కేంద్ర ప్రభుత్వం మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరుతూ నిన్న కిషన్ రెడ్డికి సిఎం లేఖ రాయడం అత్యంత హాస్యాస్పదమన్నారు. రెండున్నరేళ్ల పాలనలో సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి 71 సార్లు వెళ్లారని, కనీసం 15 సార్లు కేంద్రమంత్రులను కలిశారని గుర్తుచేశారు. అర్బన్ డెవలప్‌మెంట్, మెట్రో అంశాలపై కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ని 5 సార్లు, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ని 3 సార్లు కలవడమే కాకుండా, హైదరాబాద్‌లో కూడా పలుమార్లు సమావేశమైన రేవంత్ రెడ్డి ఆ సందర్భాల్లో ఎప్పుడైనా కిషన్‌రెడ్డికి చెప్పి కలిశారా అని ప్రశ్నించారు. ఇప్పుడు మాత్రం అపాయింట్‌మెంట్ ఇప్పించడం లేదంటూ కిషన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం రాజకీయ నాటకం, బూటకమేనని మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదారి పట్టించేందుకే రేవంత్ రెడ్డి లేఖ రాశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో పూర్తిగా విఫలమైందని రాంచందర్ రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని, అలాగే ఇచ్చిన 420 హామీలను కూడా గాలి కొదిలేసిందని ఆరోపించారు. రైతు భరోసా అమలు కాలేదని, ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర సమస్యలు ఉండటంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఈ వైఫల్యాలన్నింటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సిఎం రేవంత్ రెడ్డి కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై ఆసక్తి లేదని, ఆ పార్టీకి కేవలం స్కాములు, కమీషన్ల రాజకీయాలపైనే అనుభవం ఉందని రాంచందర్ రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రాజెక్టులను ఎలా ప్రతిపాదించాలో కూడా తెలియదని, మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫీజిబిలిటీ రిపోర్టు, ఫైనాన్షియల్ ఫీజిబిలిటీ రిపోర్టు, డిపిఆర్‌లను ఇప్పటి వరకు సమర్పించలేదన్నారు. అవసరమైన సాంకేతిక పత్రాలు ఇవ్వకుండా కేంద్రం అడ్డుకుంటోందని చెప్పడం ముమ్మాటికీ అవాస్తవమని, కేంద్రం మెట్రో ఫేజ్ 2కు వ్యతిరేకం కాదని, ఎప్పుడూ ప్రాజెక్టును తిరస్కరించలేదని స్పష్టం చేశారు. ఇది కేంద్రం చేసిన రిజెక్షన్ కాదు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల జరిగిన ఆలస్యం మాత్రమేనని తేల్చిచెప్పారు. మెట్రో విస్తరణ ఆలస్యానికి కేంద్రం గానీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గానీ కారణం కాదని, కేవలం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి మాటలు చెప్పడంలోనే కాదు, ఇప్పుడు అబద్ధాల ప్రచారంలోనూ ప్రావీణ్యం సంపాదించారని, అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజమని నమ్మించే గోబెల్స్ తరహా ప్రచారాన్ని కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ చేసే ఈ డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మరని ఆయన స్పష్టం చేశారు. ఇక బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సినీ, టెలివిజన్ రంగాలకు చెందిన సీనియర్ ఆర్టిస్ట్ జ్యోతి రెడ్డి, సినీ నిర్మాత బండి శ్రీనివాస్ బుధవారం భారతీయ జనతా పార్టీలో చేరడం పట్ల బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు హర్షం వ్యక్తం చేశారు.

# సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

ఆన్‌లైన్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ



**న్యూఢిల్లీ, జూన్ 17:** సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల సంపదను దోచుకునే 'పరాన్నజీవులు' అని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు బుధవారం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక సైబర్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విచారించాలని కోరుతూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది. "మీలాంటి వారు పరాన్నజీవులు. అమాయక మదుపరుల నుంచి సొమ్ము వసూలు చేసి వారిని వంచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో తాము అత్యంత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది" అని విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ తరహా నేరగాళ్లు తమిళనాడు నుంచి జమ్మూకశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధర్మాసనం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరస్థులను జైల్లోనే ఉంచడం సామాజిక ప్రయోజనాలకు శ్రేయస్కరమని ధర్మాసనం పేర్కొంది. దేశంలో "డిజిటల్ అరెస్ట్" వంటి స్కామ్‌లతో సహా ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ మోసాల ధాటికి వృద్ధులు, సామాన్యులు కోట్ల రూపాయలు మేర నష్టపోతున్నారని, అటువంటి వారిని కట్టడి చేసేందుకు కఠినమైన న్యాయపరమైన వైఖరి అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది

# ఐఎస్ఐ ఉగ్రవాది షాజాద్‌బట్టి ముఠా సభ్యులు అరెస్టు

ఢిల్లీ సహా పలుచోట్ల ఉగ్రవాద వ్యాప్తికి వ్యూహాలు, పాక్‌కు రక్షణ స్థావరాల సమాచారం

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీ సహా ఉత్తరాది రాష్ట్రాలలో పలుచోట్ల ఉగ్రవాద వ్యాప్తితో పాటు రక్షణ స్థావరాలకు సంబంధించిన సమాచారాన్ని, సైనికుల కదలికలను పాక్‌కు పంపుతున్న మరో ఐదుగురిని ఢిల్లీ స్పెషల్ సెల్, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులు బుధవారం నాడు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. మంగళవారం పట్టుకున్న ముగ్గురితో కలిపితే వీరి సంఖ్య ఎనిమిదికి చేరింది. పట్టుబడ్డ వారు నెల రోజుల క్రితం అరెస్టయిన పాక్ ఆక్రమిత కాశ్మీర్‌కు చెందిన బడా ఐఎస్ఐ ఉగ్రవాది షాజాద్ బట్టి ముఠా సభ్యులుగా తేలింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌కు చెందిన ఐఎస్ఐ ఉగ్రవాది షాజాద్ బట్టి కొంతకాలంగా ఢిల్లీ, కాశ్మీర్‌తో పాటు పలు ఉత్తరాది నగరాలలో పేలు ళ్లకు కుట్రలు పన్నడం తెలిసిందే. నిఘా వర్గాలు అందించిన సమాచారం మేరకు బట్టిని నెల రోజుల క్రితం అరెస్టు చేశారు. ఇతన్ని విచారించగా వెలుగుచూసిన సమాచారం మేరకు ఢిల్లీ, యుపిలలో రెండు రోజులుగా ఎన్ఐఎతో పాటు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు దాడులు చేయగా మంగళవారం ముగ్గురు, బుధవారం మరో ఐదుగురు పట్టుబడ్డారు. వీరంతా బట్టి ముఠాలో సభ్యులుగా తేలింది. వీరంతా ఐఎస్ఐ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా వుంటూ భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న తహెరిక్ ఎ తాలిబన్ హిందుస్తాన్ (టిటిహెచ్) సంస్థలో కీలకంగా వున్నారని తేలింది.

వీరంతా ఢిల్లీలో పోలీసులపై దాడులకు పథకాలు వేశారు. దీంతోపాటు కాశ్మీర్‌లో సైనికులను టార్గెట్ చేశారని తేలింది. పంజాబ్‌లోని అమృత్‌సర్ నగరంలో ఓ ఏఎస్ఐ హత్య వెనుక వీరి హస్తం వుందని పోలీ సులకు సమాచారం అందింది. ఈ హత్యకు తామే బాధ్యులమని టిటిహెచ్ మీడియాకు ప్రకటన విడుదల చేయడంతో అప్పటి నుంచి పోలీసుల దాడులు ముమ్మరమయ్యాయి. పోలీసుల దాడులకు తోడు ఎన్ఐఎ అధికారులు కూడా రంగంలో దిగడంతో టిటిహెచ్‌కు చెందిన ఎనిమిది మంది పట్టుబడ్డారు. దుబాయ్, పాక్ కేంద్రంగా పనిచేసే సైబర్ నేరగాళ్లకు భారత సిమ్ కార్డులను దొంగ చాటుగా చేరవేసినట్లు వెలుగుచూసింది. నిందితులను విచారిస్తున్నారు.

# ఉస్మానియాకు ఐఎస్ఓ ధ్రువీకరణ ప్రదానం చేసిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్




**హైదారబాద్, జూన్17,ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ విశిష్టతలను గుర్తించి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ ఐఎస్ఓ నాలుగు ప్రశంసా పత్రాల ధ్రువీకరణ ప్రదానం చేసింది. నాణ్యమైన విద్యా నిర్వహణ, పర్యావరణ సుస్థిరత, ఇంధన సామర్థం, ఆహార భద్రతకు కట్టుబడినందుకు గాను భారత జాతీయ ప్రమాణాల సంస్థ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ నుంచి సమగ్ర ఐఎస్ఓ సర్టిఫికేషన్‌లను పొందిన భారతదేశంలోనే తొలి యూనివర్సిటీగా ఉస్మానియా యూనివర్శిటీ చరిత్రాత్మక మైలురాయిని సాధించింది. విశ్వవిద్యాలయం అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్లలోని వ్యవస్థలు ప్రక్రియల యొక్క కఠినమైన అంచనాను అనుసరించి ధృవపత్రాలు అందించబడ్డాయి. బుధవారం యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్‌కె కనోజియా, బిఐఎస్ సైంటిస్ట్ జి. వెంకట్ నారాయణ్ సర్టిఫికెట్లను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారంకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ. కుమార్ మొలుగారం మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీకి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ నుంచి గుర్తింపు రావడం ఎంతో గర్వకారణమని అభివర్ణించారు. శ్రేష్ఠత, పారదర్శకత, జవాబుదారీతనం విద్యార్థికేంద్రీ కృత పాలన పట్ల విశ్వవిద్యాలయం తిరుగు లేని నిబద్ధతను ఈ విజయం ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. విశ్వ విద్యాలయం పరిపాలన, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది భాగస్వాములందరూ సమష్టి సహకారంతో ఈ విజయాన్ని సాధించేలా అంకితభావంతో కృషి చేశారని ప్రశంసించారు. బిఐఎస్ ధృవీకరణ పత్రాలను పొందడం అనేది నూరేళ్ళు నిండిన ఉస్మానియా యూనివర్సిటీ గొప్ప వారసత్వానికి ఒక ముఖ్యమైన గౌరవమని హర్షం వ్యక్తంచేశారు. విద్య సంస్థాగత నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రమాణాలను అవలంబించడానికి ఉస్మానియా యూనివర్సిటీ నిబద్ధతను ప్రదర్శిస్తుందని ఆయన పేర్కొన్నారు.



# రైఫిల్ పోటీల్లో స్వర్ణం సాధించిన ఈషాసింగ్‌ను సత్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత ఈషాసింగ్ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల మ్యూనిచ్‌లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ (అంతర్జాతీయ షూటింగ్) వరల్డ్ కప్ (రైఫిల్/పిస్టల్) 2026 పోటీల్లో స్వర్ణం సాధించి ప్రపంచ రికార్డు కైవసం చేసుకున్న నేపథ్యంలో ఈషాసింగ్‌ను సిఎం సత్కరించి అభినందించారు.

# మోడీపై ట్రంప్ పొగడ్తలు

ప్రశాంతంగా, కూల్‌గా ఉంటారని వ్యాఖ్య

నిర్ణయాలు తీసుకోవడంలో మోడీ 'టోటల్ కిల్లర్' అని కామెంట్

**పారిస్, జూన్ 17:** ఫ్రాన్స్‌లో జరుగుతున్న జి7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోడీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచ దేశాల నేతలు పాల్గొన్న 'వర్కింగ్ లంచ్' సందర్భంగా మోడీ వ్యక్తిత్వాన్ని, పనితీరును కొనియాడుతూ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, 'ప్రధాని మోడీ ఎంతో ప్రశాంతంగా ఉంటారు. కానీ, నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనొక 'టోటల్ కిల్లర్' తాను ఆయనలా కాదు.. ఒకసారి ఆయన్ని చూడండి' అంటూ చమత్కరించారు.

తన దూకుడు స్వభావానికి, మోడీ నిశ్చల వైఖరికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ట్రంప్ ఈ మాటలతో పోల్చి చెప్పారు. మరోవైపు, ప్రధాని మోడీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య జరగనున్న భేటీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు అమెరికా ప్రతినిధి సెర్గియో గోర్ తెలిపారు. "ప్రధాని మోడీని కలవడం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. వారిద్దరి సమావేశం కోసం మేం ఎదురుచూస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. జి7 సదస్సు వేదికగా ఇరు దేశాధినేతల మధ్య నెలకొన్న సానుకూల వాతావరణానికి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# రేవంత్‌రెడ్డి క్వాష్ పిటిషన్లపై తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** రేవంత్‌రెడ్డి క్వాష్ పిటిషన్లపై హైకోర్టులో ముగిసిన విచారణ ముగిసింది. తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. 2019 హుజూర్‌నగర్ ఉపఎన్నిక సందర్భంగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ పీఎస్ లలో వేర్వేరుగా 5 కేసులు నమోదయ్యాయి. ఈ కేసులు కొట్టేయాలంటూ రేవంత్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు.

# బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థ కార్యాలయంపై దాడులు చేయాలని, రైలు పట్టాలను తొలగించాలని విద్వేషపూరిత ప్ర సంగాలు చేసిన అభియోగాలపై అరెస్టయిన బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ బాల్క సుమన్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. గత నెల 30వ తేదీన ఆయనను అబిడ్స్ పోలీసులు బంజారాహిల్స్‌లోని బిఆర్ఎస్ భవన్‌లో అరెస్టు చేయడం తెలిసిందే. అప్పటి నుంచి సుమన్ చంచ ల్‌గూడ జైల్లో వున్నారు. రెండు వారాలు దాటినా తనకు బెయిల్ రాకపోవడంతో ఆయన హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరపున న్యాయవాది దాఖలు చేసిన ఈ పిటిషన్ గురువారం నాడు విచారణకు వచ్చేవీలుంది.


తెలంగాణ ప్రభుత్వం

కొత్తూరు మునిసిపాలిటీ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

లేఖ నం.:EI/338/KTHR/2026 తేది: 16.06.2026

నమోదిత కాంట్రాక్టరుల నుండి ఈ పనులకు టెండర్‌లు కోరబడుతున్నవి. 1) నగరాభివృద్ధి గ్రాంట్‌ల క్రింద కొత్తూరు మునిసిపాలిటీలో కొత్తూరు గ్రామం యొక్క సర్వే నం. 79, స్టేషన్ తిమ్మాపూర్ యొక్క సర్వే నం.149, తిమ్మాపూర్ గ్రామం యొక్క సర్వే నం.27 వద్ద స్మశానవాటికల అభివృద్ధి. 2) TDA నిధుల క్రింద అదే మునిసిపాలిటీలో వార్డ్ నం.01 వద్ద మహిళాభవన్ నిర్మాణం. 3) నగరాభివృద్ధి గ్రాంట్స్ క్రింద అదే మునిసిపాలిటీలో వార్డ్ నం.03లో మునిసిపల్ కార్యాలయం ప్రక్కన 2BHK అపార్ట్‌మెంట్స్‌కు ప్రాథమిక సౌకర్యాలు త్రాగునీటి సరఫరా, వీధి దీపాలు సిసి రోడ్, మరియు డ్రైన్‌లు ఏర్పాటు చేయుట. 4) అదే మునిసిపాలిటీలో మునిసిపల్ కార్యాలయ భవనంలో ఇన్వర్టర్ సరఫరా మరియు స్థాపన. కొత్తూరు మునిసిపాలిటీ కమిషనర్ వారు 22.06.2026 ఉ.11.00గం. వద్ద వరకు టెండర్లు స్వీకరిస్తారు. మరియు వాటిని అదే తేదీన ఉ.11.30గం. వద్ద టెండర్‌దారులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో వారే తెరుస్తారు. పిలువు ఇచ్చిన టెండర్‌ల యొక్క షెడ్యూల్ క్రింది విధంగా: 1. టెండర్ డాక్యుమెంట్ యొక్క డౌన్‌లోడ్ తేది: 16.06.2026 సా.4.00గం. వద్ద. 2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పై టెండర్‌ల యొక్క దాఖలు : 22.06.2026 ఉ.11.00గం. వద్ద. 3. టెండర్‌లు తెరుచుట: 22.06.2026 ఉ.11.30గం. వద్ద. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారం https://tender.telangana.gov.in వీక్షించండి లేదా కొత్తూరు మునిసిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించండి. కాంటాక్ట్: 7337323577/9848971375.

సం/-. కమిషనర్, కొత్తూరు మునిసిపాలిటీ.

DIPR.NO. 4390-PP/CL/ADVT/1/2026-27 తేది: 17.06.2026



డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II సమక్షంలో

త్రివేణి కాంప్లెక్స్ హైదరాబాద్ వద్ద

OA.No.131 of 2026

వీరి మధ్య:

బ్యాంక్ ఆఫ్ బరోడా (గతంలో విజయా బ్యాంక్), జూబ్లీ హిల్స్ శాఖ, ఫిల్మ్ నగర్, హైదరాబాద్ దాని చీఫ్ మేనేజర్, ప్రాతినిధ్యంచే.

..దరఖాస్తుదారు

మరియు

శ్రీమతి గౌని శివ లక్ష్మి భర్త: శ్రీ జి. నాగేశ్వర్ గౌడ్, మేజర్, స్త్రీ, చిరునామా: 5-3-87, బాలయ్య గౌడ్ భవనం, గౌతమ్ నగర్, సాహెబ్ నగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాద్-500070.

..ప్రతివాది

పత్రికా ప్రకటన ద్వారా సమన్లు

వీరికి:

శ్రీమతి గౌని శివ లక్ష్మి, భర్త: శ్రీ జి. నాగేశ్వర్ గౌడ్, మేజర్, స్త్రీ, చిరునామా: 5-3-87, బాలయ్య గౌడ్ భవనం,గౌతమ్ నగర్, సాహెబ్ నగర్ రోడ్,వనస్థలిపురం, హైదరాబాద్500070.

..ప్రతివాది

మీ నుండి రూ. 23,34,983/- వసూలు కోసం దరఖాస్తుదారు దాఖలు చేసిన పైన పేర్కొన్న O.A. నం. 131/2026కు సంబంధించిన సమన్లను దయచేసి గమనించండి. గౌరవనీయులైన ట్రిబ్యునల్, మీకు తెలుగు మరియు ఆంగ్ల దినపత్రికలలో ప్రకటన ద్వారా సమన్లు జారీ చేయాలని ఆదేశించింది మరియు ఈ కేసు విచారణను 20.07.2026 తేదీకి వాయిదా వేసింది.చట్టంలోని సెక్షన్ 19 యొక్క ఉప-సెక్షన్ (4) ప్రకారం, ప్రతివాదులైన మీకు ఈ క్రింది విధంగా ఆదేశాలు జారీ చేయడమైనది:

(i) కోరబడిన ఉపశమనాన్ని ఎందుకు మంజూరు చేయకూడదో, సమన్లు అందిన ముప్పై రోజులలోపు కారణం చూపాలి;

(ii) అసలు దరఖాస్తులోని క్రమ సంఖ్య 3A క్రింద దరఖాస్తుదారు పేర్కొన్న ఆస్తులు కాకుండా, ఇతర ఆస్తులు లేదా సంపద వివరాలను వెల్లడించాలి;

(iii) ఆస్తుల జప్తు కోసం దాఖలైన దరఖాస్తుపై విచారణ మరియు పరిష్కారం జరిగే వరకు, అసలు దరఖాస్తులోని క్రమ సంఖ్య 3A క్రింద పేర్కొన్న తాకట్టు పెట్టిన ఆస్తులు లేదా ఇతర ఆస్తుల విషయంలో ఎటువంటి లావాదేవీలు జరపకూడదు లేదా వాటిని బదిలీ/విక్రయం చేయకూడదు;

(iv) ట్రిబ్యునల్ ముందస్తు అనుమతి లేకుండా, మీరు సాధారణ వ్యాపార కార్యకలాపాలలో తప్ప, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (భద్రతా హక్కు) కల్పించబడిన ఆస్తులను లేదా అసలు దరఖాస్తులోని క్రమ సంఖ్య 3A క్రింద పేర్కొన్న లేదా వెల్లడించిన ఇతర ఆస్తులు మరియు స్థిరాస్తులను అమ్మకం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా బదిలీ చేయకూడదు;

(v) సాధారణ వ్యాపార కార్యకలాపాలలో సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు మరియు స్థిరాస్తుల అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయానికి మీరు జవాబుదారీగా ఉంటారు మరియు ఆ ఆదాయాన్ని సదరు ఆస్తులపై సెక్యూరిటీ ఇంట్రెస్ట్ కలిగి ఉన్న బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థల వద్ద నిర్వహించబడుతున్న ఖాతాలో జమ చేయాలి.మీరు స్వయంగా లేదా న్యాయవాది ద్వారా 'డెట్స్ రికవరీ ట్రిబ్యునల్- II, 1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001' వారి ముందు 20.07.2026 ఉదయం 10.30 గంటలకు హాజరై, లిఖితపూర్వక వివరణను దాఖలు చేయవలసిందిగా మరియు కోరబడిన ఉపశమనాన్ని ఎందుకు మంజూరు చేయకూడదో కారణం చూపవలసిందిగా ఆదేశించడమైనది.

ఒకవేళ మీరు హాజరు కాకపోతే, మీ గైర్హాజరీలోనే ఈ దరఖాస్తు విచారించబడి, నిర్ణయం తీసుకోబడుతుందని గమనించగలరు.

ఈ రోజు, 2026 జూన్ 11న, నా సంతకం మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రతో జారీ చేయబడినది.

(DRT II, హైదరాబాద్ వారి ఆదేశానుసారం)

సమన్లు జారీకి

అధీకృత అధికారి సంతకం

వార్త

తమకు తెలినిదానిని తెలుసనే విధంగా వ్యవహరించేవారు తమకు తెలిసిన విషయాల్ని గురించి కూడా తెలీనివారుగా పరిగణించబడతారు.

- తిరువళ్లువార్

# ఈ 'సుస్తీ'కి ఆంక్షలతో సరా!

ఉన్న ఫళంగా ఒక్కసారి ప్రభుత్వాలకు ఔషధాలు, వైద్య విధానాలు, చికిత్సలు, వాటి వాల్ల కలిగే కష్టనష్టాలు వికటించడాలు, నిషేధాలు గుర్తొస్తుంటాయి. గత అక్టోబర్ లో జరిగిన సంఘటనలపై చర్యలు కొనసాగింపుగా దగ్గు మందు విక్రయాల విషయంలో కేంద్ర ప్రభుత్వంమరోసారి తుది మార్గదర్శకాలు విడుదల చేసింది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి చేసింది. ఆమేరకు జూన్ 16, 2026న 1945 డ్రగ్స్ రూల్స్‌ను కేంద్రఆరోగ్య మంత్రిత్వశాఖ సవరించింది. గత ఏడాది మధ్యప్రదేశ్‌లో 20 మంది పిల్లలు తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న 'కోల్డ్రిఫ్' దగ్గు సిరప్ తాగి 22మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేస్తూ డాక్టర్ చీటి ఉంటే తప్ప మందుల షాపులలో దగ్గు మందు విక్రయాలను నిషేధించింది. అదే సందర్భంగా దగ్గు సిరప్‌లను షెడ్యూల్ 'కె' డ్రగ్స్ జాబితాలోని క్లాస్ ఆఫ్ డ్రగ్స్ సెక్షన్ 75లో ఎంట్రీ మినహాయింపుల నుంచి తొలగించింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా మెడికల్ షాపులు వినియోగదారులు అడిగితే సదరు కాఫ్ సిరప్‌లను విక్రయించే సౌకర్యం ఉండేది. కొన్ని సందర్భాలలో మందుల షాపులు కొన్న దగ్గు సిరప్‌ల ద్వారా నయమయ్యేది. వికటిస్తే జరిగిందేమిటో తెలిసిందే. కీలెరిగి వాత పెట్టాల్సిన ప్రభుత్వం తయారీ దారుల నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చేయలేకపోయాయి. ఆయా సంస్థలపై కేసులు పెట్టి చేతులు దులుపుకున్నాయి. ఆకారణంచేతనే అనుకుంటా భారత్‌లో తయారీ జరిగే దగ్గు మందుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రజల్ని హెచ్చరించింది. నాసిరకపు దగ్గు మందులతో ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటాయి. ఇలాంటి ఉదంతాలు మరింకెక్కడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన 'హు' సంస్థ కూడా కనీసం మన దేశవ్యాప్తంగానైనా తనిఖీలు చేపట్టలేదు. కేంద్ర ప్రభుత్వం అప్పట్లోనే మినహాయింపు జాబితా నుంచి తొలగించినా, డిసెంబరు నెలలో ఆ విషయాన్ని రీషెడ్యూల్ చేసి కొత్త రూలుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిని ప్రజాభిప్రాయానికి పెట్టడంతో తుది మార్గదర్శకాలకు ఏడు నెలలు పట్టింది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ తాజాగా తుది మార్గదర్శకాలను అధికారికంగా జారీ చేశారు. ఇంత దాకా వెయ్యి మంది జనాభా కన్నా తక్కువ ఉన్న గ్రామాల్లో కొన్ని కంపెనీల దగ్గు మందులను విక్రయించడానికి ఔషధ లైసెన్సులేవి దుకాణాలకుఅనుమతి ఉంది. ఇప్పుడలాంటి మినహాయింపులు రద్దయ్యాయి. అందుచేత ఆ ప్రాంతాలకు తయారీదారులు సదరు దగ్గు మందులు పంపిణీ చేయరు. ప్రజలకు ఇదొక రకమైన అసౌకర్యం. అయినా ప్రజల ఆరోగ్యరీత్యా వైద్యుని చీటీ ద్వారానే దగ్గు మందుల వాడకం మంచిదే. కనుక ప్రాణా పాయం సంభవించదు. ఈరకమైన ఆరోగ్య భద్రత ప్రజ లందరికీ అవసరమే. దీనిని బట్టి ప్రతి చిన్న పల్లెటూరిలో నూ లైసెన్స్ కలిగిన మందుల కంపెనీ ఉండాల్సిందే. దగ్గు మందుల తయారీదార్లు రిటైల్‌గా కొని వాడేవారు సైతం ఎంతో జాగరూకత వహించాలి. దగ్గుమందే కాదు ఏ ఇతర సిరప్ ఆధారిత ఔషధాలనీ డాక్టర్ చీటీ లేకుండా మందుల షాపులు నేరుగా వినియోగదారునికి అమ్మేఅవకాశంలేకుండా ప్రభుత్వ చర్యలు మంచి దారినే ఎన్నుకున్నాయి. కొన్ని నిర్దిష్ట ప్రమాణాలకు లోబడి తయారు చేయాల్సిన దగ్గు మందులు నాణ్యత కోల్పోయినందునే ఎంతోమంది పసి వాళ్ల ప్రాణాలు బలికొన్నాయి. కొన్ని సంస్థలు తయారు చేసిన దగ్గు మందుల్లో డై ఎథిలీన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్ వంటి విషపూరిత పదార్థాలు కలవడంతో చిన్నారుల్లో మూత్రపిండాల వైఫల్యం, శ్వాసకోస సమస్యలు ఏర్పడ్డాయి. ప్రపంచవ్యాపిత ఔషధ భద్రతకు సంబంధించిన విషయమైనా దుర్ఘటనలు జరిగినప్పుడు అతిగా స్పందించి ఆనక వాటి సంగతి మరచిపోవడం ప్రపంచ ఆరోగ్య సంస్థకు కానీ కేంద్ర ప్రభుత్వానికి కానీ మంచిది కాదు. ఇటీవల కాలంలో నాసిరకం దగ్గుమందులే వివిధ దేశాల్లో పసివాళ్ల ప్రాణాలను కబళించిన సంఘటనలు జరిగాయి. ఔషధ తయారీరంగంలో భారత్‌ఎంత ఎదిగినా ఔషధ నియంత్రణ వ్యవస్థ పనితీరుకు చెదలు పట్టినట్లే ఉంది. 2022లో ఆఫ్రికాలోని గాంబియాలో భారత్‌లో తయారైన కొన్ని దగ్గు సిరప్‌లు వాడి డజన్ల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు విడిచారు. ఉజ్బెకిస్థాన్‌లో కూడా భారతీయ తయారీదగ్గుమందు సేవించి చిన్నారులు మృతిచెందడం విచారకరం. కేవలం దగ్గు మందు తయారీలోనే కలుషిత సమస్య వస్తే ఎన్నో ప్రాణాధార మందుల తయారీకి నెలవుగా ఉన్న భారత్ ఔషధ నియంత్రణ మీద పట్టుకోల్పోతోందా అనే అనుమానం రాకమానదు. గతకొన్నేళ్లుగా దగ్గు సిరప్‌లకే ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది పసివాళ్లు బలైపోవడం అందున భారతీయ సిరప్‌ల వలనే అలా కావడం భారత్ ప్రతిష్టకు అవమానకరమే. ఎవరు సేవించినా, ఎక్కడవారయినా కలుషిత మందులకు బలైపోతే, ఆమందుల తయారీదారు శిక్షార్హులే. 2025లో మధ్యప్రదేశ్‌లో కలుషితమయిన 'కోల్డ్రిఫ్' దగ్గు మందు సేవించిన 22 మంది చిన్నారుల మృతికి కారణమైన సంస్థపై ఇంకా కేసు నడుస్తోంది. ఆ ఔషధ పరీక్షల్లో డై ఎథిలీన్ గ్లైకాల్ వంటి విషపూరిత రసాయనాలున్నట్లు తేలింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో వైద్యుల సలహాలేకుండా ఔషధ వినియోగం జరుగుతోందని కేంద్రప్రభుత్వం ఏనాడో గుర్తించినా వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దేశవ్యాప్తంగా ఔషధ పరిశ్రమపై కఠిననిఘా, తరచు తనిఖీలు, ప్రతి బ్యాచ్‌కు ప్రత్యేక నాణ్యతా పరీక్షలు జరుగుతుంటే నాసిరకం, ఔషధపంపిణీకి అడ్డుకట్ట వేయడం సాధ్యమౌతుంది.



ఎన్నో కష్ట నష్టాలు అనుభవించిన తర్వాత కానీ మనిషికి వినయం, వివేకం రాదు.

ఫ్రాంక్లిన్



సంపదను సరిగ్గా వాడుకోవడం తెలీని ధనవంతుల్ని సంపద దుర్వినియోగదారులుగా తయారు చేస్తుంది.

థామస్ ఫుల్లర్

## ప్రజావాక్కు



### దీప వ్యవస్థలను ఏర్పాటు చేయాలి

దేశంలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలువిద్యుత్ పొదుపుపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, ఎంఎంటీఎస్, మెట్రో కేంద్రాల్లో రాత్రి వేళల్లో అవసరానికి మించి వెలిగించేదీపాలను తగ్గించడం ద్వారా గణనీయమైన విద్యుత్ ఆదాసాధ్యమవుతుంది. ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉండే అర్ధరాత్రి సమయాల్లో ప్రతి దీపాన్ని వెలిగించడం అవసరం లేదు. ప్రధాన స్టేషన్లు, లోకల్ రైలు కేంద్రాలు, మెట్రో స్టేషన్లలో కనీస భద్రతకు అవసరమైనంత వెలుతురు మాత్రమే ఉంచి, మిగతా దీపాలను నిలిపివేయవచ్చు. ఇలాచేస్తే ప్రస్తుత వినియోగంతో పోలిస్తే దాదాపు యాభై శాతం వరకు విద్యుత్ ఆదా చేసే అవకాశం ఉంటుంది. ఎంఎంటీఎస్, మెట్రో సేవలు నిర్దిష్ట సమయంతర్వాత నిలిచిపోతాయి కాబట్టి, ఆ సమయంలో అధిక వెలుతురు అవసరం కూడా ఉండదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రాష్ట్రపతి పాలన పెట్టాలి

మనది సెక్యులర్ దేశం. పరిపాలనలో మతం జోక్యం ఉండరాదు. మతం పాలనలో జోక్యంచేసుకోరాదు. మతం దేవుడు వ్యక్తిగతంగానే ఉండాలి. మత ఆచారాలను ప్రభుత్వం పాటించ రాదు. అదే నిజమైన సెక్యులరిజం. ఐతే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుండి ప్రతి పాఠశాలలోనూ గాయత్రీమంత్రాన్ని, వందేమాతరం పూర్తి గీతాన్ని, ఇతర మతపరమైన గీతాలను ఖచ్చితంగా విద్యార్థులచే ఆలపించాలని ఉత్తర్వులు జారీచేయడం రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కడమే అవుతుంది. మన దేశంలో ఏ మత ఆచారాలను పాటించని మానవ వాదులుకూడా ఉన్నారు. కనుక తక్షణమే రాష్ట్రపతి ఛత్తీస్‌ఘడ్‌ప్రభుత్వాన్ని సస్పెండ్‌చేసి రాష్ట్రపతి పాలన పెట్టాలి.

-నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### నీటిని పొదుపుగా వాడుకుందాం

వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా, ఎల్‌నినో ప్రభావం, దృష్ట్యా భవిష్యత్‌లో నీరు లభ్యత ఉండడం చాలా కష్టం. కావున అవసరమైన వరకు మాత్రమే నీటిని వాడుకుందాం. మనం ఏపని చేయాలన్న నీరు లేనిది పని పూర్తి కావడం అసంభవం. కావున మనం నీటిని పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్ తరాలకు నీటిని పొదుపుగా వాడుకుని ముందుకెళ్తేనే మనం బ్రతకగలం.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### జలసంధి పై సంధి కుదిరింది

యుద్ధం చేస్తున్న ఇరాన్, అమెరికా నడుమ శాంతి ఒప్పందం కుదిరినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఆప్రకటనను ఇరుదేశాలూ నిజమేనన్నాయి. ఫలితంగా నెలలతరబడి మూసివేతలో ఉన్న హార్ముజ్ జలసంధి తెరుచుకోబోతుంది. ఈశుభవార్త ప్రపంచ దేశాలకుఊరటనిస్తోంది. కారణం ప్రపంచ ఇంధన అవసరాల్లో ఐదో వంతు భాగం ఆ మార్గం గుండానే రవాణా కావాలి. మూసివేత ఫలితంగా సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడి భారత్ సహా పలు దేశాలు ఇబ్బందులు పడ్డాయి. ఇంకా పడుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదుపులకు లోనైంది. ఇలాంటి పరిస్థితిలో పశ్చిమాసియాలో శాంతి నెలకొనడం అంటేప్రపంచానికి స్థిరత్వం నెలకొనడమే. అయితే ఈ శాంతి ఒప్పందం ఎంతకాలం, ఎంత ప్రభావవంతం అన్నది కాలమే చెప్పాలి. ఎందుకంటే ఇలా శాంతి నెలకొనడం ఇజ్రాయెల్ దేశానికి రుచించదు. భగ్నం చెయ్యడానికి తన వంతు కృషి తను చేస్తుంది. అమెరికా దాని మాట కాదనదు.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### నైపుణ్యం పెంచుకోవాలి

నిరుద్యోగం రోజురోజుకీ పెరిగిపోతుంది దీనికి కారణం ఇటు విద్యార్థులు అటు గవర్నమెంట్. గవర్నమెంట్ ఏమో పాత సిలబస్ అలాగే ఉంచడం, కేవలం సిలబస్ మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ నేటి ప్రపంచానికి ఉపయోగపడే నైపుణ్యాలు ఏమి విద్యార్థులకు నేర్పించడం లేదు. నేటి సాంకేతిక రంగానికి తగ్గట్టుగా సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచాలి. విద్యార్థులు కూడా ఏదో డిగ్రీ చదివామా అని కాకుండా నైపుణ్యం పెంచుకుని భవిష్యత్తులో ఉద్యోగం తెచ్చుకోవాలి.

- రాఘవేంద్ర బాబు, ఈస్ట్ గోదావరి జిల్లా

### పట్టణీకరణతో వేగంగా ఎదుగుతున్న రాష్ట్రం

సేవల రంగంలో తెలంగాణ కర్ణాటకను అధిగమించడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఒక మైలురాయిగానిలిచింది. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని రాష్ట్రం వేగంగా పట్టణీకరణ దిశగా పయనించడంతో సేవల రంగంవిస్తృతంగా అభివృద్ధి చెందుతోంది. ఐటీ, ఫైనాన్స్, విద్య, ఆరోగ్యం, రియల్‌ఎస్టేట్ వంటి విభాగాల్లో తెలంగాణ సాధించిన పురోగతి దేశంలోనే ఆదర్శప్రాయమని చెప్పవచ్చు. ప్రభుత్వం చేపట్టిన మౌలికసదుపాయాల విస్తరణ, పరిశ్రమల ప్రోత్సాహక విధానాలు, డిజిటల్ ఇన్నోవేషన్‌కుఇచ్చినప్రాధాన్యంఈఅభివృద్ధికి బలాలుగా నిలిచాయి.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అన్నామలై కొత్త ఒరవడిని సృష్టించగలరా?

**ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ అండ్ పాలిటిక్‌నిక్స్ కోయంబత్తూర్లో స్థాపించి ట్రయినింగ్ యువతకు ఇచ్చి నిజమైన రాజకీయ నాయకులను తయారు చేయాలని అతని ఆకాంక్ష! వచ్చే సివిక్ అసెంబ్లీ ఎన్నికలతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించాలని అతని సంకల్పం! ఎన్నికల సందర్భంగా ఉచితాల ప్రసక్తి తేకుండా కేవలం విద్య, వైద్యంతో పాటు ఆహారం కొంతమేర ఇళ్ళ సౌకర్యం లాంటి సంక్షేమ పథకాలు ఆచరించి మిగతా ఉచితాలను దూరంగా వుంచి ప్రజా శ్రేయస్సు నిజమైన ప్రజాస్వామ్యంలో సాధించగలుగుతే అన్నామలై రాజకీయాల్లో అందరి కంటే మిన్నగా రాణించగలరు. మూసపోసిన రాజకీయ ఒరవడితో ముందుకు వెళ్తే, 'ఎందరో వున్నారు! అందరికీ వందనాలు చెప్తున్నాం కదా!' అంటారు ప్రజలు! ఉచితాలు ప్రస్తుతం అనుచితాలుగా మారాయి! అన్నామలై ఓపికగా ఎదురు చూడటంతో పాటు సామాన్యుడికి విలువలతో కూడిన జీవితాన్ని అందించాలన్న లక్ష్యంతో అబ్దుల్‌కాలం స్ఫూర్తితో ముందుకు నడుస్తే అంతకంటే కావల్సింది ఏముంది?**



రావులపాటి సీతారాంరావు

తమిళనాడులో సినిమా హీరో విజయ్ ముఖ్యమంత్రిగా ఎన్నికల్లో గెల్చి ఒక చరిత్రనే సృష్టించాడు. ఎన్నో ఏళ్ళ అనుభవంతో పాతుకొని పోయిన పార్టీలు డి.యం.కె. ఏఐడియంకె, వాటితోపాటు నామ మాత్రంగా మిగిలివున్న కాంగ్రెస్‌పార్టీ, ఏదో విధంగా తమిళనాడును వశ పర్చుకోవాలని వ్యూహంతో కొన్నేళ్ల నుంచి కాపేసివున్న బి.జె.పి అన్నీ విజయ్ గెలుపు ముందు తలవొంచక తప్పలేదు. అయితే సంపూర్ణ విజయానికి అడుగు దూరంలో వున్న విజయ్ పార్టీకి సీట్లు తక్కువయినప్పుడువ్యూహం రచించి సరిపడా చిన్నాచితకా పార్టీలను దగ్గరకు చేర్చి సి.యం కుర్చీని విజయ్‌కు వచ్చేట్లు చేయటం జరిగింది. బెల్లం చుట్టూ చీమలు చేరినట్లు అధికారం వున్న విజయ్ చుట్టూ ఎ.ఐ.ఎ.డి.యంకె పార్టీలోని కొందరు ఎం.ఎల్.ఏలు విజయ్ టి.వి.కె. పార్టీలోకి క్యూ కట్టున్నా, అతను ప్రలోభాలు పెట్టకుండా ఎక్కువ ఓటర్లను వశపర్చుకున్నా, ఎన్నికలు ముందు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు స్త్రీలకు, విద్యార్థులకు, యువతకు, వృద్ధులకు సమకూరుస్తానని మాట యిచ్చారు! నిజానికి యితర పార్టీలు అన్ని రాష్ట్రాలలో ఎడాపెడా యిస్తున్న హామీల్లాంటివే! అవి ఏవిధంగా నెరవేర్చ గులుగుతాడని, ఆర్థిక నిపుణులు అప్పుడే పెదవి విరవటం మొదలు పెట్టారు! ఫ్రీ బీస్‌గా రాజకీయ రంగంలో ప్రసిద్ధిగాంచిన ఈ ఉచితాలు ఇవ్వటం సాధ్యమా అన్నది కొత్తగా ఎన్నికయిన విజయ్ కూడా ఆలోచించినట్లు లేదు! ఇప్పుడు ప్రభుత్వ ఖజానాలో తగిన డబ్బులేదు. నిజానికి దాదాపు ఏమీ లేదు అన్న ధోరణిలో మాట్లాడుతున్న ఆ పార్టీ నాయకులే కాదు అతని శ్రేయోభిలాషులు కూడా తలలు పట్టుకొని కూర్చున్నారు. డి.ఎం.కే. నాయకుడు స్టాలిన్ ఆరు నెలల దాకా విమర్శలు కొత్త ప్రభుత్వం మీద చేయనన్నాడు గానీ, మిగతా పార్టీలు కొన్ని తలోరాయి విసురుతుంటే, నియంత్రించుకోలేక, స్టాలిన్ కూడా ఆరు నెలల మాట మరిచిపోయి విమర్శలు ఘాటుగానే కొత్త ప్రభుత్వం మీద మొదలుపెట్టాడు. రాజకీయ నాయకులు సంక్షేమ పథకాల విషయంలో అధికారంలో వున్నప్పుటి మాట తీసి గట్టుమీద పెట్టినప్పుడే పెద్దగా పట్టించుకోని ప్రజలు స్టాలిన్ విమర్శల విషయంలో మాట తప్పుతే దాన్ని తప్పుపట్టారా? అయితే ఈ విషయం అటుంచుతే ప్రజల్లో ముఖ్యంగా ఓటర్లకు అర్థమైన విషయం ఏమిటంటే ఉచితాల హామీలు ఎప్పటికీ నెరవేరేవి కావు అని! విజయ్ ఎన్నికల సందర్భంగా కొంత నిజాయితీతో వ్యవహరించటం వల్ల అతని పట్ల మొగ్గు చూపారు!



హామీలు నెరవేర్చటం అందులో అన్ని హామీలను తు.చ. తప్పకుండా అమలు చేయటం అలవికాని పని! ఈ సందర్భంగా ఇతర పార్టీల్లో వుండి కొంత అనుభవం గడిం చిన తర్వాత బయటకు వచ్చి ఈ మధ్యనే కొత్తగా పార్టీలు పెట్టిన నాయకులు సైతం ఇలాంటి ఉచితాల హామీలు నెరవేర్చటం ఎవరికీ సాధ్యం కాదు అని ఓటర్లకు నచ్చచెప్పి నిజాయితీగా రాజకీయాలు చేయటానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఏర్పడింది! దానిని సద్విని యోగపర్చుకున్న నాయకులే ముందు తరాల వారికి మార్గ దర్శకులవుతారు! రాజకీయాల్లో నిజాయితీని ప్రదర్శించటమే కాకుండా పారదర్శకంగా వ్యవ హరించిన వారు అవుతారు! కొత్తగా పార్టీలు పెట్టినవారిలో తమిళనాడుకు చెందిన అన్నామలైని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి!అతను ఐ.పి.యస్ ఆఫీసర్గా కర్ణాటక రాష్ట్రం లో ఎనిమిదేళ్ళు పనిచేసి సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో ఉన్నతమైన ఉద్యోగాన్ని వదిలి బయటకు వచ్చి ప్రజల్లో మమేకమైనవాడు. బి.జె.పి అధ్యక్షుడిగా తమిళ నాడులో వున్నప్పుడే అతని ప్రతిభా పాటవాలు బయటకు వచ్చాయి!అయితే కాంగ్రెసు మాదిరే మారిపోతున్న బి.జె.పి పార్టీ సాంప్రదాయ పద్ధతులనే అవ లంభించి ఎ.ఐ.ఎ.డి. యం.కే పార్టీలో చీలికతెచ్చి తమిళ నాడును పోయిన ఎన్నికల్లో హస్తగతం చేసుకోవాలని పగటి కలలుకన్నది. కానీ విలువైన అన్నామలైని వదిలేసి సాంప్రదాయ రాజకీయాలకే పెద్దపీట వేయటంతో, అన్నామలై ఆ పార్టీని వదిలేసి'వుయి ది లీడర్స్' అన్న కొత్త ఉద్యమపార్టీని స్థాపించి తమిళనాడులో కొత్తశకానికి నాందీ పలికిన విజయ్ తర్వాత మరొకడిగా గుర్తించబడుతున్నారు. 1.3 మిలియన్ల మంది పార్టీ పెట్టిన వెంటనే అతనితో రాజకీయాల్లో వుండ టానికి సిద్ధం కావటం విశేషంగా చెప్పుకోవాలి! క్షేత్రస్థాయినాయకత్వం ఆర్గానిక్ వ్యవసాయం క్రీడాభివృద్ధి బలోపేతం చేయటం, ఒక ఉద్యమంగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నాడు. 'కలాం స్కూల్ ఆఫ్ ఐడి యాలజీ'ని స్ఫూర్తితో స్వచ్ఛమైన, సామాన్యుడు పాల్గొనే రాజకీయ ఒరవడిని తీర్చిదిద్దాలని అతని ఆలోచన! ద్రావిడ, సాంప్రదాయ వాదాలకు తిలోదకాలివ్వటం అతని లక్ష్యంగా కనపడుతున్నది. ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ అండ్ పాలిటిక్‌నిక్స్ కోయంబత్తూర్లో స్థాపించి ట్రయినింగ్ యువతకు యిచ్చి నిజమైన రాజకీయనాయకులను తయారు చేయాలని అతని ఆకాంక్ష! వచ్చే సివిక్ అసెంబ్లీ ఎన్నికలతో రాజకీయ ప్రస్థా నం ప్రారంభించాలని అతని సంకల్పం!ఎన్నికల సందర్భంగా ఉచితాలప్రసక్తి తేకుండా కేవలం విద్య, వైద్యంతోపాటు ఆహారం కొంతమేర ఇళ్ళ సౌకర్యంలాంటి సంక్షేమ పథకాలు ఆచరించి మిగతాఉచితాలను దూరంగావుంచి ప్రజాశ్రేయస్సు నిజమైన ప్రజాస్వామ్యంలో సాధించగలుగుతే అన్నామలై రాజకీయాల్లో అందరికంటే మిన్నగా రాణించగలరు. మూస పోసిన రాజకీయ ఒరవడితో ముందుకు వెళ్తే, 'ఎందరో వున్నారు! అందరికీ వందనాలు చెప్తున్నాం కదా!' అంటారు ప్రజలు! ఉచితాలు ప్రస్తుతం అనుచితాలుగా మారాయి! అన్నామలై ఓపికగా ఎదురు చూడటంతో పాటు సామాన్యుడికి విలువలతో కూడిన జీవితాన్ని అందించాలన్న లక్ష్యంతో అబ్దుల్‌కాలం స్ఫూర్తితో ముందుకు నడుస్తే అంతకంటే కావల్సింది ఏముంది? ●

# పెరిగిన భూముల విలువలతో ఎవరికి లాభం?

తిప్పర్తి శ్రీనివాస్

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూములు, స్థలాలు, నివాస వాణిజ్య ఆస్తుల మార్కెట్ విలువలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెరిగిన విలువలు అమల్లోకి రావడంతోరియల్ ఎస్టేట్ రంగం, భూ యజమానులు, కొనుగోలుదారులు, నిర్మాణ రంగం, ప్రభుత్వ ఆదాయ వ్యవస్థపై విస్తృత ప్రభావం పడనుంది. ప్రతి కొన్ని సంవత్సరాలకు ఒకసారి మార్కెట్ పరిస్థితులను పరిశీలించి ఆస్తుల విలువలను సవరించడం సాధారణ పరిపాలనా ప్రక్రియే అయినప్పటికీ, ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలు, దాని ప్రయోజనాలు, ప్రజలపై పడేభారం వంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. భూమి అనేది పరిమిత సహజ వనరు. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కారణాల వల్ల భూమికి డిమాండ్ నిరంతరం పెరుగుతోంది. ముఖ్యంగా నగరాలు, పట్టణాలు, జాతీయ రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, కొత్త అభివృద్ధి కేంద్రాల పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. అయితే వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలకు మధ్య చాలా సందర్భాల్లో భారీ వ్యత్యాసం ఉంటుంది. ఈ వ్యత్యాసం కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంతగ్గడమే కాకుండా, లావాదేవీలలో పారదర్శకత కూడా దెబ్బతింటుంది. అందుకే ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విలువలను సవరించడం అవసరమవుతుంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలయ్యే మార్కెట్ విలువలనుప్రభుత్వం ప్రధానంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల లెక్కింపునకు ప్రామాణికంగా ఉపయోగిస్తుంది. మార్కెట్‌లో ఒక ఎకరం భూమి విలువ కోటి రూపాయలు ఉంటే, ప్రభుత్వ రికార్డుల్లో అది చాలా తక్కువగా నమోదై ఉంటే ఆదాయ నష్టం జరుగుతుంది. అందువల్ల వాస్తవ పరిస్థితులకు దగ్గరగా విలువలను తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సవరణలు చేపడుతుంది. రాష్ట్ర ఆదాయ వనరుల్లో రిజిస్ట్రేషన్ శాఖకు కీలకస్థానం ఉంది. సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ వ్యయాలను నిర్వహించేందుకు ఆదాయం అవసరం. ఈకోణంలో చూస్తే భూముల విలువల పెంపు ప్రభుత్వానికి అదనపు ఆదాయాన్ని సమకూర్చే చర్యగా చెప్పవచ్చు. అయితే ఈనిర్ణయం మరో వైపు సాధారణ ప్రజలపై ఆర్థిక భారం పెంచే అవకాశం కూడా ఉంది. కొత్తగా ఇల్లు కొనాలనుకునే మధ్యతరగతి కుటుంబాలు, చిన్న స్థలాలు కొనుగోలు చేసే ఉద్యోగులు, రైతులు అధిక రిజిస్ట్రేషన్ ఖర్చులను భరించాల్సి వస్తుంది. భూమి ధరతో పాటు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా పెరగడంవల్ల మొత్తం కొనుగోలు వ్యయం అధికమవుతుంది. ఇప్పటికే నిర్మాణ సామగ్రి ధరలు, బ్యాంకు రుణాల భారంతో ఇబ్బందిపడుతున్న గృహ కొనుగోలు దారులకు ఇది మరింత భారంగా మారే ప్రమాదం ఉంది. రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ఈ నిర్ణయం మిశ్రమ ప్రభావం చూపుతుంది. కొన్ని ప్రాంతాల్లో పెట్టుబడిదారులు ముందస్తు కొనుగోళ్లు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తారు. మరోవైపు అధిక రిజిస్ట్రేషన్ ఖర్చుల కారణంగాకొన్ని నెలల పాటు కొనుగోలు కార్యకలాపాలు మందగించే అవకాశం ఉంటుంది. అయితే దీర్ఘకాలంలోచూస్తే వాస్తవమార్కెట్ విలువలకు అనుగుణంగా ప్రభుత్వ విలువలు ఉండటంవల్ల భూ లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుంది. నల్లధనం వినియోగం తగ్గి, అధికారిక లావాదేవీలు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం తీసుకునే ఇటువంటి నిర్ణయాల్లో ప్రజల అభిప్రాయాలనుకూడా పరిగణనలోకి తీసుకోవడంఅవసరం. ఒకే విధమైన పెంపు అన్నిప్రాంతాలకు సమానంగా వర్తింపజేయడం కంటే, స్థానిక పరిస్థితులు, అభివృద్ధిస్థాయి, ప్రజల కొనుగోలు సామర్థ్యాన్ని దృష్టిలోఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలి. గ్రామీణప్రాంతాలు, అభివృద్ధి చెందుతున్న మండలాలు, వెనుకబడినప్రాంతాల్లో అధిక పెంపులు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. అందువల్ల శాస్త్రీయ అధ్యయనం, స్థానిక వాస్తవాల ఆధారంగా విలువలను నిర్ణయించడం ఉత్తమమార్గం. వ్యవసాయ భూముల విలువలు పెరగడం రైతుల ఆస్తివిలువ పెరిగినట్లే కనిపించినప్పటికీ, వారసత్వ బదిలీలు, కుటుంబ విభజనలు, విక్రయాల సమయంలో అదనపు ఖర్చులు రావచ్చు. రైతు ప్రయోజనాలను కాపాడేవిధంగా కొన్నిరాయితీలు లేదా ప్రత్యేక విధానాలుండాలి. లేకపోతే భూమి యాజమాన్య మార్పిడి ప్రక్రియరైతులకు భారంగా మారే ప్రమాదంఉంది. భూముల విలువల పెంపుఅనేది కేవలం ఆదాయ సేకరణ చర్యమాత్రమేకాదు. అది రాష్ట్ర ఆర్థికవ్యవస్థ, రియల్ ఎస్టేట్ రంగం, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రవాహం వంటి అనేక అంశాలకు సంబంధించింది. సరైన ప్రణాళికతో, సమతుల్య దృక్పథంతో అమలుచేస్తే ఇదిప్రభుత్వానికి ఆదాయం పెంచడంతో పాటు భూ లావాదేవీల్లో పారదర్శకతను తీసుకురాగలదు. ●



# ఆధునిక రాజకీయంలో 'ప్రసవ' ప్రహసనం

జయసూర్య


సాధ్యమైనంతగా ఎక్కువ మంది పిల్లల్ని కని, భారత దేశ జనాభా శాతం పడిపోకుండా రాజ్యతంత్రం నడపాలని ఢిల్లీ పెద్దల ప్రస్తుత ఆలోచనలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇచ్చారు. ఒక మెట్టు పైకెక్కి ప్రోత్సాహక నగదు కూడా ప్రకటించారు. కుటుంబం, స్త్రీ, పురుష బాంధవ్యంతో ముడిపడ్డ సంతాన ప్రాప్తి, నేటి రాష్ట్ర, కేంద్ర పాలకులను ఇంతగా కదిలించటంలో ఉన్న రాజకీయం బాహాటంగా అంతగా బయటపడకపోయినా అంతర్లీనంగా ఆలోచింప చేస్తోంది. 'అధికస్య అధికం ఫలం' అనేది జనాభా విషయంలో ఆచరణీయ సందేహంగా భావించటానికి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆశయ అంకురార్పణ నాంది అయింది. అదే చంద్రబాబు ఉవాచ. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చినతొలి దశాబ్దాలలో జాతి నేతలు, తిండి గింజల కొరత కారణంగా, కరవు కాటకాల సంక్షోభం ఎదుర్కోవలసి వచ్చింది. పి.ఎల్ 480, పథకం ప్రకారం అమెరికా నుంచి 'ఫుడ్ ఫర్ పీస్ ప్రోగ్రామ్' క్రింద గోధుమల దిగుమతి చేసుకోవలసి వచ్చేది. ఇందిరా గాంధీ ప్రధాని రోజుల నాటికి హరిత విప్లవానికి ప్రణాళికా బద్ధంగా కృషి సత్ఫలితాలు కొంతవరకు ఇచ్చింది. జనాభా తగ్గించుకోవాలనే శాస్త్రీయ అవగాహనకు అవకాశం కలిగింది. ఒక పక్క అధిక దిగుబడి కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కాగా కుటుంబ, సామాజిక పదంగా కుటుంబ నియంత్రణ ద్వారా జనాభా అదుపు కర్తవ్యమైంది. జవహర్‌లాల్‌నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు సమర్థవంతంగా దేశాన్ని నడిపిస్తున్న రోజులవి. 50 కోట్లకు మించని జనాభా వున్న స్వతంత్ర భారత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీజీ స్వయంగా ఇంట్లో కూడా ఒకపూట భోజనం అంటూ భారత జాతికి ఆదర్శనీయమైన సందేశం అందించారు. ప్రజలు అక్షింతలు కూడా అతిజాగ్రత్తగా వాడేవారు. క్రమేపీ ప్రపంచం సాధించిన శాస్త్రీయ విజ్ఞాన ప్రగతి దేశం అందిపుచ్చుకుంది. చైనావంటి దేశాలు సింగిల్ చైల్డ్ పాలసీ నాటికే అమలు చేస్తున్నాయి. మనదేశంలో కూడా అధిక జనాభా, సృష్టించే అరిష్టాలు అధిగమింప చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉవ్వెత్తున కుటుంబ నియంత్రణ సంక్షేమప్రచారం, వైద్య ఆరోగ్య శాఖల అనుబంధంగా సామాన్య జనావళికి చేరువఅయింది. ప్రపంచంలో ఏ మతం అయినా 'సృష్టించటం' ప్రకృతి ధర్మంగా విశ్వసిస్తుంది. ఇస్లాం, క్రైస్తవ, హిందు ఏమత సిద్ధాంతమైనా అందుకే కుటుంబ నియంత్రణను వ్యతిరేకిస్తాయి. కాని ఆటవికం నుంచి ఆధునికం వరకు మానవ ప్రస్థానంలో సైన్స్ నాగరికతా ప్రపంచాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికం స్వరూపానికి, అమెరికా వంటి సంపన్న రాజ్యాల లేమికి ఎంతో వ్యత్యాసం ఉంది. మంది ఎక్కువయితే మజ్జిగ పల్చన చేయటం తప్పదని భారతీయ కుటుంబ వ్యవస్థ గ్రహించింది. నాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక సంతానం వలన కలిగే అనర్థాలనుంచి, కుటుంబాన్ని తప్పించటానికి చేపట్టిన సహాయ చర్యలు ఫలించాయి. నారు పోసిన



వాడే నీరు పోస్తాడనుకొంటే పంట ఎండిపోక తప్పదని సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం పెద్దఎత్తున నియంత్రణ చేపట్టారు. 'ఇద్దరు పిల్లలే ముద్దు' ఆచరణ కారణంగా తల్లీ, పిల్లల ఆరోగ్యం ప్రధానాంశం అయింది. పిల్లలకు మంచి ఆహారంతో పాటు ఎందరో చదువు నేర్పించగలుగుతున్నారు. చింతలు లేని కుటుంబాలు సామాజిక ప్రగతికి దోహదం చేస్తున్నాయి. కుటుంబ నియంత్రణ తన జీవన కల్యాణానికి మార్గం చూపించింది. అందులో ఉత్తరాది కంటే దక్షిణాది రాష్ట్రాల ప్రజలు మరింత చొరవ చూపించారు. విద్యా, వైజ్ఞానిక రంగాలలో దక్షిణాది జనప్రగతి యావద్భారతానికి ఆదర్శమైంది. కాని ప్రస్తుత ప్రధాని మోడీప్రభుత్వం గుర్తించిన, జనాభా ప్రాతిపదికన పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గడం, దక్షిణాది రాజకీయ పార్టీలకు ఆందోళన కలిగించే అంశంగా తలెత్తింది. బహుశా అందుకే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర జనాభా పెరుగుదలకు ప్రజలు సహకరించాలని తిరోగమన రీతిలో పిలుపు ఇచ్చి ఉండవచ్చు. కుటుంబంలో పిల్లలు, తల్లిదండ్రుల బాధ్యత కుటుంబ ఆర్థిక స్థితిగతులు పిల్లలను కనడం, చదువులు, పెళ్లిళ్ళ, ఆరోగ్యాలు ఎన్నో వ్యక్తిగత వ్యవహారాలను బట్టి దంపతులు నియంత్రణ నిర్ణయం తీసుకొంటారు. ఒక విధంగా చెప్పాలంటే బాలకార్మికులపై ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో వ్యవసాయ కార్మిక ఇతర చేతివృత్తుల శ్రామికవర్గాలు తమ పిల్లలను ఆస్తిగా భావించడానికి గండిపడింది. ఆడ, మగ వ్యత్యాసం కూడా తగ్గినట్లు కనపడినా చాలా కుటుంబాలలో మగ పిల్లవాడు శరణ్యం అనే భావన ఉంది. అందుకే ఇంకా భ్రూణహత్యలు, ఆడపిల్లల పట్ల నిరాదరణ కొనసాగుతోంది. సనాతన భారతీయ సమాజంలో మహిళకు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించే అవకాశాలు లేవనే విషయం సుస్పష్టం. పురుష వాంఛలకు వ్యామోహాలకు కుటుంబ అవసరాలకు స్త్రీ బలి అయిన వృత్తాంతాలు కోకొల్లలు. పౌరాణికంగా, ధర్మశాస్త్రాలలో మనం ఎంత ఉన్నతంగా చిత్రీకరించుకున్నా పాతివ్రత్య ధర్మాలు, భర్త శవంతో చితిమంటలకు ఆహుతి, కావటం వంటి అమానుష క్రూరదుష్టిత్వం నుంచి బయట పడటానికి సుదీర్ఘకాలం పట్టింది. కేవలం పిల్లల్ని కనే యంత్రంగా భారతీయ మహిళ ఎంతో హింసా, వేదనలను అనుభవించింది. అటువంటి నేపథ్యం నుంచి ఆటవిక అణచివేత నుండి ప్రస్తుత 21వశతాబ్ది మహిళా ప్రస్థానం అద్భుతంగా విజయాలను సాధిస్తోంది. పురుష ప్రపంచాన్ని శాసించే నిలదీసే వ్యక్తిత్వం ఆధునిక మహిళకు సాధికారత ప్రసాదించింది. నవమాసాలు మోసిన మాతృమూర్తిగా, పాలిచ్చే తల్లిగా, నడిపించే కన్నతల్లిగా ఆమెకు ప్రకృతి సహజమైన ఐశ్వర్యం పిల్లల్ని కనటం. 300 సంవత్సరాల క్రితం కాకతీయ మహారాణి రుద్రమదేవి ప్రసూతి ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పినా, ఇందిరాగాంధీ ప్రధానిగా అత్యవసర పరిస్థితిలో కొన్నివేల కోట్ల మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగినా భారతీయ మహిళను ప్రస్తుతం పూర్తి సాధికారికత సాధించే వ్యవస్థవైపు నడిపిస్తున్నాయి. ఆధునిక కుటుంబ వ్యవస్థలో వివాహిత యువతిగా, గృహిణిగాపిల్లల్ని కనే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కబళించి అధిక జనాభా సృష్టించమని రాజకీయంగా ఎంత ఉన్నతులైనా, ఎంత ప్రబలమైన ఆకాంక్షలున్నా, కారణాలున్నా ప్రలోభపెట్టం, అధికార వ్యవస్థను శాశ్వితంగా పదిలపరచుకోవాలని నిరం తరం తపించే రాజకీయ నేతలకు తగదు. అవాంఛనీయం ప్రసవనంఅంటే ఎక్కువమంది పిల్లలను కనడం. ప్రహసనం అంటేపరిహాసం. భారతీయ మహిళ ప్రసవప్రహసనాన్ని ఆహ్వానిస్తుందా? ●

(రచయిత: సీనియర్ జర్నలిస్ట్)

# ఒప్పందం నచ్చకపోతే మళ్లీ దాడులే




## ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

### 2015లో ఇరాన్‌కు ఒబామా లంచం ఇచ్చారని ఆరోపణ

### జెనీవా వేదికగా అమెరికా, ఇరాన్ డీల్‌పై సంతకాలు!

**పారిస్, జూన్ 17:** అమెరికా– ఇరాన్ మధ్య నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం కుదిరే దశలో ఉన్నవేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒప్పంద ముసాయిదా తనకు నచ్చకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే సున్నితంగా ఉన్న పశ్చిమాసియా పరిస్థితులపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది.

ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో కలిసి మీడియాతో మాట్లాడిన ట్రంప్, అమెరికా–ఇరాన్ మధ్య కుదరబోయే ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదనిచెప్పారు. ప్రస్తుతం అది కేవలం అవగాహన ఒప్పందం మాత్రమేనని పేర్కొన్నారు. 'ఆఒప్పందం నాకునచ్చకపోతే మళ్లీవారిపై కాల్పులు జరుపుతాం. వారి తలలపై బాంబులు వేయడం మొదలుపెడతాం'అంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రవర్తన సరిగా లేకపోయినా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు.

మూడు నెలలకుపైగా కొనసాగుతున్న యుద్ధం ముగింపు దశకు చేరుకుని, అమెరికా, ఇరాన్‌లు మరో 48 గంటల్లో ఒప్పందంపై సంతకాలు చేయనున్నాయి. ఈ తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన సంచలన స్వభావాన్ని బయటపెట్టుకున్నారు. 'ఒప్పందంలోని నిబంధనలు తనకు నచ్చకపోతే, వారు సరిగ్గా ప్రవర్తించకున్నా.. మేము మళ్లీ వారి తలకాయలపై బాంబులు వేస్తాం' అని పేర్కొన్నారు. అయితే, అమెరికా– ఇరాన్ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం 'చాలా బలంగా' ఉందని ట్రంప్ వ్యాఖ్యానించారు. అంతే కాదు, 'అది ఏమిటో ఎవరికీ తెలియదు, కానీ అది చాలా బలంగా ఉంది' అని ఆయన అన్నారు. అమెరికా ఇరాన్ ఒప్పందంపై ప్రకటన చేసినప్పటి నుంచి మార్కెట్లు చాలా సంతోషంగా ఉన్నాయని, సంతకాలు చేసినతర్వాత ఒకటి లేదా రెండు రోజుల్లో హార్మూజ్ జల సంధి తెరుచుకోనుందని చెప్పారు.

'నిజంగా సంతోషకరమైన విషయం ఏమి టంటే, స్టాక్ మార్కెట్ విపరీతంగా పెరిగిపో యింది. అది ఆకాశాన్ని అంటింది. కానీ చమురు ధరలుపడిపోయాయి.. ఇది మాటలకన్నా ఎక్కు వగా మాట్లాడుతుంది' అని ట్రంప్ వ్యాఖ్యానిం చారు.ఇదే సమయంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాపై ఆరోపణలు చేశారు. 2015 అణు ఒప్పందం సమయంలో విమానం నిండా డబ్బు పంపి, ఇరాన్‌కు లంచంఇచ్చారని ఒబామాపై కూడా ట్రంప్ ఆరోపించారు. 'ఒబామా హయాంలో జరి గిన జెసిపిఒఎ ఒప్పందంలో ఆయన బ్యాంకుల నుంచి 1.7 బిలియన్ డాలర్ల నగదును, గ్రీన్ క్యాష్‌ను, ఒక బోయింగ్ విమానంలో ఇరాన్‌కు పంపారు. వారు ఆ విమానం దగ్గర నిలబడి 'ఓరి దేవుడా, ఆయన మనకు ఇస్తున్న ఈడబ్బును చూడండి' అనుకున్నారు. నాదగ్గర దానికి సంబం ధించిన ఫొటోలు ఉన్నాయి'అని ట్రంప్ విలేకరు లతో అన్నారు. 'ఆయన లంచం ఇచ్చి బయటపడ టానికి ప్రయత్నించాడు.. నేను అలా చేయలేదు... ఇరానీయులు ఏం చేశారో తెలుసా? వాళ్లు ఒబామాను చూసి నవ్వి, అతను ఒక వెధవ అని అన్నారు' అని తీవ్రస్థాయిలో విమర్శించారు.



## అణ్వాయుధం కంటే మరో శక్తిమంతమైన వెపన్ ఇరాన్ వద్ద ఉంది: యుఎస్ ఇంటెలిజెన్స్

**వాషింగ్టన్, జూన్ 17:** పశ్చిమాసియా సంక్షోభం, అమెరికాతో కాల్పుల విరమణ నేపథ్యంలో ఇరాన్ అణ్వాయుధంకంటే శక్తిమంతమైన ఆయుధాన్ని సంపాదించింది. అదే చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి. యుద్ధం తర్వాత ఈ జలసంధిపై ఇరాన్ తన పట్టును బిగించిందని తన ఇష్టానుసారం దాన్ని మూసివేసే సామర్థ్యాన్ని సంపాదించుకుందని అమెరికా ఇంటెలిజెన్స్ స్వయంగా తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

ఈ మేరకు ఇంటెలిజెన్స్ వర్గా లను ఉటంకిస్తూ అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం ఒప్పం దంతో సంబం ధం లేకుండా హార్మూజ్‌తో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసే సామర్థ్యం ఇరాన్‌కు ఉందని ఇంటెలిజెన్స్ పేర్కొంది. గల్ఫ్ దేశాల ఇంధప మౌలిక సదుపాయాలపై దాడు లను తనకు అను కూలంగా ఎలా మలుచుకో వాలో నేర్చుకోవడం తోపాటు వాటి విషయంలో అమెరికా బలహీనత కూడా దానికి ఓ ఆయుధంగా మారిందని తెలి పింది. జలసంధిపై దాని నియంత్రణ అణ్వాయుధం కంటే శక్తిమంతమైనదని హెచ్చరించింది. అమెరికా– ఇరాన్ ఒప్పందంలో హార్మూజ్ కీలకం. దాన్ని పూర్తిగా తెరిపించేందుకు ఇరాన్‌తో అమె రికా తీవ్ర చర్చలు జరపాల్సి వచ్చింది. దీన్నిబట్టి హార్మూజ్‌పై టెహ్రాన్ ఎంత పట్టు సాధించిందో స్పష్టమవుతోంది. రెండు రోజుల్లో ఇరుదేశాల మధ్య ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఇంటెలిజెన్స్ రిపోర్ట్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది.

**జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు:** ఇరాన్‌తో ఒప్పందం గురించి అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదనేది తమ ప్రథమ లక్ష్యమన్నారు. హార్మూజ్‌ను పూర్తిగా తెరిచి ఉంచాలన్నారు. దీంతో పాటు ఇరాన్ సముచితంగా వ్యవహరిస్తే దానికి లభించే ఎన్నో ప్రయోజనాలు ఈ ఒప్పందంలో ఉన్నాయన్నారు. అలా కాకపోతే వారికి ఏమీ దక్కదని వ్యాఖ్యానించారు. అయితే, ఆ ప్రయోజ నాలు ఏమిటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

## ఇరాన్‌కు 300 బిలియన్ డాలర్ల సాయం

### యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్



**న్యూయార్క్, జూన్ 17:** అమె రికా, ఇరాన్ దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్ పునర్నిర్మాణం కోసం అమెరికా 300 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేయబోతోందని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ స్పందించారు. ఇరాన్ పునర్నిర్మాణం కోసం అమెరికా 300 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం చేస్తోందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని తేల్చి చెప్పారు. ఆర్థిక సాయానికి బదు లుగా అమెరికా, ఇరాన్ డీల్ షరతులకు కట్టుబడి ఉండే దేశాలు ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టే విధంగా ప్లాన్ చేస్తున్నామన్నారు.

మంగళవారం ఆయన 'ది మెగిన్ కెల్లీ షో'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌కు ఆర్థిక సాయంపై మెగిన్ కెల్లీ జెడి వాన్స్‌ను ప్రశ్నించింది. ఆయన సమాధానమిస్తూ 'ఇరాన్‌కు సమీపంలో మనకున్న అత్యుత్తమ మిత్రదేశాలలో ఒకటైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) గురించే మాట్లాడుకుందాం. ఆ దేశం ఇరాన్‌లో ఒక అణువిద్యుత్ ప్లాంట్‌లో పెట్టుబడి పెట్టాలని అనుకుంటోందని అనుకుందాం. అది సాధ్యం కావడానికి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఉన్న కొన్ని ఆంక్షలను మనం ఎత్తివేయాల్సి ఉంటుంది. అలా చేయకపోతే యుఎఇ.. ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టడం కష్టం' అని అన్నారు.

జెడివాన్స్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'ఇరానియన్లు తమ ప్రవర్తనను మార్చుకోనంత వరకు ఆ దేశంలో పెట్టుబడులు పెట్టడం సాధ్యం కాదు. ఇరానియన్లు గనుక తమ ప్రవర్తనను మార్చుకుంటే ఇతర దేశాలు వారి దేశాన్ని పునర్ని ర్మించడానికి,ఆదేశంలో సంపద సృష్టించడానికి మేము అనుమతిస్తాం' అని ఆయన స్పష్టం చేశారు.

## ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంపై పెట్రోల్ బాంబు దాడి

### 'సిట్'తో దర్యాప్తు, ఇద్దరి అరెస్టు



**రాంచీ, జూన్ 17:** జార్ఖండ్ రాజధాని రాంచీలోని నివారన్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంపై మంగళవారం అర్ధరాత్రి పెట్రోల్ బాంబులు విసిరారు. ఈ ఘటన అక్కడి సిసిటివి కెమెరాల్లో రికార్డయింది. ఇద్దరు యువకులు భవనంవైపు పెట్రోల్ బాంబులు విస రడం అందులో కనిపిస్తుంది. బాంబులలో ఒకటి పేలగా, మరొకటి పేల లేదు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాంగణానికి పెద్దగా నష్టం జరగలేదని సమాచారం. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, దర్యాప్తు చేసేందుకు ఒక సిట్ బృందాన్ని ఏర్పాటుచేశారు. ఈ దర్యాప్తులో డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ బృందాన్ని కూడా రంగంలోకి దించారు. ఘటనా స్థలం నుంచి సేకరించిన ఆధారాలు, సిసిటివి ఫుటేజ్, అదుపులోకి తీసుకున్న అనుమానితుల విచారణ ఆధారంగా పోలీసులు ఘటనల క్రమాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇతర అనుమానితులను గుర్తించి, దాడి వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

## వడోదరలో లారీని ఢీకొన్న బస్సు

### ఏడుగురు మృతి, 28 మందికి గాయాలు




**వడోదర, జూన్ 17:** గుజరాత్‌లోని వడోదర – జారోడ్‌లో బుధవారం తెల్లవారుజామున రాజస్థాన్ నుంచి వస్తున్న ఓ ప్రైవేటు బస్సు ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీ కొంది. ఈ ఘటనలో డ్రైవర్ సహా ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 29 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా, వైద్యచికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. మృతులు, క్షతగాత్రులంతా రాజస్థాన్ వాసులు అధికారులు గుర్తించారు. రోడ్డు ప్రమాద ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. క్షతగాత్రులకు ఆర్థిక సాయంతోపాటు వైద్య ఖర్చులు గుజరాత్ ప్రభుత్వమే భరిస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్ వేదికగా వెల్లడించారు.

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన టెలిగ్రామ్

### కేంద్రం తాత్కాలిక నిషేధంపై సవాల్

### కేంద్రానికి నోటీసులు... నేడు విచారణ

**న్యూఢిల్లీ, జూన్ 17:** మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన తాత్కాలిక నిషేధాన్ని సవాలు చేస్తూ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ తేజస్ కరియా నేతృత్వంలో వెకేషన్ బెంచ్ కేంద్రం స్పందన తెలియజేయాలని కోరింది. రిట్ పిటిషన్‌పై నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, ప్రతివాదులు సంబంధిత పత్రాలతోపాటు తమ సమాధానాన్ని దాఖలు చేయడానికి సేచ్ఛను మంజూరు చేసింది. తదుపరి విచారణను గురువారం మధ్యాహ్నం 2.30గం.లకు వాయిదా వేసింది. 'తాము పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది, అలాగే సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు విన్నాము. ప్రతివాదులు అన్ని పత్రాలతోపాటు తమ సమాధానాన్ని దాఖలు చేయడానికి స్వేచ్ఛ కలిగి ఉన్నారు' అని ఢిల్లీ హైకోర్టు ధర్మాసరం వ్యాఖ్యానించింది. తక్షణ విచారణ కోరుతూ టెలిగ్రామ్ ఈ కేసును వెకేషన్ బెంచ్ ముందు ప్రస్తావించిన తర్వాత ఈ విషయం విచారణకు వచ్చింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) చేసిన సిఫారసుల మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000లోని సెక్షన్ 69ఎ కింద ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు విధించిన ఆంక్షలను టెలిగ్రామ్ సవాలు చేసింది. నీట్ యుజి 2026 రీఎగ్జామ్ నేపథ్యంలో పరీక్షల భద్రత, ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలను అరికట్టేందుకు కేంద్రం టెలిగ్రామ్ యాప్‌పై జూన్ 22 వరకు తాత్కాలిక ఆంక్షలు విధించింది. జూన్ 21న జరగనున్న నీట్ రీఎగ్జామ్‌కు ముందు అక్రమ కార్యకలాపాలు, నకిలీ ప్రశ్నాపత్రాల ప్రచారం, మోసాలను నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు యాప్ యాక్సెస్‌ను పరిమితం చేయడంతో పాటు, కొన్ని ఫీచర్లపై కూడా అదనపు ఆంక్షలు విధించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఈ నిర్ణయం కోట్లాది సాధారణ వినియోగదారులపై ప్రభావం చూపుతోందని టెలిగ్రామ్ వాదిస్తోంది. కేంద్రం జారీ చేసిన ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ అంశంపై అత్యవసర విచారణ చేపట్టాలన్న పిటిషనర్ అభ్యర్థనను జస్టిస్ తేజాస్ కరియా ధర్మాసనం అంగీకరించింది.

## అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్న ఇండో-అమెరికన్ అనిల్ మేనన్



**వాషింగ్టన్, జూన్ 17:** ఇండో–అమెరికన్ వ్యోమగామి అనిల్ మేనన్ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్నారు. అనిల్ జూలై 14న ప్రారంభం కానున్న అంతర్జాతీయ అంతరిక్ష యాత్రకు ఆయన మరో ఇద్దరు వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నాకికినాతో కలిసి వెళ్లనున్నారు. వారు 240 రోజుల పాటు కక్ష్యలో గడపనున్నారు. జూన్ 22న అనిల్ మేనన్ ఇంటర్వ్యూ ఇస్తారని నాసా వెల్లడించింది. భారత్, ఉక్రెయిన్ తల్లిదండ్రులకు జన్మించిన అనిల్ మేనన్ అమెరికాకు చెందిన పౌరుడు. 2021లో ఆయన వ్యోమగామిగా ఎంపికయ్యారు. 2024లో 23 ఆస్ట్రోనాట్ క్లాస్ గ్రాడ్యుయేట్ అయ్యారు. అంతకుముందు హార్వర్డ్ నుంచి న్యూరోబయాలజీలో బ్యాచిలర్ డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్, మెడికల్‌లో మాస్టర్ డిగ్రీలను అందుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆయన వ్యోమగామిగానే కాకుండా ఎమర్జెన్సీ మెడిసిన్ ఫిజిషియన్, మెకానికల్ ఇంజినీర్, అమెరికా స్పేస్‌ఫోర్స్ కర్నల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

వ్యోమగామి కాకముందు అనిల్‌మేనన్ నాసా ఎక్స్‌పెడిషన్ ఫ్లైట్ సర్జన్‌గా పనిచేశారు.అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని వ్యోమగాములకు సహకరించేవారు. 2021లో నాసా తన వ్యోమగాముల బృందంలో అనిల్‌ను ఎంపిక చేసింది. రెండేళ్ల శిక్షణ తర్వాత 2024లో ఆయన వ్యోమగామిగా పట్టభద్రుడయ్యారు. నాటి నుంచి కక్ష్యలోకి తన మొదటి అంతరిక్ష యాత్ర కోసం సిద్ధమవుతున్నారు.

## భారత్‌పై మరోసారి విషం కక్కిన అమెరికా

### సైనిక కమాండ్ పేరు నుంచి 'ఇండో' పదం తొలగింపు

### మరోవైపు పిఒకెను పాకిస్థాన్‌తో కలిపి మ్యాప్ విడుదల

### తీవ్రంగా స్పందించిన భారత్... న్యూఢిల్లీ నిరసన

**న్యూఢిల్లీ, జూన్ 17:** ఇండో– పసిఫిక్ ప్రాంతంలో ఒకప్పుడు భారత్‌ను కీలక భాగస్వామి అని చెప్పిన అమెరికా రక్షణశాఖ తాజాగా గట్టి షాకిచ్చింది. తమ సైనిక కమాండ్ పేరులోని 'ఇండో -పసిఫిక్' నుంచి 'ఇండో' పదాన్ని తొలగించి, మళ్లీ 'యుఎస్ పసిఫిక్ కమాండ్'గా మార్చింది. అలాగే ఈ కమాండ్ ప్రాంతాన్ని తెలిపే భారత చిత్రపటాన్ని మార్చేసింది. మన పిఒకెను పాకిస్థాన్ భూభాగంలో కలిపి చూపించడం తీవ్ర వివాదాస్పదమైంది. జీ7 సదస్సులో మోదీ, డొనాల్డ్ ట్రంప్ భేటీకి ముందే ఈ పరిణామం జరగడం గమనార్హం. అమెరికాకు చెందిన చారిత్రక 'యుఎస్ ఇండోపసిఫిక్ కమాండ్' పేరును మళ్లీ 'యుఎస్ పసిఫిక్ కమాండ్'గా మార్చినట్లు అగ్రరాజ్య రక్షణశాఖ తాజాగా వెల్లడించింది. 'చారిత్రక మూలాలను గౌరవించడం, పసిఫిక్‌లో సేవలందించే సైనికుల్లో స్ఫూర్తి పెంపొందించడం కోసం ఈ కమాండ్‌కు పాత పేరునే కొనసాగించాలని నిర్ణయించాం' అని అమెరికా రక్షణశాఖ పేర్కొన్నది. ఇక ఈ కమాండ్ ఎక్కడెక్కడ పనిచేస్తుందో తెలుపుతూ తమ వెబ్‌సైట్‌లో ఓ ఫొటోను ఉంచింది.




అందులో 'పాక్ ఆక్రమిత కశ్మీర్'ను పాకిస్థాన్ భూభాగంగా చూపించడం వివాదానికి దారితీసింది.

వ్యూహాత్మక రక్షణ వ్యవహారాల్లో భారత్‌ను అగ్రరాజ్యం దూరం పెడుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది క్వాడ్ కూటమి అంతానికి మరో మేకు లాంటిదని కాంగ్రెస్ నేత శశిథరూర్ విమర్శించారు.

## రేపు వాట్సాప్‌నూ బ్యాన్ చేస్తారా?: రాహుల్ గాంధీ



**జైపూర్, జూన్ 17:** నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో 'టెలిగ్రామ్'పై కేంద్రం నిషేధం విధించడాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పు బట్టారు. కేంద్రం చర్య దొంగను పట్టుకోవడానికి బదులుగా బాధితుడి ఇంటి తలుపునకు తాళం వేయడంలా ఉందంటూ ఎద్దేవా చేశారు. నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, చర్చలు, ప్రిపరేషన్ కోసం లక్ష లాది మంది విద్యార్థులు ఎప్పటినుంచో టెలిగ్రామ్‌ను ఉపయో గిస్తున్నారని, దీనిపై నిషేధం విధించడం వల్ల వారు నష్టపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. అసలు ఈ ఆలోచన పేపర్ లీక్‌లు అరికట్టడానికి ఎలా ఉపయోగపడుతుందని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. నిందితులు టెలిగ్రామ్ కాకుంటే వాట్సప్‌లోనూ పేపర్లు లీక్ చేస్తారని అన్నారు. అలాఅని వాట్సప్‌ను కూడా బ్యాన్ చేస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ నిషేధం తీరు పరీక్షల్లో మోసాలకు పాల్పడే పేపర్ లీక్ నెట్‌వర్క్‌లను కాకుండా, విద్యార్థులనే లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఉందని రాహుల్ గాంధీ ఆక్షేపించారు. నీట్ అభ్యర్థులకు జరిగిన అన్యాయం నుంచి దృష్టి మరల్చ డానికే కేంద్రం ఈ ఎత్తుగడ వేసిందని విమర్శించారు.

దేశంలో పదేపదే పేపర్ లీక్‌లకు పాల్పడుతున్న నిందితులపై చర్యలు తీసుకోవడంలో మోదీ ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందన్నారు. ప్రభుత్వ కనుసన్నల్లోనే పేపర్ లీక్ మాఫియా నడుస్తోందని, దానిని కప్పిపుచ్చుకొనేం దుకే పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా బలగాలను మోహరించడం, ప్రశ్నపత్రాలను వైమానిక దళం ద్వారా పంపించడం వంటి నాటకాలు ఆడుతున్నారని ప్రతిపక్షనేత విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం మాట వినకపోతే తమ హక్కులను ఎలా సాధించు కోవాలో యువతకు తెలుసని కాంగ్రెస్ నేత అభిప్రాయపడ్డారు.

## సహజీవనం చేస్తున్న యువతిని చంపిన ప్రియుడు

**బెంగళూరు, జూన్ 17:** కర్ణాటక రాజధాని బెంగళూరులో సహజీవనం చేస్తున్న యువతిని ప్రియుడు హత్య చేశాడు. కర్ణాటకలోని హాస్సన్ జిల్లాకు చెందిన అనూష(20), శరత్(27) ఇన్‌స్టాగ్రామ్ పరిచయంతో ప్రేమించుకుని ఆరునెలలుగా బెంగళూరులో కలిసుంటున్నారు. కొద్దిరోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం జరిగిన గొడవలో ఆవేశానికి గురైన శరత్.. అనూష గొంతునులిమి చంపి పరారయ్యాడు. సోమవారం నిందితుడు తన లాయర్‌కు ఫోన్ చేసి హత్య గురించి చెప్పడంతో ఈ దారుణం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాస్సన్ జిల్లా, సక్లేష్‌పూర్‌కు చెందిన అనూష అనే యువతికి, అదే ప్రాంతానికి చెందిన శరత్ (27) అనే వ్యక్తితో కొంతకాలం క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. తర్వాత ఈ పరిచయం ఇద్దరి మధ్యా ప్రేమకు దారితీసింది. దీంతో ఇద్దరూ బెంగళూరువచ్చి మల్లేశ్వరం ప్రాంతంలో అద్దెకుంటూ సహజీవనం చేస్తున్నారు. శరత్ బెంగళూరులో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. అక్కడ దాదాపు ఆరు నెలలుగా ఇద్దరూ కలిసే ఉంటున్నారు.

ఈ క్రమంలో ఇద్దరి మధ్యా కొద్దిరోజులుగా విబేధాలు చోటు చేసుకున్నాయి. తాజాగా గత శనివారం కూడా ఇద్దరిమధ్యా వాగ్వాదం జరిగింది. ఈ ఘటనలో ఆవేశానికి గురైన శరత్.. అనూషపై దాడి చేసి, ఆమె గొంతు నులిమి చంపేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. తర్వాత సోమవారం తన లాయర్‌కు ఫోన్ చేసి అనూష హత్య గురించి చెప్పాడు. వెంటనే ఆ లాయర్ ఈ విషయాన్ని పోలీసులకు చెప్పాడు. శేషాద్రిపురం పోలీసులు దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువతి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టం అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# సంక్షిప్త వార్తలు

## నీట్ విద్యార్థిని ఆత్మహత్య



**డెహ్రాడూన్, జూన్ 17:** ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌కు చెందిన 23 ఏళ్ల రియాకుమారి ఆత్మహత్య చేసుకున్నది. 'ఐ లవ్ యు' అంటూ ఆమె తన పేరెంట్స్‌కు సూసైడ్ లేఖ రాసింది. మంగళవారం ఉదయం ఆమె తన రూమ్‌డోర్ తీయలేదు. లంచ్‌కు పిలిచేందుకు తల్లి రూమ్‌కు వెళ్లింది. ఆ అమ్మాయి డోర్ ఓపెన్ చేయలేదు. దీంతో తండ్రికి ఈ విషయాన్ని చెప్పింది. బలవంతంగా డోర్ ఓపెన్ చేయడంతో ఆ విద్యార్థిని ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె రూమ్ నుంచి పోలీసులు సూసైడ్ నోట్ రికవరీ చేశారు. 'ఐ లవ్ యు, మమ్మీ, పాపా.. ఎవరి తప్పు లేదు' అంటూ ఆమె హిందీలో ఓ నోట్ రాసింది. అయితే రాత్రంతా చదువుకునే ఆమె, మరుసటి రోజు ఆలస్యంగా నిద్రలేచేదని పోలీసు అధికారి అంకిత్ ఖండారి తెలిపారు. తన సూసైడ్ నోట్‌లో తండ్రిపై ఆమె ప్రేమను వ్యక్తం చేసింది. తన చావుకు ఎవరూ కారణం కాదు అని ఆమె చెప్పింది. తన అసమర్థత వల్లే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆ నోట్‌లో రాసిందామె.

## స్కూల్ కరిక్యులమ్‌లో కేంద్ర జోక్యం వద్దు:కేరళం సిఎం సతీశన్



**తిరువనంతపురం, జూన్ 17:** పాఠశాలల్లో కరిక్యులం ఎంపికచేసే విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండాలని కేరళం ముఖ్యమంత్రి విడి సతీశన్ పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోకూడదని అన్నారు. కేంద్రం రూపొందించిన పిఎం శ్రీ పథకాన్ని పరిశీలించేందుకు నలుగురు మంత్రులతో కూడిన ఉపకమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు సిఎం సతీశన్ బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పిఎంశ్రీ పథకాన్ని అమలు చేసేందుకు పాఠశాలలను ఎంపిక చేసే విషయంలో కూడా రాష్ట్రానికే స్వేచ్ఛ ఉండాలని వ్యాఖ్యానించారు. ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.99 కోట్లు అందా యని తెలిపారు. దీని అమలుకు గత ప్రభుత్వ హయాంలోనే ఒప్పందం జరిగిందని, దీనికి సం బంధించిన నిధులను కూడా ఆ ప్రభుత్వమే తీసుకుందన్నారు. కాబట్టి అనివార్య పరిస్థితుల్లో దీన్ని ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు.

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత శకుంతల మహతో

**కోల్‌కతా, జూన్ 17:** పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఒక పెద్ద విజయం లభించింది. అగ్రశ్రేణి మావోయిస్ట్ నాయకురాలు శకుంతల మహతో అలియాస్ పుష్ప బుధవారం మధ్యాహ్నం కోల్‌కతా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఉమ్మడి బలగాల ఆపరేషన్ సమయంలో ఆమె జార్ఖండ్‌లోని సరండా అడవి నుండి తప్పించుకుని పారిపోయారు. ఆమె పశ్చిమ బెంగాల్‌లో తలదాచుకున్నారన్న ఊహాగానాల మధ్య, మావోయిస్ట్ నాయకురాలు సిపిఐ (మావోయిస్ట్) జోనల్ కమిటీ సభ్యురాలు బుధవారం లాల్‌బజార్‌లోని కోల్‌కతా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయుధాలు, 46 రౌండ్ల బుల్లెట్లతో సహా లొంగిపోయారు. ఆమెపై రూ.10 లక్షల రివార్డు ఉంది.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న ఇ-రిక్షా... ఆరుగురు మృతి

**లక్నో, జూన్ 17:** ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ఈ రిక్షా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్, బదౌన్ జిల్లాలో, బరేలిమధుర హైవేపై బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్వైనా గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు ఒక ఈరిక్షాలో బంధువుల ఇండ్లకు బయల్దేరారు. తమ ఇంట్లో పెళ్లికి ఆహ్వానించడానికి వెళ్లారు. ఈ క్రమంలో హైవేపై వెళ్తుండగా, ముందు ఉన్న ట్రాక్టర్‌ను దాటుకొని ముందుకు వెళ్లేందుకు ఈరిక్షా డ్రైవర్ ప్రయత్నించాడు. ఒక ట్రాక్టర్‌ను దాటుకుని వెళ్తుండగా, ఎదురుగా వేగంగా వస్తున్న మరో ట్రాక్టర్‌ను ఈరిక్షా ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలోని మహిళల్లో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. ఆటో డ్రైవర్ షాని సహా మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జైంది.

# గరిష్ట ప్రతిపాదిత నిల్వ సామర్థ్యానికి అనుగుణంగా జలాశయాల పునరుద్ధరణ

## పూడిక తొలగింపునకు శాస్త్రీయ పద్ధతిలో ప్రణాళికల రూపకల్పన: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** పూడిక తొలగించి జలాశయాలను గరిష్ట ప్రతిపాదిత నీటినిల్వ సామర్థ్యానికి అనుగుణంగా పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడి అన్నారు. బుధవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ జలాశయాలు, నీటిపారుదల ప్రాజెక్టులలో పూడిక తొలగింపు కార్యక్రమాలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వ హిం చారు. గోదావరి, కృష్ణా, ఇతర ఉపనదులపై ఉన్నా ప్రధాన జలా శయాల ప్రతిపాదిత నీటినిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శా ఖ ప్రధాన కార్య దర్శి ఇ. శ్రీధర్, గనుల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నీటిపారుదల శా ఖ సహాయ కార్య దర్శి కె శ్రీనివాస్, ఇ.ఎన్.సి ఓ. రమేశ్‌బాబు తది తరులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జలాశయాల నిల్వ సామర్థం పెరగడం వల్ల నీటి భద్రత మెరుగుపడటంతోపాటు సాగునీటి విస్తీర్ణం పెరుగుతుందని, వరద ముప్పు కూడా తగ్గుతుందన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పూడిక తొలగింపు నమూనాలను సమగ్రంగా అధ్యయనంచేసి తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయగల ఉత్తమ విధానాలను గుర్తించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

అంతేగాకుండా జలాశయాల్లో పూడిక నిర్వహణ, పూడిక తొలగింపుపై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ మార్గ దర్శకాలు, విధానాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల అనుభవాలను ప్రస్తావిస్తూ, పూడిక తొలగింపు వంటి నివారణ చర్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు.

కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్ జిల్లాలోని మంగళం జలాశయం నుంచి 2017 పూడిక తొలగించడం వల్ల ఆర్థికపరమైన లబ్ధి కలగడమే కాకుండా నీటి నిల్వ సామర్థ్యం ప్రతిపాదిత స్థాయిలోకి వచ్చిందని అదే విధానం ఇక్కడ ఆచరించాలని అధికారులను కోరారు.

కడెం ప్రాజెక్టులో పూడిక తొలగింపు పనులు చేపడుతున్న సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సమీక్షించారు. అలాగే లోయర్ మానేరు డ్యామ్, మిడ్‌మానేరు రిజర్వాయర్‌లలో జరుగుతున్న పూడిక తొలగింపు పనుల పురోగతిని కూడా పరిశీలించారు. పనుల వేగాన్ని పెంచేందుకు, కార్యాచరణలో ఉన్న అడ్డంకులను తొలగిం చేందుకు ఆచరణాత్మక పరిష్కారాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిజాంసాగర్ ప్రాజెక్టుల ప్రధాన ఇంజినీర్లు ఆయా ప్రాజెక్టుల్లో పూడిక పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి, కోల్పోయిన నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు చేపట్టగల చర్యలపై నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని జలాశయాల్లో పూడిక తొలగింపు కార్య క్రమానికి ఆపరేషన్, మేయింటెనెన్స ఇంజినీర్‌ఇన్‌చీఫ్‌నేతృత్వం వహిస్తారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులు, జలాశయాల్లో పూడిక తొలగింపు కోసం తక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా, దీర్ఘకాలిక వరద నియంత్రణ అవసరాలకు కూడా ఉపయోగపడే విధంగా ఆచరణాత్మక, స్థిరమైన శాస్త్రీయ నమూనాను రూపొందించాలని అధికారులనుఆదేశించారు.

# నేడు గాంధీభవన్‌లో ఆదివాసీల సత్యాగ్రహదీక్ష

## ఎఐసిసి ఆదివాసీ వైస్‌చైర్మన్ బెల్లయ్య

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** బిజెపి దేశవ్యాప్తంగా రాజ్యసభ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, ఓట్ల దొంగతనం, సీట్ల దొంగతనా నికి పాల్పడుతున్న తీరును ఎండగడుతూ గురువారం సత్యగ్రహ దీక్షను గాంధీభవన్‌లోని గాంధీ విగ్రహం వద్ద చేపడుతున్నామని ఎఐ సిసి ఆదివాసీ కాంగ్రెస్ ఆలిండియా వైస్‌చైర్మన్ బెల్లయ్యనాయక్ తేజావత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాన్ని దొంగతనం చేస్తున్న తీరుకు వ్యతిరేకించే ప్రజాస్వామిక ప్రియులు సత్యాగ్రహదీక్షకు స్వచ్ఛందంగా హాజరుకావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఉదయం 10 గంటల నుంచి ధర్మాగ్రహంతో నిరసన చేపడుతున్నామని ఆయన వివరించారు. నాయకులు, కార్య కర్తలు ఈ ఆహ్వానాన్ని మన్నించి హాజరు కావాల్సిందిగా కోరారు. రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో ఈనెల 20న సత్యాగ్రహదీక్ష చేపడుతున్నామని తెలంగాణ ఆర్‌జిపిఆర్‌ఎస్ చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ తెలిపారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించి ఆమెను పోటీలో లేకుండా బిజెపి చేసిన కుట్రను ప్రతిఒక్కరు నిరసించేందుకు శనివారం ఉదయం పది గంటల నుంచి మూడు గంటల వరకు జరిగే సత్యాగ్రహదీక్షకు హాజరుకావాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య విలువలు పరిరక్షిం చేందుకు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

# ఖరీఫ్‌కు పకడ్బందీ సన్నాహాలు

## సాంకేతికతతో సాగుకు కొత్త దిశ

## ఏడు వరి రకాలకే ప్రాధాన్యం

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ సాగుకు పకడ్బందీ సన్నాహాలు చేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధ వారం జరిగిన సమా వేశంలో మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్, మిల్లర్ల సూచనలు, ఎగుమతి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు వరి రకాల విత్తనాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడు వంగడాలైన సాంబమసూరి, తెలంగాణ సోనా, హెచ్‌ఎంటీ సోనా, జై శ్రీరామ్, కూనారం సన్నలు, సిద్ధి, కేఎన్‌ఎం7715 రకాల విత్తనాలను ఎలాంటి కొరత లేకుండా రైతులకు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. గతంలో రాష్ట్రంలో దొడ్డు రకాల సాగు 60 శాతం, సన్న రకాల సాగు 40 శాతం ఉండేదని, ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించిన తర్వాత పరిస్థితి మారి ప్రస్తుతం సన్న రకాల సాగు 60 శాతానికి చేరుకుందన్నారు. రైతులకు విత్తనాల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకూడదని స్పష్టం చేశారు. విత్తన సబ్సిడీపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు, వ్యవసాయ యాంత్రీకరణ పథకం తరహాలో సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విత్తనాల పంపిణీ కోసం అవసరమైతే రైతు వేదికలను ప్రత్యేక కేంద్రాలుగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందని చెప్పారు. సమావేశాల్లో వ్యవసాయ శాఖ సంచాలకుడు డా. బి. గోపి తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాలు

## మాలిక్యులర్ బ్రీడింగ్, మార్కర్ అసిస్టెడ్ సెలక్షన్ ద్వారా అభివృద్ధి

## హైదరాబాద్‌లోని భారత్ వరి పరిశోధనా సంస్థ రూపకల్పన

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులు పంట దిగుబడులకు ముప్పుగా పరిణమిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని భారత వరి పరిశోధనా సంస్థ కొత్త వంగడాలకు రూపకల్పన చేసింది. అధిక దిగుబడినిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకునే, జీవబలవర్ధక వరి రకాలను అభివృద్ధి చేసింది. దీనికి సంబంధించి మంగళవారం పరిశోధనా కేంద్రం అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ నూతన వంగడాల్లో డీఆర్‌ఆర్ ధాన్ (మహాజ్య), డీఆర్‌ఆర్ ధాన్ 89 (సూపర్ స్వర్ణ) నుండి డీఆర్‌ఆర్ ధాన్ 91 వరకు ఉన్నాయి. ఈ రకాలను వివిధ పర్యావరణ ఒత్తిళ్లు, పోషకాహార లోపాలను ఎదుర్కొనేందుకు అనువుగా రూపొందించారు. నిర్దిష్టమైన, కావలసిన జన్యువులను ప్రవేశపెట్టడానికి, అధునాతన మాలిక్యులర్ బ్రీడింగ్, మార్కర్ అసిస్టెడ్ సెలక్షన్ (ఎమ్ఎఎస్) పద్ధతులను ఉపయోగించి శాస్త్రవేత్తలు వీటిని అభివృద్ధి చేశారు. ఈ సంస్థ, డి.ఆర్.ఆర్. ధాన్ 92 నుండి 101 వరకు గల మరికొన్ని వాతావరణ మార్పులను తట్టుకోగల వరి రకాల పరీక్షలను కూడా పూర్తి చేసింది. గెజిట్ నోటిఫికేషన్ అనంతరం వాటిని విడుదల చేసేందుకు ఎదురు చూస్తోంది. ఈ సరికొత్త రకాలు పంట కాల వ్యవధిని తగ్గించడానికి, ఎల్‌నినో సంబంధిత ఒత్తిడిని తట్టుకోవడానికి, హెక్టారుకు 40 క్వింటాళ్లకు పైగా దిగుబడినిచ్చే సామర్థ్యాన్ని అందించడానికి రూపొందించబడ్డాయని తెలిపారు. రాజేంద్రనగర్‌లో ఐఐఆర్‌ఆర్ ఏర్పాటు చేసిన రూ. 12 కోట్ల కొత్త స్పీడ్‌బ్రీడింగ్ సెంటర్, కొత్త రకాల అభివృద్ధిని వేగవంతం చేసింది.

అధిక దిగుబడినిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకునే, మరియు వ్యాధులను నిరోధించే రకాలను రైతులకు వేగంగా అందించడమే దీని ప్రధాన ప్రయోజనంగా వెల్లడించారు. అభివృద్ధికి తక్కువ సమయం పట్టడం వల్ల, కొత్తగా తలెత్తే తెగుళ్ల బెడదకు లేదా వాతావరణ మార్పులకు మనం మరింత వేగంగా స్పందించి, నిర్దిష్ట వ్యవసాయపర్యావరణ వ్యవస్థలకు అనువైన రకాలను మునుపటి కంటే ముందే విడుదల చేయనున్నట్లు వివరించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏర్పడే వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ధృవీకరించబడిన, స్థానికంగా అనువైన, వ్యాధి నిరోధకత, దిగుబడి సామర్థం నిరూపించబడిన రకాలను నాటాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను ఉపయోగించడం వల్ల, ముఖ్యంగా అనిశ్చిత వాతావరణ పరిస్థితులలో, పంట భద్రత మరియు రాబడులు మెరుగుపడతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

# నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న బిఆర్‌ఎస్

## గత సర్కారు పాపమే ఫీజు రీయింబర్స్‌మెంట్ జాప్యం

## ప్రజలతో ముఖాముఖిలో మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ నిరాధారమైన ఆరోప ణలతో ప్రజాప్రభుత్వం చేసే అభివృద్ధి సంక్షేమం అడ్డుకొంటుందనీ మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ఆరోపించారు. బుధవారం మంత్రి అజారుద్దీన్ ప్రజలతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొని విన్నపాలు స్వీకరించారు. వినతలు ఇచ్చేవారితో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఉన్నదే పేద ప్రజల కోసం అని భరోసా ఇచ్చారు. విన్నపాల స్వీకరణ అనంతరం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలతో ప్రజలు వచ్చారు సుమారు 200 పైగా అప్లికేషన్స్ వచ్చాయనీ, నాకు సాధ్యమైనంత వరకు వచ్చిన పిటిషన్ పై అక్కడే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశాననీ తెలిపారు. 50 పిటిషల సమస్య ఇచ్చిన వెంటనే కలెక్టర్ తో మాట్లాడి పరిష్కరించాననీ చెప్పారు..తెలంగాణ అభివృద్ధి కోసం సిఎం ఎంతో కష్టపడి 18గంటలకుపైగా పని చేస్తున్నారనీ టిపిసిసి చీఫ్ ప్రజలతో ముఖాముఖీ అనే మంచి కార్యక్రమం పెట్టి ప్రజల వద్దకు ప్రభుత్వంను తీసుకొచ్చారని అజారుద్దీన్ వివరించారు. ప్రజలు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నా ప్రతిపక్షం లో ఉన్నారు కాబట్టి విమర్శలు చేస్తున్నారనీ విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు ఆధారాలు లేకుండనే, టెండర్ లో స్కామ్ అంటూ మాట్లాడుతూ ప్రజలను అనిశ్చితికి గురిచేస్తున్నారనీ ఆరోపించారు. పబ్లిక్‌ను డైవర్ట్ చేయడానికే బిఆర్‌ఎస్ నేతలు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు. ఫీజ్ రీ ఎంబర్స్మెంట్ ఆలస్యంగా రావడానికి పాపం గత ప్రభుత్వానిదనీ ఆయన అన్నారు. మా ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ జాప్యం సమస్యను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తోందనీ త్వరలోనే సమస్య ని సిఎం పరిష్కరిస్తారనీ ఆశాభావం వ్యక్తంచేశారు. తెలంగాణలో హింసాయుత వాతార్ణం లేదని ఐతే ఎక్కువ శాతం మర్డర్ లు కుటుంబాలు సమస్య తో జరుగుతున్నాయనీ ఇలా మర్డర్లు చేసు కోవడం మంచిది కాదనీ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి వాటిపై చాలా కఠినంగా వ్యవరిస్తున్నారనీ చెప్పారు. సర్‌పై తగిన చర్యలు తీసుకుంటున్నాము. బీహార్, బెంగాల్ లో చూసాము ఎక్కువ ఓట్లు మైనారిటీ లవి తొలగించారనీ దీని పై చాలా జాగ్రత్తగా ఉండాలని పబ్లిక్ ని కోరారు. మేము కూడా నిజమైన ఓట్లు పోకుండా చూసుకుంటున్నామనీ అన్నారు.

# ఖరీఫ్ నాట్లకు తొందరపడొద్దు

## నీటి లభ్యత నిర్ధారణ తర్వాతే నారు పోయాలి

## రైతులకు వ్యవసాయ్య వర్సిటీ అలర్ట్

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రుతుపవనాలు బలహీనపడటం, వర్షాలు ఆలస్యం కావడం వల్ల తొందరపడి వరి విత్తనాలు వేయవద్దని రైతులకు తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యా లయం సూచించింది. తేమ, నీటి ఎద్దడి సమస్యల నుంచి పంటలను కాపాడటానికి, ప్రాజెక్టులు లేదా కాలువల ద్వారా నీటి లభ్యత నిర్ధారించుకున్న తర్వాతే నారు పోసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. జూన్ మధ్యకాలం దాటినా రుతుపవనాలు విస్తరించకపోవడంతో, వర్షాధారంగా వరి వేస్తే విత్తనాలు మొలకెత్తక నష్టం జరిగే ప్రమాదం ఉందని తెలిపింది. 50 నుండి 75 మి.మీ. వర్షపాతం కురిసిన తదుపరి నేలలో తగినంత తేమ నమోదైన తర్వాతే వ్యవసాయ పనులు చేపట్టాలని స్పష్టం చేసింది. ఒక వారం వ్యవధిలో తేలికపాటి నేలల్లో 50 నుండి 60 మిల్లీ మీటర్లు, బరువు నేలల్లో 60 నుండ 75 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత లేదా 15 నుండి 20 సెంటీమీటర్ల లోతు నేల తడిసిన తర్వాతనే రైతులు వర్షాధార పంటలైన పత్తి, సోయాచిక్కుడు, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, మినుము, ఆముదం వంటి పంటలు సాగు చేయాలని వివరించింది. నైరుతి రుతుపవనాల ద్వారా ఈ నెలలో ఉత్తర, దక్షిణ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో సాధారణకంటే తక్కువ వర్షపాతం, మిగిలిన జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నందున అధిక తేమ, నీటి ఎద్దడి నుండి ఆరుతడి పంటలను కాపాడుకోవడానికి పంటలను వాలుకు అడ్డంగా, బోదెలు-కాలువల పద్దతిలో, ఎత్తుమడులు, కాలువల పద్ధతిలో విత్తుకోవాలని యూనివర్సిటీ ఆగ్రో క్లైమేట్ రీసెర్చ్ యూనిట్ హెడ్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి లీలా రాణి పేర్కొన్నారు. చెరువులు, కుంటలపై ఆధారపడే రైతులు కాకుండా, కేవలం నిరంతర నీటిపారుదల వసతి ఉన్న రైతులు మాత్రమే వరి సాగును చేపట్టాలని సూచించింది. ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో రైతులు తక్కువ నీటిని వినియోగించుకునే ఆరుతడి పంటలను ఎంచుకోవడం మంచిదని తెలిపింది.

# రూ.2 వేల కోట్ల రుణం తీసుకున్న సర్కార్

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్ల రుణం తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన సెక్యూరిటీ బాండ్ల బహిరంగ వేలంలో ఈ రుణాన్ని సేకరించింది. ఈ రుణ మొత్తంలో 7.43 శాతం వార్షిక వడ్డీకి, ఏడేండ్ల కాల పరిమితితో రూ.750 కోట్లు, 7.63 శాతం చొప్పున వడ్డీకి, 11 ఏండ్ల కాల పరిమితితో రూ.500 కోట్లు, 7.79 శాతం మేర వడ్డీకి 21 ఏండ్ల కాలపరిమితితో రూ.750 కోట్లు తీసుకున్నట్టు రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించారు. కాగా ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలోని తొలి త్రైమాసికంలో మొత్తం రూ.18,900 కోట్ల రుణాలు సమీకరిస్తామని రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పంపిన ఆర్థిక శాఖ ఇప్పటికే ఏప్రిల్‌లో రూ.6,900 కోట్లు, మే నెలలో రూ.6 వేల కోట్లు, జూన్ 2న రూ.4 వేల కోట్ల చొప్పున రుణం సమీకరించింది. తాజాగా మరో రూ.2 వేల కోట్ల అప్పు తీసుకోవడంతో తొలి త్రైమాసికంలో ఆర్బీఐ నుంచి సమీకరించాలనుకున్న రూ.18,900 కోట్ల రుణాలు పూర్తయ్యాయి.

# వివిహెచ్‌ను కలిసిన జగ్గారెడ్డి దంపతులు

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ, అభివృధి శాఖ సలహాదారులు వి.హనుమంతరావు సెక్రటేరియట్ లో బుధవారం జగ్గారెడ్డి దంపతులు కలిసి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ఆయన సతీమణి నిర్మల మంగళవారం సంగారెడ్డిలో పార్టీ కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉండగా రాలేకపోయాని విహెచ్‌కు వివరణ ఇచ్చుకున్నారు. భారత ప్రధానిగా రాహుల్‌గాంధీ ఢిల్లీ పీఠంపై నిలిపేందుకు విహెచ్‌కు దేశవ్యాప్తంగా పర్యటన చేసే శక్తి ఆయురారోగ్యాలు దైవం ఇవ్వాలని ఈ సందర్భంగా దంపతులు ఇద్దరు కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.




ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలతో జరిగిన భేటీలో మాట్లాడుతున్న నిఘా విభాగం అదనపు డిజి విజయ్‌కుమార్. చిత్రంలో ఓఎస్‌డి కమలాసన్‌రెడ్డి, డిసిపి రితిరాజ్ తదితరులు

# ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు

## నిఘా విభాగం అదనపు డిజి విజయ్‌కుమార్ హెచ్చరిక

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వున్న ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, కేంద్రం జారీచేసిన లైసెన్స్‌తో పాటు రాష్ట్రం నుంచి తప్పకుం డా లైసెన్స్ పొందాలని నిఘా విభాగం అదనపు డిజి విజయ్ కుమార్ తెలిపారు. ఈ వి షయంలో ఎవరికీ మినహాయింపు లేదని ఆయన స్పష్టం చేశారు. లక్‌డికాపూల్‌లో గల నిఘా విభాగం కార్యాలయంలో ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీల నిర్వాహకులతో బుధవారం నాడు ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు ఆ యా ప్రాంతాల లో పోలీసులకు శాంతి భద్రతల నిర్వహణ, నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. ఏజెన్సీలు గార్డుల ఎంపిక సమయ ంలో అన్ని విషయాలను గమనించాలని, వారి గత చరిత్రను చూడాలని, నేర చరిత్ర వుంటే పోలీసులకు తెలపాలని ఆయన కోరారు. గార్డుల కు సంబంధించిన పూర్తి వివరాలు ఏజెన్సీలు కలిగి వుండాలని, పోలీసు వెరిఫికేషన్ లేకుండా ఎవరినీ ఉద్యోగంలో తీసుకోవ ద్దని ఆయన తెలి పారు. ఇటీవల పలుచోట్ల గార్డులు నేరాలకు పాల్పడిన ఉదంతాలు వుండడంతో వీరి విషయంలో జాగ్రత్తగా వుండాలని ఆయన సూచించారు. దీ ంతో పాటు గార్డులకు నిబంధనల మేరకు వేతనాలు చెల్లించాలని, వారికి వసతులను కల్పించాలని విజయ్ కుమార్ నిర్వాహకులను కోరారు. ఈ సమావేశంలో నిఘా విభాగం ఓఎస్‌డి కమలాసన్ రెడ్డి, డిసిపి రితిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ మెడికల్ స్టోర్ల కేంద్రాలకు శాశ్వత భవనాలు

## టెండర్లలో పారదర్శకత కోసం 5 కమిటీలు

## అన్ని స్థాయిల ఆస్పత్రులకు ప్రామాణిక ఎక్విప్‌మెంట్ జాబితా

## సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహా ఆదేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాలభివృద్ధి సంస్థ (టిజిఎంఎస్ఐడిసి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ (సిఎంఎస్) ల పనితీరుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ కేంద్రాలకు 15 శాశ్వత భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఎంసిడీసీ అధికారులను ఆదేశించారు. సంస్థ ద్వారా కొనుగోలు చేస్తున్న మందులు, సర్జికల్స్, రీజెంట్స్, ఎక్విప్మెంట్స్ కొనుగోలు చేస్తున్న టెండర్లను పారదర్శకంగా ఉండేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. టెండర్లలో పారదర్శకతను మరింత పెంచేందుకు ప్రస్తుతం ఉన్న 2 కమిటీలకు అదనంగా మరో 3 కమిటీలను కొత్తగా ఏర్పాటు చేసి, మొత్తం 5 కమిటీలను నియమించాలని మంత్రి ఆదేశించారు. సంస్థలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులను తక్షణమే బదిలీ చేయాలని మంత్రి సంస్థ ఎండీ గౌరవ్ ఉప్పల్‌ను ఆదేశించారు. డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులలో టిజిఎంఎస్ఐడిసి ద్వారా కొనుగోలు చేస్తున్న మందులు, ఎక్విప్మెంట్స్, సివిల్ వర్క్స్‌లను రెగ్యులర్ గా పర్యవేక్షి ంచడానికి తక్షణమే నోడల్ ఆఫీసర్స్ ను నియమిం చాలని మంత్రి ఆదేశిం చారు.

టిజిఎంఎస్ఐడిసిలో టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తున్న మందులు, ఎక్విప్మెంట్, సర్జికల్, రీజెంట్స్‌లను నెలవారీగా, విధిగా సమీక్షి ంచు కోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని స్థాయిల ఆసుపత్రులకు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు) అవసరమైన ఎక్విప్మెంట్‌కు సంబంధించి ఒక ప్రామాణిక జాబితాను తయారు చేసి, నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీని వలన అన్ని స్థాయిల ఆసుపత్రులలో ఏకరూపత ఉంటుందన్నారు. .మందుల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు క్యూర్ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న 2 సిఎంఎస్ కేంద్రాలకు అదనంగా మరో 4 కొత్త సిఎంఎస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు .ఈ సమీక్షలో హిమోఫిలియా బాధితులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. హిమోఫిలియా బాధితులకు నెల వారిగా అవసరమైన మందులను ఉచితంగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మందులను జనరల్ ఆసుపత్రుల ద్వారా బాధితులకు అందుబాటులో ఉంచాలని మంత్రి స్పష్టం చేశారు. హిమోఫిలియా-ఎ రోగులకు ఉపయోగించే ఎమిసిజుమాబ్ మందులను ప్రస్తుతం ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ హాస్పిటల్ లో అందుబాటులో ఉందని మంత్రి కి కార్పొరేషన్ అధికారులు వివరించారు. అదనంగా ఖమ్మం, వరంగల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులు ఆదేశించారు.

# ప్రభుత్వం వేలం వేసిన భూమి తమదే

## హైకోర్టులో స్టేట్ బ్యాంక్ రిట్ పిటిషన్

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** హైదరాబాద్ లోనే అత్యంత ఖరీదైన ప్రాంతమైన రాయదుర్గం భూముల వేలం చుట్టూ లీగల్ వివాదం చోటు చేసుకుంది. ప్రభుత్వం వేలం వేసిన భూమిలో కొంత భాగం తమదేనని పేర్కొంటూ ఎస్బీఐ యాజమాన్యం బుధవారం తెలంగాణ హైకోర్టు లో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. రాయదుర్గం పరిధిలోని ఐటీ హబ్లో తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన భూముల వేలంపై దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కాగా గత నెల 28న రాయదుర్గం పరిధిలో ఉన్న నాలెడ్జ్ సిటీలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూములను తెలంగాణ సర్కార్ పబ్లిక్ ఆక్షన్ ద్వారా విక్రయించింది. ఈ వేలంలో ఒక్కో ఎకరం కనీస ధర రూ.170 కోట్ల చొప్పున ప్రభుత్వం నిర్ధారించగా, ఊహించని విధంగా రికార్డు స్థాయి ధరలు పలికాయి. ఇందులో ఓ ప్లాట్‌ను ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ గౌరా వెంచర్స్ ఏకంగా ఎకరం రూ.237 కోట్ల చొప్పున వేలంలో దక్కించుకుని దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే రూ.కోట్ల ఆదాయం కోసం ప్రభుత్వం నిర్వహించిన బహిరంగ వేలంపై ఎస్బీఐ ఊహించని షాకిచ్చింది. సదరు సర్వే నంబర్ 83/1 పరిధిలోని భూమిలో 5 ఎకరాల స్థలం తమ బ్యాంకునకు చెందినదని హైకోర్టులో ఎస్బీఐ వేసిన పిటీషన్‌లో వెల్లడించింది, దానికి సంబంధించిన పూర్తి హక్కులు తమ వద్దే ఉన్నాయని పేర్కొంది. తమ యాజమాన్యంలో ఉన్న భూమిని ప్రభుత్వం ఏకపక్షంగా ఎలా వేలం వేస్తుందని ప్రశ్నిస్తూ, ఈ వేలం ప్రక్రియను నిలిపివేయాలని కోర్టును ఆశ్రయించింది. ఈ భూ వివాదానికి సంబంధించిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరపనుంది.

# పారదర్శకంగా మిగులు దొడ్డుబియ్యం విక్రయించాం

## బహిరంగ ఇ-వేలంలో పోటీపడిన కొనుగోలుదార్లు

## కనీసధర కంటే అధికంగా ధర చెల్లింపునకు ముందుకొచ్చిన వ్యాపారులు: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పేదలకు చౌకధరల దుకాణం ద్వారా పంపిణీ చేస్తుండటంతో ఆయా డీలర్లవద్ద గతంలో మిగిలిపోయిన దొడ్డుబియ్యంను సేకరించి పారదర్శకంగా విక్రమయించామని తెలంగాణ పౌరసరఫరాలశాఖ ఒక ప్రకట నలో తెలిపింది. దొడ్డు బియ్యంను రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన రూ.21.60 కిలో చొప్పున అంటే టన్నుకు రూ.21,600 ప్రభుత్వం నిర్దేశించగా రిజర్వ్ ధర కంటే ఎక్కువగా టన్నుకు రూ.21,700 ధర లభించిందని, ప్రభుత్వ ఆస్తులను తక్కువ ధరలకు విక్రయించారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని సంస్థ వెల్లడించింది. విక్రయాల వల్ల వేల కోట్ల రూపాయల నష్టం జరిగిందనే ప్రచారం కూడా వాస్తవాధారాలు లేనిదేనని పేర్కొంది. సుమారు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వల మొత్తం విలువే సుమారు రూ.303 కోట్లు మాత్రమే ఉంటుందని, అలాంటి నిల్వలపై 'వేల కోట్ల నష్టం' అన్న వాదనకు ఎలాంటి గణాంక ఆధారాలు లేవని స్పష్టం చేసింది. అత్యంత ముఖ్యంగా, ఇప్పటివరకు ఒక్క గింజ బియ్యం కూడా విడుదల కాలేదని, ఒక్క విడుదల ఉత్తర్వు కూడా జారీ కాలేదని, ఒక్క కిలోగ్రాము నిల్వ కూడా గిడ్డంగుల నుంచి తరలించలేదని సంస్థ పేర్కొంది. వేలంలో విజయం సాధించిన సంస్థలు ఒప్పందాలు, సెక్యూరిటీ డిపాజిట్లు పూర్తి చేసినప్పటికీ పత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని సంస్థ వివరించింది. రేషన్ దుకాణాలలో మిగిలిన బియ్యం బియ్యం మళ్లింపు, రీ పాలిషింగ్, ఎగుమతులు, అక్రమ విక్రయాలపై వచ్చిన ఆరోపణలు వాస్తవానికి అసంభవమని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ స్పష్టం చేసింది.

మిగులు దొడ్డు బియ్యం విక్రయానికి సంబంధించిన ధర నిర్ణయం, వేలం నిబంధనలు, అనుమతులు, ప్రక్రియలన్నీ రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ప్రభుత్వ విధానాల ప్రకారమే జరిగాయని, మొత్తం వ్యవహారం పూర్తిగా చట్ట బద్ధమే నని, పారదర్శకమైనది, ఆడిట్‌కు అనుకూలమైనదని సంస్థ పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎల్లప్పుడూ పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేస్తుందని, ఏ దర్యాప్తు సంస్థ ముందు అయినా అన్ని రికార్డులు సమర్పించేందుకు సిద్ధంగా ఉందని తెలిపింది.

ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం సరఫరా చేయాలనే నిర్ణయం తీసుకున్న తర్వాత సుమారు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం మిగులుగా నిల్వ ఉందని సంస్థ తెలిపింది. దీర్ఘకాలం నిల్వ ఉంచితే నాణ్యత క్షీణించడం, గిడ్డంగుల కొరత, అదనపు వ్యయం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజా ప్రయోజనాల దృష్ట్యా విక్రయ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వివరించింది



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇగ్నిటస్ ఎడ్యుటెక్ ప్రతినిధులు, అంబేద్కర్ వర్సిటీ ఆచార్యులు.

## అంబేద్కర్ వర్సిటీలో విదేశీ భాషల్లో శిక్షణ

### ఇగ్నిటస్ ఎడ్యుటెక్‌తో అంబేద్కర్ వర్సిటీ ఒప్పందం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 17, ప్రభాతవార్త:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ సహా పలు విదేశీ భాషల్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. ఉపకులపతి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్. విజయ కృష్ణారెడ్డి, ముంబైలోని ఇగ్నిటస్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మీటాసింగ్ కన్వర్ సంతకాలు చేసి అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. ప్రపంచీకరణ నేపథ్యంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో చదువు పూర్తి చేసిన విద్యార్థులు సహా ఇతర యూనివర్సిటీల విద్యార్థులకు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఇతర దేశాల్లో, మల్టీ నేషనల్ కంపనీలలో ఉద్యోగ అవకాశాలు పొందడానికి విదేశీ భాషలు నేర్చుకోవడం, వాటిలో శిక్షణ పొందడం విద్యార్థులకు బాగా ఉపయోగపడనుందన్నారు. ఇంగ్లీష్ సహా కొరియా, జపనీస్, జర్మనీ వంటి విదేశీ భాషల్లో మొదటగా శిక్షణనిస్తున్నామని, తర్వాత వీటిని ఇతర భాషలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం మేరకు స్కిల్ కోర్సులతో పాటు విదేశీ భాషల్లో శిక్షణనివ్వడానికి యూనివర్సిటీ లోనే ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇగ్నిటస్ డైరెక్టర్లు కన్వర్ ప్రభ్జోత్ సింగ్, పద్మ ప్రియ వేములపట్టి, విశ్వవిద్యాలయ ఇంచార్జ్ అకడమిక్ డైరెక్టర్ ఆచార్య ఇ. సుధా రాణి, స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఒకేషనల్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య పల్లవి కాబ్దే, వీసీ ఓఎస్డి ఆచార్య రవీంద్రనాథ్ సోలమన్, కోర్సు కో ఆర్డినేటర్ ఆచార్య కిశోర్ కుమార్ రెడ్డి, ఆచార్య రాణి రజిత మాధురి, డాక్టర్ వై. వెంకటేశ్వర్లు, ఆచార్య ఐ. ఆనంద్ పవార్, ఆచార్య రజనీ, ఆచార్య పి. వెంకట రమణ, అన్ని విభాగాల డైరెక్టర్లు, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం డ్యాంకు సుంకేసుల నుండి నీరు



**శ్రీశైలంప్రాజెక్టు, జూన్17,ప్రభాతవార్త:** శ్రీశైలం డ్యాంకు సుంకేసుల నుండి నీటి చేరికలు ప్రారంభం అయ్యాయి.శ్రీశైలం జలాశయంకు ఉదంయ 6గంటల సమయానికి సుంకేసుల నుండి ఇన్‌ఫ్లో 6,710 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతుంది.ఈక్రమంలోనే శ్రీశైలం రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా డ్యాం నీటినిల్వ సామర్థ్యం 215 టియంసిలుగా ఉంటుంది. బుధవారం ఉదయం సమయానికి 821.20 అడుగులుగా ఉండగా నీటి నిల్వసామర్థ్యం 41.6978 టియంసిలుగా నమోదు అయింది.శ్రీశైలం రెండు విధ్యుత్ కేంద్రాల్లో ఎటువంటి ఉత్పత్తి జరగడంలేదు.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ

# ఎపి కాంగ్రెస్ ధర్నా

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:**నీట్‌పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిరసిస్తూ రాష్ట్ర , నగర కాంగ్రెస్ కమిటీ సం యుక్త ఆధ్వర్యంలో బుధవారం ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసు కోవాలని, దీనికి బాధ్యత వహి స్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాం డ్ చేశారు. రాహుల్ గాంధీ దేశవ్యాపిత పర్యటనలో భాగంగా ఈ రోజు రాజ స్తాన్ కోటాలో మెగా ర్యాలీ గొప్ప బహిరంగ సభ జరుగుతున సందర్భములో, మేము కూడా సంఘీభావం తెలుపుతూ నగర కాంగ్రెస్ మద్దతుగా విజయవాడ గాంధీనగర్ ధర్నాచౌక్‌లో ధర్నా చేసి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని స్లొగన్స్ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో నరహరశెట్టి నరసింహారావు, కొలనుకోండ శివాజి, వీ.గురునాధం మీసాల రాజేశ్వ రరావు, అన్సారీ, అల్లం రాజేష ,లీడీ బేగ్ శ్రీ బుదల జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్య విప్లవం

**21న ఆంధ్రప్రదేశ్ అంతటా సమన్వయంతో యోగా దినోత్సవం..**

**కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి**

**ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు**

**ఇప్పటిదాకా 2.6 లక్షల మందికి శిక్షణ.. ఉన్నతస్థాయి సమీక్షలో ఎపి సిఎం చంద్రబాబు**



బుధవారం ఎపి సచివాలయంలో యోగాంధ్రపై సమీక్షిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** యోగా ద్వారా ఆరోగ్య విప్లవం సాధ్యమగుతుందని సిఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు.ఈ నెల జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవ కార్యక్రమాలను సమన్వ యంతో, ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 'యోగాంధ్ర-2026' ఏర్పాట్లపై బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంజరిగింది. ఈ సమా వేశంలో యోగా దినోత్సవాన్ని ప్రజాఉద్యమంగా మార్చే దిశగా చర్యలు తీసుకో వాలని సిఎం దిశానిర్దేశం చేశారు.యోగా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని సిఎం చంద్రబాబు సూచించారు. శాఖల మధ్య సమన్వయం మరింత బలంగా ఉండాలని, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆయుష్ శాఖ అధికారులు, అలాగే ప్రకృతి వైద్యం, యోగా సలహాదారు మంతెన సత్యనారా యణ రాజు పాల్గొన్నారు. వారు యోగా కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యం పెంపుపై ఈ సమావేశంలో చర్చించారు.

జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి ప్రధాన ఈవెంట్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యోగాంధ్ర-2026లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.ఈ సమీక్షలో రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర నిర్వహణకు తీసుకున్న చర్యలు, ఏర్పాట్లపై సిఎం అడిగి తెలుసుకున్నారు.

ఈ నెల 20న ఉండవల్లి గుహల దగ్గర జరిగే యోగా కార్యక్రమంలో బాబా రాందేవ్‌తో కలిసి సిఎం పాల్గొననున్నారు.21వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్టేడియంలో 5 వేలు నుంచి 6 వేల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూడా బాబా రాందేవ్ సహా ముఖ్యమంత్రి హాజరవుతారు. వర్షం కారణంగా ఏమైనా అవాంతరం తలెత్తితే.. ప్రత్యామ్నాయంగా విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో వెయ్యి మందితో స్టేట్ ఈవెంట్ నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యోగా ప్రచారంలో భాగంగా 19వ తేదీనే రాష్ట్రానికి వస్తున్న బాబా రాందేవ్... అదే రోజు ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. యోగాంధ్రలో భాగంగా ఇప్పటివరకు 2.6 లక్షల మందిని ట్రైనర్లుగా తీర్చిదిద్దినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 21న యోగాడేలో పాల్గొనేందుకు ఇప్పటికే కోటికి మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ముఖ్యమంత్రికి తెలిపారు. 18వ తేదీ నుంచి 20 వరకు విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు అధికారులు వివరించారు. 21వ తేదీన 1.33 లక్షల సెంటర్లలో యోగా కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని సిఎంకు తెలిపారు. 21 తేదీన 'యోగా డెస్టినేషన్' పేరుతో వచ్చే యేడాది యోగా డే వరకు కేలండర్‌ను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమీక్షకు ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.

## ఉస్మానియా డెంటల్ కళాశాలలో ర్యాగింగ్‌కు తావు లేదు

### ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.యాదవ్

**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 17 ప్రభాతవార్త:** ఉస్మానియా డెంటల్ కళాశాలలో ర్యాగింగ్ ఎలాంటి తావులేదని,వైద్య విద్యార్థుల భవిష్యత్తుతోన ఆటలాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉస్మానియా దంతకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్ స్పష్టం చేశారు.కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజ్‌హాస్టల్ బిడిఎస్ విద్యార్థులు ఉంటూ వైద్య విద్యాను నేర్చుకుంటున్నారు.ఈ నేపథంలో బిడిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ చేసిన ఆరోపణలపై బిడిఎస్ ఫైనల్ లియర్‌కు చెందిన 12మంది దంతవైద్య విద్యార్థులపై దంత కళాశాల ప్రిన్సిపల్ ఫిర్యాదు మేరకు సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.గత ఆరు నెలలుగా ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఫస్ట్‌ఇయర్ విద్యార్థులను వివిధ రకాలుగా వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.స్విగ్గీ ఆర్డర్లు కిందకు వెళ్లి తీసుకురావడం,కూలర్లలో నీళ్లనింపించడం జరుగుతుందన్నారు.వాల్‌చైర్ వేయించడం వంటి చర్యలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. ర్యాగింగ్ అడ్డుకునేందుకు ప్రయత్నించిన హౌస్‌సర్జన్లపై కూడా కొందరు దాడికి దిగినట్లు వెల్లడించారు.

పలు సందర్భాలలో కళాశాల ఆసుపత్రికి పిలిపించి హెచ్చరించినప్పటికి వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతోనే శాఖ పరమైన చర్యలు తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపల్ ఎస్.ఎస్.యాదవ్ తెలిపారు.క్షణికావేశంలో ప్రాణాలు తీసుకున్న సంఘటనలు గుర్తు ఉంచుకుని ర్యాగింగ్‌పై పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.కాగా ఉస్మానియా మెడికల్ కళాశాలలోనిదంత హాస్టల్స్‌లో ర్యాగింగ్ జరిగిన విషయం తెలుసుకుని ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి సందర్శించారు.దంత కళాశాల హాస్టల్స్‌లో ర్యాగింగ్ జరిగినట్లు ప్రిన్సిపల్ ఫిర్యాదు చేయడంతో తాము విచారణ కోసం వచ్చినట్లు డిసిపి శిల్పవల్లి తెలిపారు.వైద్యవిద్యను అభ్యసించేందుకు వచ్చే దంత కళాశాల సీనియర్స్ దంత వైద్యులు మొదటి సంవత్సరం వైద్యవిద్యను అభ్యసించే విద్యార్థిని ర్యాగింగ్ చేయడంపట్ల ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కళాశాలలో ఇలాంటి ర్యాగింగ్ వాతావరణాన్ని సృష్టిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుని జైల్‌కు పంపడం జరుగుతుందన్నారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, ఆరునెలల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.ర్యాగింగ్ వల్ల బాధితుడు ఆత్మహత్య చేసుకుంటే జీవిత ఖైదు పడుతుందన్నారు.కాలేజ్‌లలో సీనియర్స్ వైద్యులు జూనియర్ వైద్యులతో స్నేహంగా ఉండాలన్నారు.ఒకప్పుడు మీరు కూడా జూనియర్స్ అని మర్చిపోవద్దన్నారు. ర్యాగింగ్ మూలంగా ప్రశాంతవాతావరణాన్ని చెడకొట్టిన వారవుతారన్నారు. కాలేజ్‌లలో ర్యాగింగ్ లాంటివి ఉంటే వెంటనే కాలేజీ యాజమాన్యానికి పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిసిపి శిల్పవల్లి సూచించారు.

## రైతు భరోసా, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేవాటితోపాటు

## వివిధ అంశాలపై సిఎం నేడు సమాలోచనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** గురువారం ఉదయం 11.30 గంటలకు సచివాలయంలో అనధికార కేబినేట్ భేటీ జరగనున్నట్లుగా సమాచారం. పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సమాలోచనలు జరపనున్నారు. రైతుభరోసా, కేంద్రంపై ఒత్తిడి తెచ్చే అంశాలు, రాజకీయ పరిస్థితులపై చర్చించే అవకాశం ఉంది. తెలంగాణలో భారీగా పెన్షన్లు రద్దు అయ్యాయి. ఈనెల 26 నుంచి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో వేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైందని సమాచారం. ఈసారి 9 రోజుల్లో రైతు భరోసా ప్రక్రియను పూర్తి చేయనుందని తెలుస్తోంది. ఏకంగా 1.28 లక్షల పెన్షన్లను అధికారులు రద్దు చేశారు. అనర్హులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రకరకాల కారణాలతో పెన్షన్ లబ్ధిదారుల జాబితా నుంచి అనర్హులను ఏరివేశారు. అదే సమయంలో కొత్త పెన్షన్లను జారీ చేసేందుకు లబ్ధిదారులను కూడా గుర్తించారు. ఈ క్రమంలోనే 48 వేల మందికి కొత్త పింఛన్లు అందించనున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం నేత జాన్‌వెస్లీ, సిపిఐ నేతలు

## డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ పేరు మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

### వామపక్షాల డిమాండ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 17, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ వద్ద ఉన్న ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్ణయాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సిపిఎం కేంద్ర కార్యాలయంలో వామపక్ష పార్టీల సమన్వయ సమావేశం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ప్రపంచ దేశాల సంపదను కొల్లగొడుతూ, ప్రజల మీద యుద్ధాలను రుద్దుతున్న అమెరికా సామ్రాజ్యవాదానికి మద్దతుగా ట్రంప్ పేరు పెట్టడం దారుణమని అన్నారు. మన దేశ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ విధించిన ఆంక్షల వల్ల దేశం తీవ్రంగా నష్టపోయిందని, అటువంటి వ్యక్తి పేరును మన నగరంలో పెట్టడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి, ఆర్ఎస్ఎస్ బాటలో పయనిస్తూ ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడంపై జాతీయ కాంగ్రెస్ నాయకత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వామపక్ష పార్టీలు కార్యాచరణ రూపొందించింది. జూన్ 20 న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం, 21 న బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నేతలు బండారు రవికుమార్, డిజి నర్సింహారావు, సిపిఐ నేతలు ఇటి. నర్సింహ, స్టాలిన్; సిపిఐ (ఎంఎల్ మాస్లైన్) నేతలు కె. రమ, సూర్యం; ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి; న్యూ డెమొక్రసీ నేత సాదినేని వెంకటేశ్వరరావు; ఎస్‌యుసిఐ(సి) నేత పి.తేజ; ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

# దండుపాలెం బ్యాచ్‌ను ఇంటికి పంపాలి

### వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే : కెటిఆర్



**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** తెలంగాణలో అధికారంలో ఉన్న దండుపాలెం బ్యాచ్ ని సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని అది పాలేరు నుండే ప్రారంభం కావాలని తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్ )పిలుపునిచ్చారు ..దండుపాలెం బ్యాచ్ కి లీడర్ గా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ కార్యకర్తలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలోని వెంకటగిరి క్రాస్ రోడ్డులో గల ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంస్థా గత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ పై కేటీఆర్ ప్రసంగించారు. హిట్లర్ దగ్గర పనిచేసే గోబెల్స్ నుంచి మంత్రులు పని చేస్తున్నారని, హిట్లర్ ని ఆదర్శంగా తీసుకున్న సీఎం దేశంలో రేవంత్ రెడ్డి తప్ప ఎవరూ లేరని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పుష్కర కాలం తర్వాత ముష్కరుల పాలన కొనసాగడం దురదృష్టం అన్నారు. రాష్ట్ర రెవెన్యూ రోజురోజుకు తగ్గుతుంది కానీ రెవెన్యూ మంత్రి ఆదాయం మాత్రం రోజురోజుకు వేలకోట్ల రూపాయలు పెరు గుతుందన్నారు. తెలంగాణలో వ్యవసాయం సంక్షోభంలో ఉంది కానీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్రమాలు వెలుగు లోకి వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి భట్టి విక్రమార్క కమిషన్లు దండుకుంటూ కోట్ల రూపాయలు దోసుకుంటున్నాడని కేటీఆర్ విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల వలన జిల్లాకు ఏ ప్రయోజనం లేదని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎలాగో అధికారంలోకి రాదు కనుక ఇప్పుడే దోచుకుందామని తీరిలో మంత్రులు అందిన కాటికల్లా దండుకుంటున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మొనగాళ్లు కాదని మోసగాళ్లని అన్నారు. పొంగులేటి బాంబులేటి అని, ఆయన అవినీతి సామ్రాజ్యం వందల ,వేల కోట్ల పెరిగిపోయిందని పొంగులేటి కి సంబంధించిన వీడియోను, ఈడి చేసిన దాడుల పరంపరను కేటీఆర్ ప్రదర్శించారు. ఈ వీడియోను పాలేరు నియోజకవర్గం లోని ప్రతి ఇంటికి చేర్చాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈడీ కేసుల నుండి తప్పించుకోవడానికి బాంబులేటి ఎవరి కాళ్లు మొక్కారని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో సుమారు కోటి ఎకరాల భూములను లిటిగేషన్లో ఉంచి వారి యజమానులను తన దగ్గరికి పిలిపించుకొని 20 నుండి 30 శాతం భూములను పొంగులేటి లాక్కుంటున్నాడని కేటీఆర్ ఆరోపించారు.

అదేవిధంగా రాష్ట్రంలో బీసీ మంత్రులు, ఇతర ఎమ్మెల్యేల నోరులను పొంగిలేటి నొక్కుతున్నాడని, ములుగు జిల్లాలో 12 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను లాక్కున్నాడని, సమ్మక్క ,సారక్క టెండర్ల విషయంలో ఆ జిల్లాకు చెందిన మంత్రులను బెదిరించాడని కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. కలెక్టర్లను సైతం సెన్సు ఉందా అని సెన్స్ లేకుండా మాట్లాడుతున్నాడని అన్నారు. పాలేరులో 20 లక్షల ఇండ్లు కట్టి ఓట్లు అడుగుతానని లేదంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని చెప్పిన పొంగులేటి ఆ మాటపై నిలబడాలని, దమ్ము, ధైర్యం ఉంటే 20 లక్షల ఇండ్లు కట్టి చూపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## యేడాదిన్నరలో ఎపికి బంగారు భవిష్యత్తు

### చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

**కుప్పం, జూన్ 17 ప్రభాతవార్త:**సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి పడుతున్న శ్రమతో ఉందిలే మంచి కాలం ముందుముందున అనే రీతిలో మరో ఏడాదిన్నర కాలంలో రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వస్తుందని చిత్తూరు ఎం.పి., తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావు పేర్కొన్నారు. కుప్పం బస్టాండ్‌లో బుధవారం నిర్వహించిన విజయోత్సవ సభ కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రస ం గించారు. కేంద్రంలో ప్రధాని మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళా ్యణ్, మంత్రి నారా లోకేష్ చొరవ చూపుతున్నారన్నారు. అనకాపల్లిలో స్టీల్ ప్లాంట్, వైజాగ్‌లో గూగుల్ క్లౌడ్, అనంతపురంకు జెట్ తయారీ పరిశ్రమ, తిరుపతికి రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ పరిశ్రమలు వచ్చాయన్నారు. మరో పక్క సాగునీటి ప్రాజెక్టులపై సైతం సిఎం చంద్రబాబు ప్రత్యేక చర్యలు చేప ట్టారన్నారు.

**అభివృద్ధితో నోర్లు మూయించాలి**

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధితో వైకాపా నోర్లు మూయించాలని ఎంపి దగ్గుమళ్ల పార్టీ శ్రేణుల కు సూచించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షే మం ఆగడం లేదన్నారు. చేస్తున్న మంచిని గొంతెత్తి ప్రజలకు తెలియ జేయాలి ్సన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సుమారు 16438 పోస్టులను డిఎస్సీ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తే వైకాపా విమ ర్శలు చేయడం దారుణమన్నారు. కుప్పంలో కృష్ణాజలాలు వచ్చాయని, త్వరలోనే ఎయిర్‌పోర్టు వస్తుందని, అలాగే మిల్క్ పరిశ్రమలు సైతం వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సమావేశంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎంపిపి శ్రీకాంత్, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్,మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కోఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతా రాం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, ఏరియా ఆస్పత్రి వైస్ ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎటువంటి సమస్యనైనా పరిష్కరిస్తాం



బుధవారం నిడమర్రు ఆర్వోబీ నిర్మాణం తదితర పనుల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శిలా ఫలకాలను ఆవిష్కరించిన ఎపి మంత్రి లోకేష్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

### నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రమంత్రి పెమ్మసాని, ఎపి మంత్రి లోకేష్ శంకుస్థాపన

**విజయవాడ,జూన్17.ప్రభాతవార్తప్రతినిధి:** ఎటువంటి సమస్యనైనా శాశ్వతంగా పరిష్కరించే దిశలో కూటమి ప్రభుత్వం కార్యచరణ చేపడుతుందని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు.నిడమర్రు మార్గంలో 14వ నెంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులకు ఈ ఉదయం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అనుసంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీని నిర్మించనున్నారు. దశాబ్దాలుగా ఈ మార్గంలో రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మంత్రి లోకేష్ చొరవ తీసుకుని రైల్వే లెవల్ క్రాసింగ్‌పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేయించారు. సమస్య శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు కృషిచేశారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే నిడమర్రు, మంగళగిరి, తాడికొండ, అమరావతి ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రజా రాజధాని అమరావతికి సులభమైన, నిరంతరాయ రవాణ అనుసంధానాన్ని కల్పిస్తుంది. మంగళగిరి, అమరావతి మధ్య ప్రయాణ దూరం తగ్గుతుంది. మంగళగిరి పట్టణం నుంచి మంగళగిరి నియోజకవర్గంలోని బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. భవిష్యత్ లో ఈ ప్రాంతంలో పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. రైల్వే క్రాసింగ్ గేటు ద్వారా రోజుకు సుమారు 60 రైళ్లు ప్రయాణిస్తాయి. రోజుకు రహదారి రాకపోకల కోసం గేటు మూసివేసే సగటు వ్యవధి 8 నుంచి 10 గంటలుగా ఉంది. లెవల్ క్రాసింగ్ గేటు మూసివేసిన సమయంలో ప్రయాణీకులు దాటేందుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టేది. ఆర్వోబీ నిర్మాణంతో సుమారు నిమిషంలోనే దాటే అవకాశం ఉంది.

నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ రైల్వే లైన్ పై 10 మీటర్ల ఎత్తులో నిర్మించనున్నారు. దీని పొడవు 767.50 మీటర్లు. ఇందులో రైల్వే లైన్ నుంచి అమరావతి వైపు 362 మీటర్లు, మంగళగిరి వైపు 405.50 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. వంతెనపై నాలుగు లైన్లు రహదారి ఏర్పాటుచేయనున్నారు. ప్రతి లైను 3.75 మీటర్లు కాగా మొత్తం క్యారేజ్ వే వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. అదనంగా 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాష్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్లు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.5..2) 5.5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటుచేయనున్నారు. సర్వీస్ రోడ్లతో సహ ఆర్వోబీ మొత్తం వెడల్పు 28 మీటర్లు ఉండనుంది.ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి ్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**రూ.1,167 కోట్ల వ్యయంతో ఎంటీఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం..**

మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ఎంటీఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించి మురుగు కనుమరుగయ్యేలా చేస్తామని ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చింది. తాడేపల్లిలోని ప్రాతూరు రోడ్డులో మంగళగిరి, తాడేపల్లి నగర ప్రజల చిరకాల కోరిక అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి పథకం మొదటి దశ పనులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి సేవలో సంయమీంద్ర తీర్థస్వామి



**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం కాశీమఠం సంస్థాన్ పీఠాధిపతి సంయమీంద్రతీర్థస్వామి శిష్యులతో కలసి దర్శనం చేసుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోపల ధ్వజస్తంభానికి నమస్క రించి శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడుకుందాం: తిరుమల డిఎస్పీ విజయశేఖర్

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రపుణ్యక్షేత్రం తిరుమలకు స్వామివారి దర్శనార్థం వస్తున్న భక్తుల మనోభావాలు కాపాడటంలో పెద్దపీట వేయాలని, ఆలయ క్షేత్ర పవిత్రతను కాపాడుకుందామని తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ సూచించారు. భక్తులకు నాణ్యమైన సేవలు, క్షేత్ర పవిత్రత పరిరక్షణకు ప్రత్యేక సూచనలు చేశారు. ధరల ప్రదర్శన, అగ్నిమాపక భద్రత, సిబ్బంది ధృవీకరణపై స్పష్టమైన మార్గదర్శకాలు కలిగి ఉండాలన్నారు. బుధవారం మధ్యాహ్నం తిరుమలలోని దుకాణాల యజమానులతో పోలీసు, విజిలెన్స్, సెక్యూరిటీ శాఖల అవగాహన సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలు, మత సామరస్యం పరిరక్షణకు దుకాణాల యజమానుల పూర్తి సహకారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. తిరుమలలో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించడం, క్షేత్ర పవిత్రతను పరిరక్షి ంచడం, శాంతిభద్రతలను బలోపేతం చేయడం వ్యాపార కార్యకలాపాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం లక్ష్యంగా పోలీసు, విజిలెన్స్ సెక్యూరిటీ శాఖల ఆధ్వర్యంలో స్థానిక దుకాణాల యజమానులతో అవగాహన సమావేశం తిరుమల ఆస్థాన మండపంలో నిర్వహించారు. అనుమతి లేకుండా దుకాణాలను సబ్‌లీజ్‌కు ఇవ్వకపోవడం, లైసెన్స్ లేని హాకర్లను ప్రోత్స హించకపోవడం, నిషేధిత అనుమతి లేని వస్తువుల విక్రయాన్ని నివారించడం, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం, అనుమతించిన పరిమితికి మించి నిల్వలను ఉంచకపోవడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది దుకాణాల యజమానులతో పాటు తిరుమల పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మాణ వేగం పెంచాలి

### నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి: జెఇఒ డాక్టర్ శరత్

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణంలో ఉన్న పద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. టిటిడి ఇఒ ముద్దాడరవిచంద్ర ఆదేశాల మేరకు బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షి ంచారు.ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించే లక్ష ్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రి భవనం పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో కలిసి పనుల పురోగతిని సమీక్షి ంచి, నిర్ణీత కార్యాచరణ ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల వేగాన్ని మరింత పెంచేందుకు అవసరమైన నిపుణులు, కార్మికులు, నిర్మాణ సామగ్రిని తక్షణమే సమకూర్చాలన్నారు. అలాగే మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫర్ని చర్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, గార్డెనింగ్, క్లీనింగ్, నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల పనులను సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఒ డి. ఫణికుమార్ నాయుడు, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఎస్.ఇలు వేంకటేశ్వర్లు,,మనోహరం, ఇఇలు సుమతి, సరస్వతి, డిప్యూటీ ఇఇ హర్షవర్ధన్ రెడ్డి తదితర

## బీహారీయులకు వెంకన్న ఆలయం

### 15 ఎకరాలలో పాట్నా సమీపంలో నిర్మాణం

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర భారత భక్తులకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామితో అనుబంధాన్ని మరింత పెంపొందించడంతోబాటు ఆలయం భవిష్యత్తులో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ధార్మికసంస్థ టిటిడి ప్రణాళికలు రూపొందిస్తోంది. ఉత్తర భారత దేశంలో కూడా సనాతన ధర్మ ప్రచారానికి, శ్రీవారి భక్తులకు ఆధ్యాత్మిక సేవలను మరింత చేరువ చేయడానికి మరో కీలక అడుగు పడింది. బీహార్ రాజధాని పాట్నా సమీపంలో గంగా నది తీరానికి దగ్గరగా, జాతీయ రహదారి పక్కన శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం బీహార్ ప్రభుత్వం 15 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రతిపాదిత ఆలయ ప్రాంగణంలో ప్రధాన దేవాలయంతో పాటు కళ్యాణ మండపం, పుష్కరిణి, యాత్రికుల సౌకర్యాలకు అవసరమైన ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం ద్వారా సనాతన ధర్మ ప్రచారాన్ని విస్తరించాలనే లక్ష ్యంతో టిటిడిముందుకు సాగుతోంది. ఈ క్రమంలో అన్ని రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో కార్యాచరణ కొనసాగుతోంది. ఇప్పటికే అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం 10 ఎకరాల భూమి కేటాయింపు పూర్తిఅయ్యిన విషయం విదితమే. దీంతో బుధవారం టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి, శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశంలో బీహార్ చీఫ్ సెక్రటరీ అమృత్ ప్రత్యయ్ పాల్గొన్నారు.



# యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత

### రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం డీజీ డా.త్రివిక్రమ్ వర్మ



**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతత మరియు ఆరోగ్యకర జీవనశైలి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం(స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్)(ఎస్పిఎఫ్)డైరెక్టర్ జనరల్ డా.సియం.త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. ఈనెల 21వతేదీ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడ ఇబ్రహీంపట్నంలోని డా.నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో రాష్ట్ర ఎస్పిఎఫ్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో యోగాంధ్ర" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పిఎఫ్ డైరెక్టర్ జనరల్ డా.సియం త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ దైనందిన జీవితంలో పోలీసు సిబ్బంది ఎదుర్కొనే మానసిక శారీరక ఒత్తిడిల నుండి ఉమశమనం పొందేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.కావున ప్రతి ఒక్కరూ ముఖ్యంగా పోలీస్ సిబ్బంది అంతా నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు.యోగా సాధనతో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం తోపాటు, ఫిట్ ఆంధ్రప్రదేశ్ లక్ష ్య సాధనకు సహకారం అందించబడుతుందని డిజి త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు.

అంతేగాక యోగా శారీరక,మానసిక ఆరోగ్యానికి బలమైన పునాది వంటిదని నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక మానసిక,శారీరకపరమైన ఒత్తుడుల నుండి ఉపశమనం పొందవచ్చని డా.త్రివిక్రమ్ వర్మ అన్నారు.కావున ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. "యోగాంధ్ర" కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవడం మనందరి బాధ్యతని ఎస్పిఎఫ్ డిజి డా.త్రివిక్రమ్ వర్మ స్పష్టం చేశారు.ఈ యోగాంధ్ర కార్యక్రమంలో సుమారు 350 మందికి పైగా ఎస్పిఎఫ్ పోలీస్ సిబ్బంది, ఇతరులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు అభ్యసిం చారు. ఎస్పిఎఫ్ జోనల్ కమాండెంట్ ముద్దాడ శంకర్ రావు మరియు డా.ఎన్టిటిపిఎస్ ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ కమాండెంట్ టి.కృష్ణమాచారి వారి ఆధ్వర్యంలో ఈయోగా ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఇంకా ఈ కార్యక్రమా నికి ఇన్స్పెక్టర్ జనరల్ తీ.జు.రామి రెడ్డి,డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ సిఇ శివ రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం చీఫ్ సెక్యూరిటీ అధికారి. మల్లికార్జున రావు,ఆంధ్ర ప్రదేశ్ హై కోర్ట్ అసిస్టెంట్ కమాండెంట్ కే. శ్రీనివాసులు, విజయవాడ గన్నవరం అంతర్జాతీ విమానాశ్రం అసిస్టెంట్ కమాండెంట్ ట్.కె రావు, విజయవాడ గార్డ్స్ అసిస్టెంట్ కమాండెంట్ పి.హేమసుందర రావు,యోగ గురువు లంకె జనార్దన్,ఇన్స పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# యోగాంధ్రలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, విద్యార్థులు

### డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణు వర్ధన్ వెల్లడి

### ప్రభుత్వ వైద్య , నర్సింగ్ డెంటల్ కాలేజీల నుంచి 15,062 మంది

### యోగాంధ్ర పోర్టల్ ద్వారా నమోదు

**విజయవాడ.జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** యోగాంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య విద్యా సంస్థల నుంచి భారీ స్పందన లభిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య, దంత, నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, వైద్యులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జూన్ 7 నుంచి 16 వరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని సంస్థల్లో మొత్తం 15,062 మంది తమ పేర్లను పోర్టల్ లో నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే అత్యధికంగా 10,792 మంది నమోదు చేసుకున్నారని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ నేడొక ప్రకటనలో వెల్లడించారు. పోర్టల్లో నమోదు చేసుకున్న వారిలో కొంత మంది స్థానికంగా నిర్వహించే యోగాసనాల్లో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్ నుంచి 1,625 మంది, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ నుంచి 1,400 మంది, గుంటూరు మెడికల్ కాలేజ్ నుంచి 1,091 మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సంసిద్ధతను వ్యక్తం చేయడం విశేషం. నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 800 మంది, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 840 మంది నమోదు చేసుకున్నారు.ప్రభుత్వ దంత వైద్య కళాశాలల్లో విజయవాడ, కడప కళాశాలల నుంచి కలిపి 449 మంది నమోదు చేసుకున్నారు. నర్సింగ్ కళాశాలల్లో 3,821 మంది యోగా సాధన చేశారు. ఒంగోలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల 452 మందితో అగ్రస్థానంలో నిలవగా, కర్నూలు 432 మంది, ఏలూరు 377 మంది, కడప 332 మంది, తిరుపతి 315 మందితో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న విజయవాడలోని ఇందిరాంధీ మునిసిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి వైద్య విద్యాసంస్థలు విశేష మద్దతు అందిస్తున్నాయని అధికారులు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందనే సందేశాన్ని వైద్య విద్య, నర్సింగ్ విద్యార్థులు, డాక్టర్లు, సిబ్బంది ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. డిఎంఈ పరిధిలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు, 13 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, 2 ప్రభుత్వ దంత వైద్య కళాశాలలు ఉన్నాయి.

# వేడాం పొలాల్లో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం

### ఎంఎల్ఏ, జిల్లా కలెక్టర్ హాజరు

**శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త:** ప్రభుత్వం నూనతంగా రూపొందించి అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం పనులకు సంబంధించి బుధవారం శ్రీకాళహస్తికి సమీపంలోని వేడాం గ్రామంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌లు పాల్గొన్నారు. ఇద్దరు పంటపొలాల్లో నాట్లును వేసారు. ఈ సందర్భంగా విత్తన గుళికలను ఇరువురు తయారు చేసారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఎలాంటి లాభాలు రైతులకు కల్గుతాయో వివరించారు. ఈ సందర్భంగా రైతులకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అ ందుకు కావాల్సి న ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను అందించే ప్రకృతి వ్యవసాయం విధానాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందని వివరించారు. ఈ సందర్భంగా వేడాం గ్రామంలో మూడెకరాల వ్యవసాయ క్షేత్రం సందర్శించారు. ఈ వ్యవసాయం గ్రామానికి చెందిన ఏ.పుష్పకు సంబంధించినదిగా వ్యవసాయాధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్వయంగా మన జీవామృతం, ద్రవ జీవామృతం, బూడిద మరియు విత్తనాలను కలపి విత్తన గుళికలను తయారు చేసారు. అనంతరం రైతు పుష్ప పొలంలో విత్తనాల గుళికలను బ్రాడ్ కాస్టింగ్ పద్ధతిలో చల్లి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు.



**పంట పొలాల్లో ఎంఎల్ఏ, కలెక్టర్**

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామానికి చెందిన మహిళా రైతు పుష్ప పంట పొలాల్లో బుధవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ హ్యాండ్ ట్రాన్స్‌ప్లాంటర్ సహాయంతో వరి నాట్లు వేసి వ్యవసాయ పనులు నిర్వహించారు. రైతుల శ్రమను తగ్గించటంతో పాటు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు వేయటానికిహ్యాండ్ ట్రాన్స్‌ప్లాంటర్ వంటి వ్యవసాయ పరికరాలను ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో వారితో పాటు జిల్లావ్యవసాయాధికారి ప్రసాదరావు,శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ చెంచయ్యనాయుడు, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లాఅదనపు వ్యవసాయాధికారి ధనంజయులరెడ్డి ఏడిఏ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జనాభా దామాషా మేరకు బీసీ రిజర్వేషన్లు పెంచాలి

### ఎపి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు వినతి

**గుంటూరు, జూన్ 17, ప్రభాతవార్త ప్రతినిధి:** డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా బీసీ కులాల జన గణన ను శాస్త్రీయంగా నిర్వహించి, సుప్రీం కోర్టు 50 శాతం పరిమితిని ఎత్తేపించి స్థానిక సంస్థల రిజర్వేషన్లను జనాభా దామాషా మేరకు పెంచేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బుధవారం స్థానిక గుంటూరు కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ ఐఏఎస్ కాన్ఫరెన్స్ హాల్ లో బీసీ బృందంతో కలిసి రాజీవ్ రంజన్ మిశ్రా కు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించిన అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు విజ్ఞప్తి చేశారు. "ఆదిలోనే హంసపాదు" అన్నట్లు జనగణనను రెండు దశల్లో చేస్తూ, మొదటి దశ గృహ గణన ఫార్మేట్ లో ఓబీసీల గృహ గణన లెక్కించే కాలమ్ లేకపోవడం సరికాదన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా నాయకత్వంలో డెడికేటెడ్ కమిషన్ సుప్రీం కోర్టు ట్రిపుల్ టెస్ట్ ఆర్డర్ ను సంతృప్తికరంగా అమలు జరిపేలా రాష్ట్రంలో బీసీల కుల గణన ద్వారా సరైన ఏం పరికల్ డేటా సేకరించి, వారి రిజర్వేషన్ల పెంపుకు సహకరించాలన్నారున విజ్ఞాపన పత్రాన్ని సమర్పించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన రాష్ట్ర అధ్యక్షులు పారేపల్లి మహేష్, ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాస్, బాపట్ల ప్రధాన కార్యదర్శి రవికుమార్,రాష్ట్ర కార్యదర్శి కోలా అశోక్, దొంత బ్రహ్మం, కేశవ కోటేశ్వరరావు పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబాన్ని పరామర్శించిన హోం మంత్రి అనిత


**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్17, ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారంలో అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం పరామర్శించారు.పోలీసు అధికారులకు సైతం అంతుచిక్కని మిస్టరీ గా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన చిన్నారి అదృశ్యం పై హోంమంత్రి గతంలోనే స్పందించారు.అయితే నేరుగా హోం మంత్రి అనిత సంఘటన స్థలానికి చేరుకుని చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన చిన్నారి అదృష్టమైనప్పుడు నుండి పోలీసులు చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. చిన్నారి ఆచూకీ కోసం ప్రభుత్వం పోలీసు సిబ్బందిని, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, అటవీ శాఖ సిబ్బంది శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నారన్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి డ్రోన్ కెమెరాలు, నైట్ విజన్ కెమెరాల తో చిన్నారి ఆచూకీ కోసం గస్తి నిర్వహిస్తున్నరన్నారు. చిన్నారి తో అదృశ్యమైన పెంపుడు కుక్క తిరిగి వచ్చిన తర్వాత మృతి చెందడంతో పోస్టుమార్టం నిర్వహించి ఆధారాలు కోసం శాంపిల్స్ ఫొరెన్సిక్ ల్యాబ్‌కు పంపించడం జరిగింద న్నారు. జిల్లా ఎస్పి కి ఫోన్ చేసి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లా ఎస్పి బిందు మాధవ్, ఇతర అదికారయంత్రాంగం మంత్రి వెంట ఉన్నారు.

## కాకరేపుతోన్న వైసీపీ కాపు నేతల లంచ్ భేటీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 17,ప్రభాత వార్త:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా తలపెట్టిన వైసీపీ కాపు నేతల లంచ్ బేటీ కాకరేపుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్రస్థాయి కాపు సామాజికవర్గ ముఖ్య నేతల సమావేశం ఈ నెల 21న తలపెట్టడంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.వెంకటాయపాలెంలోని వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నివాసంలో లంచ్ మీటింగ్ ఏర్పాటు పేరుతో పార్టీలోని కాపు నేతలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వయంగా ఫోన్లు చేసి విందుకు ఆహ్వానిస్తున్నారు. పైకి దీనిని కేవలం"గెట్ టుగెదర్థ (ఆత్మీయ కలయిక) సమావేశంగానే చెబుతున్నప్పటికీ సమావేశం అన్నాక అన్ని విషయాలూ చర్చకు వస్తాయి కదాఖిఅంటూ తోట వ్యాఖ్యానించడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, అంతర్గత సమీకరణాల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న ఈ భేటీ ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనన్న ఉత్కంఠ రేపుతోంది.

## తిరుచానూరు పద్మావతి ఆలయంలో నిత్య ఆర్జిత సేవలు





**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో భక్తుల కోరికలను కరుణతో తీర్చే సిరుల తల్లి పద్మావతి అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక ప్రశాంతత కలగాలని సంకల్పిస్తూ తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో నిత్యం ఆర్జిత సేవలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం జరుగుతున్న ఈ సేవల్లో దేశ విదేశాల నుండి వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులవుతున్నారు. టిటిడి ఆధ్వర్యంలో నిత్య, వారాంత, నెలవారీ, వార్షిక, శాశ్వత ఆర్జిత సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారికి సమర్పించే ప్రతి సేవ భక్తులలో భక్తి భావనను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రతిరోజూ ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ నిర్వహిస్తారు. శుక్రవారం మాత్రం ఉదయం 3.30 గంటలకు ఈ సేవ జరుగుతుంది. ఉదయం 5 గంటలకు సహస్రనామార్చన నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 4 గంటలకు ఈ సేవ ఉంటుంది.ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు పద్మావతి అమ్మవారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు కుంకుమార్చన సేవ నిర్వహిస్తారు.సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు సహస్ర దీపాలంకార సేవ జరుగుతుంది. ప్రతిరోజూ రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు. శుక్రవారం మాత్రం రాత్రి 9.45 గంటలకు ఈ సేవ ఉంటుంది. ఆలయంలోని వేదాశీర్వచన మండపంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వేదాశీర్వచనం కార్యక్రమం నిర్వహిస్తారు.

ప్రతిరోజూ ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వి.ఐ.పి. బ్రేక్ దర్శనం ఉంటుంది. ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు అష్టదళ పాదపద్మారాధన సేవ నిర్వహిస్తారు. ప్రతి గురువారం ఉదయం 7 గంటలకు తిరుప్పావడ సేవ జరుగుతుంది. ప్రతి శుక్రవారం ఉదయం 5.30 గంటలకు వస్త్రాలంకరణసేవ, అనతరం అభిషేకం నిర్వహిస్తారు.ఉదయం 7గంటలకు అభిషేకానంతరం దర్శనం ఉంటుంది. అదే రోజు ఉదయం 9.30 గంటలకు లక్ష్మీ ్మపూజ నిర్వహిస్తారు.ప్రతి శనివారం ఉదయం 7.30 గంటలకు పుష్పాంజలి సేవ జరుగుతుంది. ఇక నెలవారీసేవల్లో ప్రతి నెల మొదటి బుధవారం ఉదయం 7 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. ప్రతి ఏడాది మే నెలలో వార్షిక వసంతోత్సవాలు, సెప్టెంబర్ నెలలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.

నవంబర్ నెలలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ రోజున లక్ష కుంకుమార్చన, మరుసటి రోజు పుష్పయాగం వైభవంగా జరుగుతాయి. ఆగస్టు,సెప్టెంబర్ నెలలో వరలక్ష్మీ ్మ వ్రతం నిర్వహిస్తారు. శాశ్వత సేవలలో భాగంగా నిత్య అర్చన, ఊంజల్ సేవలను భక్తులు కోరిన రోజున నిర్వహించి ఇద్దరికి దర్శన భాగ్యం కల్పిస్తారు.

పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీనివాస స్వామి ఆలయంలో ప్రతి శనివారం ఉదయం, అలాగే సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రతి ఆదివారం ఉదయం అభిషేక సేవలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆర్జిత సేవల టికెట్లను టిటిడి అధికారిక వెబ్‌సైట్ టిటిడిదేవస్థానమ్స్. ఎపి.జివొవి.ఇన్ లో ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా కూడా సేవా టికెట్లు పొందవచ్చు.

## విజయప్రతాప్ రెడ్డికి భద్రతను పునరుద్ధరించాలి

### ఏపీ హైకోర్టు ఆదేశం

**విజయవాడ,జూన్ 17, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ (ఫుడ్ కమిషన్) ఛైర్మన్ విజయప్రతాప్ రెడ్డి భద్రత వ్యవహారంలో ఏపీ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి షాకిచ్చింది.విజయప్రతాప్ రెడ్డికి 1+1 భద్రతను పునరుద్ధరించాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఈ విషయంలో ప్రభుత్వ వాదనలను తోసిపుచ్చుతూ, ప్రస్తుత దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.

# లక్క గాజులతో ఫిదా !

ప్యాషన్ ప్యాషన్





అలనాటి మహారాణులైనా, ఈనాటి పెళ్లికూతుళ్లైనా.. మహిళలంతా ఆ గాజుల అందానికి ఫిదానే. పండుగైనా, వివాహ వేడుకలైనా అతివల చేతులు వీటి మెరుపులతో తళుక్కుమనాల్సిందే. అవే భాగ్యనగరానికీ వన్నె తెచ్చిన అందాల లక్క గాజులు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఆ గాజులు తాజాగా భౌగోళిక గుర్తింపును సొంతం చేసుకొన్నాయి. హైదరాబాద్ పాత బస్తీ అంటేనే గాజులకు ప్రసిద్ధి. స్థానికంగానే కాదు. అంతర్జాతీయంగా ఎంతో పేరుపొందాయి. వీటిని లక్కరాళ్ల గాజులుగానూ పిలుస్తారు. వీటి తయారీ కూడా ప్రత్యేకమే. కొలిమిపై కరిగించగా వచ్చే లక్కను వృత్తాకారంలో మలిచి గాజులుగా తయారుచేస్తారు. రంగురంగుల రాళ్లు, పూసలు, అందాలు వంటివాటితో వీటికి హంగులు అద్దుతారు. ఈ లక్క గాజులపై చేసే అలంకరణకు ఎటువంటి మెషీన్లు ఉపయోగించకుండా కేవలం చేతులతోనే చేస్తరు. ఈ హస్తకళ కుతుబ్‌షాహీ, నిజాంల కాలంలో ప్రారంభమైందట. ఆనాటి రాజకుటుంబీకుల మహిళలంతా వీటిపై మనసు పారేసుకునేవారట. తరతరాలుగా వస్తోన్న ఈ గాజుల తయారీమీదే నేటికీ 4 వేలకుపైగా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. అలా తయారవుతున్న ఈ లక్క గాజులు ఆధునిక మహిళల్నీ మురిపిస్తునే ఉన్నాయి. అంతెందుకు ఇప్పటికీ పెళ్లిళ్లంటే నవ వధువుల మనసు వీటివైపే మళ్లుతుంది. అందాన్ని, సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ గాజులకు భౌగోళిక గుర్తింపు దక్కింది. అంటే. ఈ లక్కగాజులు మరింత మంది మహిళల చేతులను మరిపించనున్నాయి అన్నమాట. □









## కాఫీ ప్రేయుల కోసం..

ఓ కప్పు వేడ వేడి కాఫీ తాగితే.. వర్క్‌టెన్షన్ పరార్ కదా! ఇందుకు ప్రతిసారీ వంటగది, పాంట్రీకి వెళ్లనక్కర్లేదు. ఈ మగ్ వార్మర్ ఒకటి మీ దగ్గర



ఉంటే చాలు. క్షణాల్లో మీరున్నచోటు నుంచే కాఫీ చేసుకుని తాగే యొచ్చు మరి. ఒక్క కాఫీ మాత్రమే కాదు వేడివేడి సూప్ లను సైతం తయారు చేసుకో వచ్చు. ఈ వాటర్ ప్రూఫ్ మగ్ ఛార్జింగ్‌తో పనిచేస్తుంది. □

# అమ్మ వారికి 'సిరి' చీరె !

### అగ్గిపెట్టెలో అద్భుతం



భారతీయ నేత కళాకారుల అద్భుత ప్రతిభాకు 'అగ్గిపెట్టెలో పట్టే చీర' తార్కాణం. అదే మన దేశపు ఘనతగా చెప్పుకుంటాం.. అదొక రికార్డు సృష్టించిన అంశం. అగ్గిపెట్టెలో ఇమిడి పోయేంత సన్నని, తేలికైన చీరను తయారు చేయడంసాధారణ విషయమేమీ కాదు. దీనికి అత్యంత సన్నని నూలు, అపారమైన నైపుణ్యం, చెప్పుకోదగిన సహనం అవసరం. చేతి వృత్తులు కనుమరుగు అవుతున్న తరుణంలో తెలంగాణ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు, 'చేనేత కళారత్న' అవార్డు గ్రహీత నల్ల విజయ్ కుమార్ మంగళవారం నాడు ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గమ్మని సందర్శించి తాను ప్రత్యేకంగా నేసిన అత్యంత విలక్షణమైన పట్టుచీరను శ్రీ కనకదుర్గ అమ్మవారి అలంకరణకు బహుకరించారు .తన తండ్రి, ప్రముఖ చేనేత శిల్పి అవార్డు గ్రహీత స్వర్గీయ నల్ల పరంధాములు స్ఫూర్తితో నేసిన చీరను అమ్మవారి అలంకరణకు సమర్పిం చారు. ఈ పట్టు చీరను సాంప్రదాయ, ఆకర్షణీయమైన 'ఇక్కత్ డిజైన్' అత్యంత నైపుణ్యంతో రూపొందించారు. ఈ చీరను మడతపెడితే సులభంగా ఒక చిన్న అగ్గిపెట్టెలో ఇమిడిపో తుంది. చేనేత కళా సౌంద ర్యానికి మచ్చుతునకగా నిలిచిన ఈ పట్టు చీరను విజయ్ కుమార్ వారం రోజుల పాటు రాత్రింబవళ్లు శ్రమించి మగ్గంపై అద్భుతంగా మలిచారు. ఈ అద్భుత పట్టు చీర పొడవు 5.5 మీటర్లు (ఐదున్నర మీటర్లు), వెడల్పు 48 ఇంచులు ఉంటుంది. ఇంత పెద్ద పరిమాణం ఉన్నప్పటికీ, దీని బరువు కేవలం 200 గ్రాములు మాత్రమే కావడం విశేషం. □

# వ్యథ కొత్త జీవితమే మేలు !

ప్రశ్న : నా భర్త నన్ను కాదని మరొక అమ్మాయిని పెళ్లి చేసుకున్నారు. నా వయస్సు 25 సంవత్సరాలు. ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాను. ఆరు నెలల క్రితం పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాను. అతను బి టెక్ పాసై ఉద్యోగం చేస్తున్నాడు. అయితే పెళ్లికి ముందే అతనికి మరొక అమ్మాయితో సంబంధం ఉంది. మాకు పెళ్ళయిన కొన్నాళ్ళు బాగానే ఉన్నారు. తరువాత నేనంటే ఇష్టం లేదని విడాకులు ఇచ్చేయమని అడగడం ప్రారంభించారు. నేను నెల రోజులు ఎవరికీ చెప్పకుండా నా మనసులోనే దాచుకున్నాను. అయితే ఆయన సాధింపు ఎక్కువ కావడంతో మా తల్లితండ్రులకు చెప్పాను. వారు ఇరువైపులా పెద్దలను పిలిచి మాట్లాడినా ఆయనలో మార్పు రాలేదు. పైగా నెల క్రితం ఆ అమ్మాయిని రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. ఆ విషయం తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాము. వారు అతడిని స్టేషన్ కు పిలిపించి మాట్లాడారు. అతను సమ్మతించక పోవడంతో మమ్మల్నే మాట్లాడి పరిష్కరించుకోమన్నారు. ఆయన నేనంటే ఇష్టం లేదని నష్ట పరిహారం ఇస్తానని అంటున్నారు. చట్ట ప్రకారం కేసు పెట్టి, రెండవ పెళ్లిని రద్దు చేయించి కలసి ఉండాలని కొందరు సూచిస్తున్నారు. స్థిరత్వం లేని, విలువలు పాటించని వ్యక్తితో కలసి ఉండటం కంటే విడి పోవడం మంచిదని కొందరు అంటున్నారు. ఈ నేపథ్యంలో నేను ఎలాంటి నిర్ణయం తీసుకుంటే మంచిదో తెలపండి.

- ఒక సోదరి, సికింద్రాబాద్

జవాబు : అమ్మా, మీరు ఎదుర్కొంటున్న పరిస్థితి బాధా కరమైనది. కానీ ఇప్పుడు తీసుకునే నిర్ణయం మీ జీవితాన్ని మళ్లీ ఎలా నిర్మించుకోవాలో నిర్ణయిస్తుంది. కాబట్టి భావోద్వేగంతో కాకుండా స్పష్టమైన ఆలోచనతో ముందుకు వెళ్లాలి. స్థిరత్వం లేని, విలువలు పాటించని, మోసం చేసిన వ్యక్తితో బలవంతంగా కలిసి ఉండటానికి ప్రయత్నించడం అంత మంచిది కాదు. చట్టపరంగా మీ హక్కులు సాధించుకుని, అతనితో సంబంధాన్ని ముగించి, కొత్త జీవితాన్ని ప్రారంభించడం మీ దీర్ఘకాల భవిష్యత్తుకు బాట వేస్తుంది. వివాహం కోల్పోవడం జీవితాన్ని కోల్పోవడం కాదు. ఆత్మగౌరవం కోల్పోవడమే అసలు నష్టం.కొన్ని సందర్భాల్లో 'నాకు జరిగిన అన్యాయానికి అతడిని శిక్షి ంచాలి' అనే కోపంతో తిరిగి కలిసే ప్రయత్నం చేస్తారు. కానీ వివాహ జీవితం ప్రేమ, నమ్మకం, గౌరవం మీద నిలబడాలి. అవి ఒకసారి పూర్తిగా దెబ్బతింటే కేవలం చట్టంతో బంధం నిలవదు. హిందూ వివాహ చట్టం ప్రకారం అతని వివాహం చెల్లదు. అతనిపై క్రిమినల్ కేసు పెట్టి శిక్ష పడేలా చూడవచ్చు. మీరిద్దరూ కలసి జీవించేలా తీర్పు పొందవచ్చు. అయితే అలాంటి వ్యక్తితో మీరు జీవిత కాలం సుఖంగా ఉండలేరు. అయితే చట్టబద్ధంగా విడిపోయి, నష్ట పరిహారం తీసుకుని కొత్త జీవితం ప్రారంభించడం ఉత్తమ ప్రత్యామ్నాయం. మీరు ఎంబీఏ చదివారు కాబట్టి మంచి ఉద్యోగం సంపాదించే అవకాశం ఉంది. మీ జీవితాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఉంది. అతను దారికి రాక పోతే పోలీసులు, కోర్టు, మహిళా కమిషన్ సహాయం తీసుకోండి. పెద్దల సమక్షంలో ఆయన మీరు కోరినట్టు నష్ట పరిహారం ఇవ్వడానికి సమ్మతిస్తే పరస్పర అంగీకారంతో కోర్టు ద్వారా విడాకులు తీసుకుని కొత్త



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

# 'చోఖామేళా'

పంచముడైన చోఖామేళా పాండురంగనికి ప్రియమైనవాడు. పాండు రంగని వద్ద పూజ చేసే పురోహితులకంటే వంద రెట్లు శ్రేష్ఠుడు. శ్రీహరి ద్వారాన్ని చేరుటకు శ్రద్ధతో ప్రయత్నంచేసేవారు తప్ప మిగిలిన అందరూ పంచములే! ఎవరి అంతర్యం పరిశుద్ధంగా ఉంటుందో, వాడు సర్వత్ర పరిశుద్ధుడే! అన్నాడు. మహారాష్ట్రలో చోఖామేళాను గూర్చి తెలియని వారుండరు. అతనిని పాండురంగని ఆలయంలోపలకు రానీయలేదు. కానీ అంతటా పాండు రంగని చూచి మైమరచి పోయే భక్తుడు. ఒకనాడు ఒక గోడను కడుతూండగా, అది కూలటం వలన చోఖామేళా, మరి కొందరు మరణించారు. శవాలను తీయటానికి చాలా సమయం పట్టింది. సామూహిక దహనం చేశారు. నామదేవునితో పాండురంగడు 'నా భక్తుడు చోఖామేళా అతని సమాధి నా మందిరమునకు ఎదురుగా ఉండాలనే ఒకే ఒక్క కోరికతో జీవించాడు. ఆ కోర్కె తీర్చుట నా లక్ష్యం' అన్నాడు. చోఖామేళా ఎముకలను గుర్తించటం సాధ్యం కాదు కదా? అన్నాడు నామదేవు. పాండురంగడు చోఖామేళుని ఎముకలు సహితం నా నామాన్ని ఉచ్చరిస్తాయి అన్నాడు. నా దేవుడు ఆ ఎముకల గుట్ట దగ్గరకు వెళ్లి, ఒకొక్క ఎముకను చెవి దగ్గర పెట్టుకొని, ఏవి అయితే పాండురంగని నామస్మరణ చేసినవో, వాటిని ఏరి తీసుకువచ్చి, పాండురంగని ఆలయమునకు ఎదురుగా చోఖామేళా సమాధిని నిర్మించాడు. చోఖామేళుని ఎముకలు రంగని నామాన్ని ఉచ్చరిస్తాయి. చోఖామేళుడు వైశాఖ బహుళ పంచమినాడు దేహాన్ని త్యజించాడు. □

# బార్లీతో ఫేషియల్ !



శరీరం చక్కగా ప్రకాశవంతంగా మెరుస్తూ ఉండాలని అందరికీ ఉంటుంది.కానీ మచ్చలు మొటిమలు జిడ్డు చర్మం.. ఇలా ఎన్నో సమస్యలు ఇలాంటి వాటన్నింటికీ చెక్ పెడుతుంది ఈ బార్లీ ఫేషియల్ !



**కావాల్సినవి :** బార్లీ గింజలు పొడి రెండు చెంచాలు, గోరువెచ్చటి నీళ్లు- సరిపడా**తయారీవిధానం :** ముందుగా ఒక పాత్రలో బార్లీ గింజలు పొడిని తీసుకుని అందులో కొద్దికొద్దిగా గోరువెచ్చటి నీళ్ల పోసుకుంటూ ముద్దలా కలుపు కోవాలి.

**ఫేషియల్ ఇలా ..** ఇలా తయారు చేసు కున్న మిశ్రమాన్ని చర్మంపై నల్ల మచ్చలు ఉన్న చోట పూసి ఓ పదిహేను నిమిషాల పాటు ఆర నివ్వాలి. తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రంగా కడిగేసుకుని మెత్తని గుడ్డతో తుడుచుకుంటే సరిపోతుంది. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే చర్మంపై ఉండే మచ్చలు, మృత కణాలు తొలగి పోయి చర్మం నాజూగ్గా, ప్రకాశవంతంగా తయారువుతుంది. □

# తెర

చార్మింగ్ స్టార్ శర్వా, బ్లాక్ బస్టర్ డైరెక్టర్

## కాంబో మూవీ సంక్రాంతి రిలీజ్



శ్రీనువైట్ల, స్టార్ ప్రొడ్యూసర్ అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్ కాంబో మూవీ సంక్రాంతి రిలీజ్‌కి సన్నాహాలు

చార్మింగ్ స్టార్ శర్వా, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ శ్రీనువైట్ల, అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్ లో తెరకెక్కనున్న నూతన చిత్రానికి సంబంధించిన ఆఫీస్ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం నేడు జూబ్లీ హిల్స్‌లో ఘనంగా జరిగింది.ఆనందం, వెంకీ, ఢీ, రెడీ, కింగ్, దూకుడు, బాద్‌షా వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన శ్రీనువైట్ల, ఈసారి శర్వానంద్‌తో కలిసి మరో వినోదాత్మక చిత్రాన్ని అందించేందుకు సిద్ధమవు తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని వచ్చే సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.నారీనారీ నడుమ మురారీ, బైకర్ వంటి వరుస బ్లాక్ బస్టర్ విజయాలతో దూసుకెలుతున్న శర్వా, ఇప్పుడు శ్రీనువైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్ కలిసివస్తుండటంతో ఈ

## 'ఆల్ఫా' ట్రైలర్ విడుదల



ఆలియా భట్ ప్రధాన పాత్రధారిగా.. శర్వారి కీలక పాత్రలో యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తోన్న భారీ యాక్షన్ మూవీ ఆల్ఫా. జూలై 3న సినిమా రిలీజ్ కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో బుధవారం మేకర్స్ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇద్దరు అందమైన హీరోయిన్స్ డెడ్లీ రోల్స్‌లో కనిపించనున్నారు. సరదాగా, థ్రిల్లింగ్‌గా రూపొందిన ఈ భారీ పాప్ కార్న్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ట్రైలర్ ఆకట్టుకుంటోంది.ట్రైలర్‌ను గమనిస్తే.. ఆలియా భట్‌ను శక్తివంతురాలిగా తయారు చేసే మెంటర్‌గా బాబీ డియోల్ క్రూరమైన పాత్రలో కనిపించారు. హంతకురాలి పాత్రలో ఆలియా భట్ నటించింది. అయితే ఆమె కొన్ని పరిస్థితుల్లో తనకు శిక్షణ ఇచ్చిన మెంటర్‌కే శత్రువుగా మారి వ్యతిరేకంగా పోరాడుతుంది. బాబీ డియోల్, ఆలియా భట్‌లకు ఆల్ఫా ప్రోగ్రామ్‌తో ఉన్న సంబంధం ఏంటనేది తెలుసుకోవాలంటే మాత్రం సినిమా చూడాల్సిందే. ఇందులో అనీల్ కపూర్ మరో పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. హై యాక్షన్ ఎలిమెంట్స్‌తో పాటు సూపర్ ఫన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఆల్ఫా మూవీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా అలరించనుందని తెలుస్తోంది. అలాగే ఆలియాతో పాటు శర్వారి కూడా ధైర్యంతో పోరాడే తత్వమున్న వ్యక్తులుగా ట్రైలర్ ఆవిష్కరించింది. శర్వారి పాత్రను ట్రైలర్‌లో పెద్దగా ఆవిష్కరించలేదు. కానీ బాబీ డియోల్‌ను ఎదుర్కోవటానికి ఆలియా భట్‌కు అండగా నిలిచే పాత్రలో శర్వారి నటించినట్లు ట్రైలర్‌లో తెలుస్తోంది.ఆల్ఫా ట్రైలర్‌లోని స్టైలిష్, కూల్ విజువల్స్ సినిమాలోని కంటెంట్‌ను మరింత ఎలివేట్ చేస్తుంది. ఆకట్టుకునే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్. గ్లోబల్ టాప్ డీజే హ్యాగెల్ వరల్డ్‌వైడ్ చార్ట్‌బస్టర్ ట్రాక్ జమైకన్ బామ్ బామ్‌ను ట్రైలర్‌లో ఉపయోగించారు. ఈ ట్రాక్ వల్ల థియేటర్లలో సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ విభిన్నమైన అనుభూతిని పొందుతారనిపిస్తోంది.

## 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఫ్యామిలీ కలిసి చూసేలా ఉంటుంది:



వద్దే నవీన్..

వద్దే జిష్ణు సమర్పణలో వద్దే క్రియేషన్స్ బ్యానర్ మీద వద్దే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' కథను ఎంచుకోవడానికి గల కారణాలు ఏంటి?..**

ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తుల్లు సినిమాలోని పాయింట్, కథ చాలా డిఫరెంట్‌గా, కొత్తగా ఉంటుంది. ఈ కథ నాకు చాలా నచ్చింది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా సినిమా ఉంటుంది.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' మీ కంఫర్ట్ జోన్‌కి దూరంగా ఉంది కదా?..**

ప్రస్తుతం ప్రేక్షకులు సినిమాల్ని చూసే తీరు మారింది. కేవలం కుటుంబ కథా చిత్రాలు, ప్రేమ కథా చిత్రాల్ని ఇస్తే సరిపోవడం లేదు. అన్ని అంశాల్ని జోడించి సరికొత్త పాయింట్, కంటెంట్‌ను అందిస్తేనే ఆదరిస్తున్నారు.

**రీ ఎంట్రీలో మీరే నిర్మాతగా ఎందుకు మారాల్సి వచ్చింది?..**

నాకు ఈ కథ మీదున్న నమ్మకం వేరే నిర్మాతలకు ఉండాలని లేదు. వేరే నిర్మాత అయితే కథ మారుస్తారని కాదు.. ఈ కథని నేను నమ్మాను. నిర్మించేందుకు కూడా ముందుకు వచ్చాను.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో ఎంటర్టైన్మెంట్ ఉంటుందా?..**

త్రిమూర్తులు పాత్రలోనే ఎంతో ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. కానిస్టేబుల్ పాత్రకి తగ్గట్టుగానే ఇందులో కనిపిస్తాను

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఎంత రియలిస్టిక్ ఉంటుంది?..**

ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తుల్లు చాలా వరకు రియలిస్టిక్‌గానే ఉంటుంది. పూర్తిగా ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లా ఉండదు. అవసరం ఉన్న చోట మాత్రమే ఫైట్, పాటలను పెట్టాం.

**నిర్మాణంలో అప్పటికి, ఇప్పటికి వచ్చిన మార్పులను గమనించారా?..**

ఇప్పుడు కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ పెరిగింది. నిర్మాణంలోనూ చాలా మార్పులు వచ్చాయి. అయితే అన్నీ పక్కాగా ముందే ప్లాన్ చేసుకున్నాం కాబట్టి మాకు ఎక్కడా ఎలాంటి సమస్య రాలేదు.

**దర్శకుడు కమల్ గురించి చెప్పండి?..**

కమల్ ఈ కథ మీద చాలా వర్క్ చేశాడు. మేం దాదాపు ఏడాది పాటుగా కేవలం స్క్రిప్ట్ మీదే ఉన్నాం. కమల్ మేకింగ్, టేకింగ్ చాలా కొత్తగా అనిపించింది.

**.రాశీ సింగ్ గురించి చెప్పండి?..**

త్రిమూర్తులు భార్యగా ఆమె కనిపిస్తారు. రాశీ అద్భుతంగా నటించారు.

**.ప్రస్తుతం ఆడియెన్స్ మీ మీద కురిపిస్తున్న ప్రేమను చూస్తున్నారా?..**

గత పన్నెండేళ్లలో మన తెలుగు ఆడియెన్స్ నేను ఎక్కడ కనిపించినా కూడా మళ్లీ సినిమాలు చేయండి సార్ట్ అని ప్రేమగా అడిగేవారు.

**ఈ మధ్య కాలంలో మీకు నచ్చిన పాత్రలు, సినిమాలు ఏంటి?..**

నాకు రంగస్థలం మూవీ నచ్చింది. అందులో రామ్ చరణ్, జగపతి బాబు పాత్రలు నచ్చాయి. పుష్పలో అల్లు అర్జున్ పాత్ర నచ్చింది. రీసెంట్‌గా అంటే చిరంజీవిచేసిన మన శంకర వర ప్రసాద్ గార్తు నచ్చింది.

**టాన్స్‌ఫర్ త్రిమూర్తులు ఎలా ఉండబోతోంది?..**


కథ నెమ్మదిగానే ప్రారంభం అవుతుంది. కానీ సంఘర్షణ మొదలయ్యాక.. క్లైమాక్స్ వరకు గ్రిప్పింగ్‌గా వెళ్తుంది.

## 'దీవాన' సరికొత్త ప్రేమ కథతో ఆకట్టుకుంటుంది: శ్రీకాంత్ సంగిశెట్టి



శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్మేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. "దీవాన' సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 19న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. పదేళ్ల కిందట వచ్చిన ప్రయోగా త్మక చిత్రం మిణుగురులు చిత్రానికి అసిస్టెంట్‌గా పనిచేశా. ఆ చిత్రానికి నంది అవార్డు కూడా వచ్చింది. ఆస్కార్ లైబ్రరీలో ఆ స్క్రిప్ట్ భద్రపరిచారు. పదేళ్లకుపైగా ఓ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేశాను. చిన్న చిన్న డెమో ఫిల్మ్స్, సాంగ్స్, షార్ట్స్ ఫిల్మ్స్ చేసేవాణ్ని. సినిమాలు, ఇంట ర్వ్యూలు చూసి సినిమా గురించి నేర్చుకున్నా. షార్ట్స్, కలర్ ఫాలెట్ ఏవీ నేర్చుకోలేదు. సినిమా చూస్తూ సినిమాను ఎంజాయ్ చేసేవాణ్ని. నేను 10 గంటలు కూర్చొని ఉద్యోగం చేస్తున్నప్పుడల్లా నా మైండ్ లో మొత్తం సినిమానే రన్ అవుతూ ఉండేది. జాబ్ లో ప్రమోషన్స్ కూడా వద్దనుకునేవాణ్ని. సినిమా కోసం ఒకసారి జాబ్ మానేసి నా భార్యను బాగా కష్టపెట్టా. ఆ తర్వాత అర్థ మైంది జాబ్ మానేయడం ఇంపాజిబుబుల్ అనుకున్నా. కొవిడ్ సమయంలో మా నాన్న అనారోగ్యం వల్ల ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. ఓటీటీకి సూట్ అయ్యే కథతో తిరుగుతుండేవాణ్ని. దివాన కథ జెమిని టీవీలో ఓ యాంకర్‌ను చూసి రాసుకున్నా. ఆమె రోజూ టీవీలో వచ్చేంది.

## 'సింగ్ గీతం' ఘన విజయం ఆనందాన్ని ఇచ్చింది: సింగీతం శ్రీనివాసరావు



లేటెస్ట్ గోల్డెన్ బ్లాక్ బస్టర్ ఖిసింగ్ గీతంఖి. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు.

సింగ్ గీతం చాలా ఆసక్తికరంగా వుంది. కొత్త ప్రయోగాలు చేయడంలో ఎప్పుడూ ముందుండే మీలాంటి లెజెండరీ దర్శకుడికి ఇది పర్ఫెక్ట్ మూవీ. ఈ కథ 40 ఏళ్లుగా తెరపైకి రావడానికి ఎదురుచూస్తోందని చెప్పారు. ఆ ఆలోచన ఎలా పుట్టింది? సుమారు 40 ఏళ్ల క్రితం నాకు ఒక వినూత్నమైన ఆలోచన వచ్చింది. పదేళ్ల తర్వాత మళ్లీ దర్శకత్వం వహించడం ఎలా అనిపించింది? ఈ సినిమా కోసం తీసిన మొదటి షాట్ గురించి గుర్తుందా?నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి నేను దర్శకత్వం వహించాలని కోరారు. నాకు ఇప్పటికీ దర్శకత్వం వహించే ఉత్సాహం ఉంది. మీ సినిమాల్లో నటీనటుల ఎంపికకు ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. కమల్ హాసన్, డా. రాజ్‌కుమార్, బాలకృష్ణ వంటి మహానటులతో పనిచేశారు. దర్శకుడునటుడు అనుబంధం గురించి చెప్పండి.ప్రతి నటుడికి తనదైన వ్యక్తిత్వం, ప్రత్యేకత, శైలి ఉంటాయి. బాలకృష్ణ గారు కమల్ హాసన్ గారిలా ఉండరు. కమల్ హాసన్ గారు డా. రాజ్‌కుమార్‌లా ఉండరు. ముగ్గురూ గొప్ప నటులే కానీ వారి నటనా శైలులు భిన్నం. దర్శకుడిగా నా పని ఏమిటంటే, ప్రతి నటుడిలో ఉన్న ప్రత్యేకతను గుర్తించి, దాన్ని అత్యుత్తమంగా బయటకు తీసుకురావడం. వారి ప్రతిభను మరింత వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నించాను. అదే నా విజయానికి కారణం.

## 'రాంబో' పవర్‌ఫుల్ గ్లింప్స్ రిలీజ్



శ్రీతేజ్, రత్నాకరం అనిల్ రాజు, శ్రీధర్ గంగపట్నం, ఎస్‌వీకే సినిమాస్ 'రాంబో' పవర్‌ఫుల్ గ్లింప్స్ రిలీజ్ యంగ్ ట్యాలెంటెడ్ శ్రీతేజ్ టైటిల్ పాత్రలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాంబో' రత్నాకరం అనిల్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని, హిడింబ వంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన నిర్మాత శ్రీధర్ గంగపట్నం, ఎస్‌వీకే సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.తాజాగా చిత్ర బృందం విడుదల చేసిన 'రాంబో' గ్లింప్స్ ప్రేక్షకుల్లో సినిమా పై అంచనాలు పెంచింది. ఒక మృగం మనిషిగా పుడితే వాడే రాంబో అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ప్రారంభమైన గ్లింప్స్ వైల్డ్ యాక్షన్‌తో ఆకట్టుకుంది. దర్శకుడు రత్నాకరం అనిల్ రాజు రాంబో పాత్రను డిజైన్ చేసిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హీరో క్యారెక్టర్‌లోని వైల్డ్ ఎమోషన్స్ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశారు.

## 'రణబాలి' ఆర్నాల్డ్ వోస్లూ బర్త్ డే పోస్టర్ రిలీజ్



'రణబాలి' చిత్రంలో సర్ థియోడోర్ హెక్టర్ క్యారెక్టర్ లో నటిస్తున్న 'ది మమ్మీ' మూవీ ఫేమ్ హాలీవుడ్ యాక్టర్‌విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తు న్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది.'రణబాలి'తో తొలిసారి ఇండియన్ సినిమాలో నటిస్తున్నారు ప్రముఖ హాలీవుడ్ నటుడు, 'ది మమ్మీ' మూవీ ఫేమ్ ఆర్నాల్డ్ వోస్లూ. ఈ చిత్రంలో ఆయన సర్ థియోడోర్ హెక్టర్ అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ రోజు ఆర్నాల్డ్ వోస్లూ పుట్టినరోజు సందర్భంగా బర్త్ డే విశెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు ఇటీవలే 'రణబాలి' సినిమా సక్సెస్ ఫుల్‌గా వంద రోజుల షూటింగ్ పూర్తి చేసుకుంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్ కు అన్ని సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి.

# ఫైనల్‌కు భారత్

## 101 రన్స్ తేడాతో అఫ్ఘాన్‌పై ఘన విజయం



**న్యూఢిల్లీ:** ముక్కోణపు వన్డే సిరీస్‌లో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఎ అదరగొట్టింది. అఫ్గానిస్థాన్ ఎ తో బుధవారం జరిగిన మ్యాచ్ సమష్టిగా రాణించిన భారత్ 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. స్పిన్ ఆల్‌రౌండర్ నిషాంత్ సింధు(4/31) నాలుగు వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ భారీ విజయంతో ఈ ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్‌కు ఫైనల్ బెర్త్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 319 పరుగుల భారీ స్కోర్ చేసింది. ప్రియాన్ష్ ఆర్య(58), తిలక్ వర్మ(59), కుమార్ కుశాగ్ర(58) హాఫ్ సెంచరీలతో రాణించగా, వైభవ్ సూర్యవంశీ(38), రుతురాజ్ గైక్వాడ్(30), విప్రజ్ నిగమ్(30) పర్వాలేదనిపించారు. అఫ్గాన్ బౌలర్లలో ఫరిదూన్, అబ్దుల్లా అహ్మద్‌జై , ఫర్మనుల్లా రెండేసి వికెట్లు తీయగా, జహీర్ ఖాన్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం అఫ్గానిస్థాన్ 36.5 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. బహీర్ షా(57) హాఫ్ సెంచరీతో రాణించగా, ఫైసల్(46) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో నిశాంత్ సింధు(4/31)తో పాటు యశ్ ఠాకూర్(2/48) రెండు వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ కంబోజ్, విప్రజ్ నిగమ్, సూర్యాన్ష్ షెడ్గే, అనుకుల్ రాయ్ తలో వికెట్ తీసారు.

### బాక్సింగ్ ప్రపంచ కప్: ముందంజలో

# జ్యోతి, ప్రాచీ, నిఖిల్




**న్యూఢిల్లీ:** చైనాలో జరుగుతున్న బాక్సింగ్ ప్రపంచ కప్ (రెండవ దశ) రెండవ రోజున భారత బాక్సర్లు జ్యోతి, ప్రాచీ మరియు నిఖిల్ విజయం సాధించారు. గ్వియాంగ్ నగరంలోని గ్వియాంగ్ ఒలింపిక్ స్పోర్ట్స్ సెంటర్ జిమ్నాసియంలో జరగనున్న తమ తమ వెయిట్ కేటగిరీల తదుపరి రౌండ్‌కు వారు అర్హత సాధించారు. మహిళల 57 కేజీల విభాగంలో పోటీపడిన ప్రాచీ, అమెరికాకు చెందిన డెబోరా గ్రాంట్‌పై 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఘన విజయం సాధించి పోటీలో ముందంజ వేసింది. మహిళల 48 కేజీల విభాగంలో అంతే ఆధిపత్య ప్రదర్శన కనబరిచిన జ్యోతి, రెండవ రౌండ్‌లో మంగోలియాకు చెందిన ఎంఖ్ అమ్గలన్ నోముందారిని ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకుంది. ఈ కీలక విజయంతో, జ్యోతి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించి దేశానికి పతకాన్ని ఖాయం చేసింది. పురుషుల 55 కేజీల విభాగంలో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టోఫర్ హిప్పోక్రేట్‌పై హోరాహోరీగా జరిగిన పోరులో 3-2 స్ప్లిట్ డెసిషన్ విజయం సాధించిన తర్వాత నిఖిల్ కూడా ముందుకు సాగాడు. ఇతర ప్రాథమిక పోటీలలో, పూనమ్ (54 కేజీలు) చైనీస్ తైపీకి చెందిన హ్సియావో వెన్ హువాంగ్ చేతిలో 2-3 తేడాతో స్వల్పంగా ఓడిపోగా, ఆకాష్ (75 కేజీలు) పోలాండ్‌కు చెందిన మాటియస్ అర్బన్ చేతిలో అదే 2-3 తేడాతో పరాజయం పాలయ్యాడు. మహిళల 70 కేజీల విభాగంలో ఫ్రాన్స్‌కు చెందిన మేలీస్ రిచోల్ చేతిలో 0-5 తేడాతో ఓటమి పాలైన తర్వాత గిటిమోని కూడా టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది.

### ఐసిసి ర్యాంకింగ్స్‌లో హేలీ మాథ్యూస్

# ఆల్‌రౌండర్ నం.1

### భారత్ స్టార్స్ దీప్తి, శ్రీ చరానీ పురోగతి




**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 న్యూజిలాండ్‌పై జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనల తర్వాత, వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఐసీసీ మహిళల టీ20ఐ ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో నెం.1 స్థానాన్ని తిరిగి దక్కించుకోగా, భారత స్టార్ క్రీడాకారిణులు దీప్తి శర్మ, శ్రీ చరానీ ఈ జాబితాలో గణనీయమైన పురోగతిని నమోదు చేశారు. ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌పై 10 పరుగులకు 5 వికెట్లు తీసి మ్యాచ్ గెలిపించిన ప్రదర్శన తర్వాత, దీప్తి టీ20ఐ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో 2 స్థానాలు ఎగబాకింది. భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఈ ఆఫ్‌స్పిన్నింగ్ ఆల్ రౌండర్, ఇప్పుడు పాయింట్ల పట్టికలో వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్, న్యూజిలాండ్ కెప్టెన్ మెలీ కెర్‌ల వెనుక స్థానంలో ఉంది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో కూడా భారత్ గణనీయమైన పురోగతిని సాధించింది. ఇందులో భాగంగా లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరానీ 5 స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన 2వ స్థానానికి చేరుకుంది. నెం.1 ర్యాంకింగ్‌లో కొనసాగుతున్న ఇంగ్లండ్ స్పిన్నర్ లిన్సీ స్మిత్ కంటే చరానీ ఇప్పుడు కేవలం ఐదు రేటింగ్ పాయింట్లు మాత్రమే వెనుకబడి ఉంది. బౌలింగ్ చార్టులలో దీప్తి మరో కీలక క్రీడాకారిణిగా నిలిచింది. ఆమె ఐదు స్థానాలు ఎగబాకి 5వ స్థానానికి చేరుకోవడంతో, ప్రపంచంలోని అగ్రశ్రేణి టీ20ఐ బౌలర్ల జాబితాలో భారత్ స్థానం మరింత బలపడింది. మరోవైపు, ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ప్రదర్శన తర్వాత స్కాట్లాండ్ కెప్టెన్ కాథరిన్ బ్రైస్ 7 స్థానాలు పైకి ఎగబాకి, ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో 10వ స్థానంతో టాప్ 10లోకి తిరిగి ప్రవేశించింది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో, ఆస్ట్రేలియాకు చెందిన జార్జియా వోల్ నెం.1 టీ20ఐ బ్యాటర్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకుంది.









### ఇంగ్లండ్ టూర్‌కు టీమిండియాలో..

# నలుగురిపై వేటు

### కోహ్లీ, హార్దిక్ రీఎంట్రీ?

**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్ ముగిసిన వెంటనే టీమ్ ఇండియా ఇంగ్లాండ్ గడ్డపై మరో సవాల్‌కు సిద్ధమవుతోంది. మిషన్ 2027 వన్డే ప్రపంచకప్ వేటను అధికారికంగా ప్రారంభించేందుకు బీసీసీఐ సరికొత్త వ్యూహాలతో 16 మంది సభ్యుల పటిష్టమైన జట్టును సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ ఈ నెల 20తో ముగియనుంది. ఆ వెంటనే జులైలో టీమిండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. జులై 14 నుండి 19 వరకూ వన్డే జరగనుంది. ఆఫ్ఘనిస్తాన్‌తో పోలిస్తే ఇంగ్లాండ్ స్వదేశంలో అత్యంత ప్రమాదకరమైన జట్టు కాబట్టి, ఈ సిరీస్‌ను భారత సెలెక్టర్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ప్రస్తుత సిరీస్‌లో విశ్రాంతితో పాటు, గాయాల కారణంగా దూరమైన కీలక ఆటగాళ్లు తిరిగి ఇంగ్లాండ్ సిరీస్‌తో జట్టులోకి రానున్నారు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న రన్ మెషీన్ విరాట్ కోహ్లీ, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టులోకి రావడం ఖాయమైంది. వీరితో పాటు, ప్రపంచ అత్యుత్తమ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా తిరిగి బౌలింగ్ విభాగాన్ని నడిపించనున్నాడు. మరోవైపు, స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, గాయం నుంచి కోలుకుని దేశవాళీలో అదరగొడుతున్న యువ పేసర్ హర్షిత్ రాణా కూడా జట్టులోకి రానున్నారు. అలాగే, లిస్ట్‌ఎ క్రికెట్‌లో 50 ఇన్నింగ్స్‌ల తర్వాత అత్యధిక సగటు కలిగిన రికార్డు సృష్టించిన రుతురాజ్ గైక్వాడ్ పట్ల కూడా సెలెక్టర్లు మొగ్గు చూపుతున్నారు. కాగా భారత సీనియర్ ఆటగాళ్లు జట్టులోకి వస్తుండటంతో, ప్రస్తుతం ఆఫ్ఘన్ సిరీస్‌లో ఆడుతున్న నలుగురు ఆటగాళ్లకు ఇంగ్లాండ్ టూర్‌లో చోటు దక్కడం కష్టంగా మారింది. విరాట్ కోహ్లీ స్థానంలో వచ్చిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఈసారి జట్టులో చోటు దక్కకపోవచ్చు. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా రాకతో యువ పేసర్లు ప్రిన్స్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణలపై వేటు పడనుంది. అలాగే, అక్షర్ పటేల్ జట్టులోకి వస్తుండటంతో హర్ష్ దూబే కూడా తన స్థానాన్ని కోల్పోవలసి వస్తుంది. దీంతో ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌కు భారత్ జట్టు అంచనా (16 మంది సభ్యులు)లో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్‌రెడ్డి, అక్షర్‌పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, గుర్నూర్ బ్రార్ ఉన్నారు.

# తొలి టి20లో ఆస్ట్రేలియా విక్టరీ

### బంగ్లాదేశ్‌పై 4 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** టీ20లో బంగ్లాదేశ్‌పై ఆస్ట్రేలియా విజయం సాధించింది. స్లో బౌలర్లు ఆడమ్ జంపా, జోయెల్ డేవిస్ చెరో మూడు వికెట్లు పడగొట్టడంతో, బుధవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. గత 60 ఏళ్లలో ఆస్ట్రేలియాకు ఆడిన తొలి భారత సంతతి పురుష క్రికెటర్ అయిన లెగ్ స్పిన్నర్ నిఖిల్ చౌదరి కూడా ఒక వికెట్ పడగొట్టగా, బంగ్లాదేశ్ 19 ఓవర్లలో 131 పరుగులకే ఆలౌట్ అయింది. గత వన్డేలో ఆస్ట్రేలియా ఒక వికెట్ తేడాతో గెలిచి, బంగ్లాదేశ్‌పై మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయకుండా కాపాడటంలో 149 పరుగులు చేసిన కూపర్ కానలీ, నాలుగు




ఫోర్లు, మూడు సిక్సర్లతో 47 పరుగులు చేసి తన జట్టును 18.2 ఓవర్లలో 133-6 స్కోరుకు చేర్చాడు. మిచెల్ మార్ష్, ఆ తర్వాతి ఓపెనర్ జోష్ ఇంగ్లిస్‌లను ఆస్ట్రేలియా వెంటవెంటనే కోల్పోయినప్పటికీ అతను సంయమనం కోల్పోలేదు. టిమ్ డేవిడ్ (20)తో కలిసి మూడవ వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన తర్వాత, కానలీని క్యాచ్ పట్టించి అబ్దుల్ గఫార్ తన అరంగేట్రంలోనే వికెట్ పడగొట్టాడు. ఈ లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ 2-32 గణాంకాలతో ముగించాడు. గాయం తో లిట్టన్ దాస్ జట్టు నుండి తప్పుకోవడంతో, బంగ్లాదేశ్ జట్టుకు తౌహిద్ హృదయ్ నాయకత్వం వహించాడు. హృదయ్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు, కానీ క్రమశిక్షణతో కూడిన ఆస్ట్రేలియా స్పిన్ బౌలింగ్ దాడిని బంగ్లాదేశ్ బ్యాటర్లు ఎవరూ ప్రతిఘటించలేకపోయారు. ఐదవ ఓవర్‌లో బంగ్లాదేశ్ 39 -1తో ఉండగా, ఆ తర్వాత జంపా, డేవిస్‌ల బౌలింగ్‌తో పతనావస్థ మొదలవడంతో ఆతిథ్య జట్టు 60 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది.




# లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

### సెన్సెక్స్ 347, నిఫ్టీ 96 పాయింట్ల లాభం

**ముంబై, జూన్ 17:** వరుసగా మూడో రోజు కూడా దేశీయ సూచీలు లాభాలతోనే ముగిశాయి. పశ్చిమాసియాలో తిరిగి శాంతి నెలకొనడం, హోర్ముజ్ నుంచి చమురు సరఫరా సజావుగా సాగడానికి మార్గం సుగమం కావడం అంతర్జాతీయ మార్కెట్లలో జోష్ నింపింది. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి (94.53) బలపడడం దేశీయ సూచీలకు సానుకూలంగా మారింది. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడో రోజు కూడా బుధవారం లాభాలతో ముగిశాయి. మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పైకి ఎగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినప్పటికీ మార్కెట్లు సానుకూల ధోరణి కనబరిచాయి.

సెన్సెక్స్ 347 పాయింట్లు పెరిగి 77,155 వద్ద ముగిసింది. నిఫ్టీ 96 పాయింట్లు లాభపడి 24,085 వద్ద స్థిరపడింది. కీలక షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో నిఫ్టీ మరోసారి 24 వేల మార్క్‌ను అధిగమించింది. ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు అత్యధిక లాభాలు నమోదు చేశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.52 శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ సూచీ 0.79 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆ తర్వాత కన్జ్యూమర్ డ్యూరబుల్స్, మెటల్ సూచీలు నిలిచాయి. ఆటో, రియాల్టీ రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) సమావేశ ఫలితాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి, భవిష్యత్ వడ్డీ రేట్లపై ఫెడ్ చేసే వ్యాఖ్యలపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 94.50 స్థాయి వద్ద స్థిరంగా కదిలింది. డాలర్ సూచీ, ముడి చమురు ధరలు పరిమిత శ్రేణిలోనే కదలడంతో కరెన్సీ మార్కెట్లు కూడా వేచి చూసే ధోరణిలోనే కొనసాగాయి. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం, హోర్ముజ్ జలసంధి పూర్తిగా తెరుచుకోనుండటం, చమురు ధరలు తగ్గడం మార్కెట్‌లో సానుకూల ఫలితాలకు కారణమైంది.




# అమెరికా- ఇరాన్ డీల్

### దిగొచ్చిన చమురు ధరలు

### 80 డాలర్ల దిగువకు చేరిన బ్రెంట్ క్రూడ్ ధర

**ముంబై, జూన్ 17:** ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు బుధవారం దిగివచ్చాయి. అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడంతో పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గుచూపారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర 80 డాలర్ల దిగువకు చేరింది. బ్యారెల్ ధర 0.72 శాతం తగ్గి 78.39 డాలర్లకు చేరింది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) చమురు ధర దాదాపు 1 శాతం పడిపోయి 75.35 డాలర్లుగా నమోదైంది.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే దిశగా అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదరడంతో చమురు ధరలు దిగొచ్చాయి. మరోవైపు ఒప్పందంపై సంతకం అనంతరం ఇరాన్‌కు చమురు విక్రయాలపై అవకాశం కల్పిస్తామని అమెరికా అధికారులు వెల్లడించారు. ఈ వారం కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం ఏప్రిల్‌లో ప్రకటించిన కాల్పుల విరమణను మరో 60 రోజుల పాటు పొడిగించారు. ఈ సమయంలో శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చలు జరగనున్నాయి. ఒప్పందంలో భాగంగా ఇరాన్ పోర్టులపై అమెరికా విధించిన ఆంక్షలను ఎత్తివేయనున్నట్లు సమాచారం. ప్రతిగా హార్ముజ్ జలసంధి మీదుగా చమురు ట్యాంకర్లు, ఇతర నౌకల రాకపోకలకు ఇరాన్ అనుమతి ఇవ్వనుంది. చమురు ధరలు తగ్గడం భారత కరెన్సీకి కూడా మేలు చేసింది. బుధవారం రూపాయి విలువ 31 పైసలు పెరిగింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 94.29 వద్ద ట్రేడవుతోంది. గత సెషన్‌లో ఇది 94.56 వద్ద స్థిరపడింది. మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐలు) నిధుల ఉపసంహరణ కూడా క్రమంగా తగ్గుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. బ్రెంట్ క్రూడ్ ధరలు తగ్గడం, ఎఫ్‌సిఎన్ఆర్(బి) డిపాజిట్ల రూపంలో భారత్‌కు భారీగా విదేశీ నిధులు వచ్చే అవకాశాలు ఉండటంతో రూపాయి మరింత బలపడవచ్చని వారు అంచనా వేస్తున్నారు.

### అవసరం లేని పాలసీలు..

# లోన్లు అంటగట్టొద్దు!



### బ్యాంకుల మిస్ సెల్లింగ్‌పై ఆర్‌బిఐ కఠిన నిబంధనలు

### డిజిటల్ వేదికల్లో మభ్యపెట్టే పద్ధతులపై నిషేధం

### 2027 జనవరి 1 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు

**ముంబై, జూన్ 17:** బ్యాంకుకు ఓ పనిమీద వెళ్తే మరో ప్రొడక్ట్‌ను అంటగట్టడం, లోన్ తీసుకోవాలంటే బీమా పాలసీ తప్పనిసరి అని చెప్పడం, మొబైల్ యాప్ తెరిస్తే వరుసగా లోన్ ఆఫర్లు చూపించడం వంటి పద్ధతులకు త్వరలో చెక్ పడనుంది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆర్‌బీఐ కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. బ్యాంకులు అనుసరించాల్సిన కొత్త మార్గదర్శకాలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటి వరకు బ్యాంకింగ్ రంగంలో తరచూ వినిపించిన ఫిర్యాదుల్లో 'మిస్ సెల్లింగ్' ఒకటి. అంటే వినియోగదారుడికి అవసరంలేని ఫైనాన్షియల్ ప్రొడక్ట్‌ను అమ్మడం. సరైన సమాచారం ఇవ్వకుండా ఒప్పించడం. అనుమతి లేకుండానే పాలసీలు లేదా ఇతర సేవలు జత చేయడం వంటి చర్యలు ఇందులోకి వస్తాయి. ఇలాంటి వ్యవహారాలకు తొలిసారి స్పష్టమైన నిర్వచనం ఇచ్చిన ఆర్‌బీఐ వాటిపై కఠిన వైఖరి అవలంబించింది. కొత్త నిబంధనల ప్రకారం రుణం మంజూరు చేయాలంటే తప్పనిసరిగా బీమా పాలసీ కొనాలని బ్యాంకులు షరతు విధించకూడదు. గృహ రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకునే సమయంలో బీమా అవసరమైతే వినియోగదారుడు తనకు నచ్చిన సంస్థ నుంచి పాలసీ తీసుకునే స్వేచ్ఛ ఉండాలి. బ్యాంకు సూచించిన సంస్థ నుంచే కొనాలంటూ ఒత్తిడి చేయడం నిషేధం. వినియోగదారుడి సమ్మతికి కూడా కొత్త నిర్వచనం తీసుకొచ్చింది ఆర్‌బిఐ. రుణం తీసుకున్న వ్యక్తికి అదే ఆధారంగా బీమా, పెట్టుబడి పథకాలు లేదా ఇతర ఆఫర్లను పంపడం కుదరదు. ప్రతి ఉత్పత్తికి విడిగా స్పష్టమైన అనుమతి తీసుకోవాల్సిందే. డిజిటల్ వేదికల్లో బ్యాంకులు అనుసరిస్తున్న పలు పద్ధతులపైకూడా ఆర్‌బిఐ దృష్టిపెట్టింది. కస్టమర్లను మభ్యపెట్టేలా కౌంట్‌డౌన్ టైమర్లు చూపించడం, ముందుగానే టిక్ చేసిన ఆప్షన్స్ ఉంచడం, తిరస్కరించే బటన్‌ను గందరగోళంగా చూపించడం, మూసివేయాలనుకుంటే లోన్ పేజీకి తీసుకెళ్లే పాప్‌అప్‌లు చూపించడం వంటి పద్ధతులను నిషేధించింది. లోన్ దరఖాస్తు సమయంలో వినియోగదారుడికి తెలియకుండా బీమా పాలసీని జత చేయడం, చివరి దశలో అదనపు ఛార్జీలను చూపించడం, అత్యవసర హెచ్చరికలా కనిపించే ప్రకటనలు పంపించడం వంటి చర్యలు కూడా ఇక అనుమతించబోవడం లేదు. బ్యాంకుల తరపున పనిచేసే డైరెక్ట్ సేలింగ్ ఏజెంట్లు, మార్కెటింగ్ ప్రతినిధులపైనా కొత్త నియంత్రణలు అమల్లోకి రానున్నాయి.

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే వినియోగదారులను సంప్రదించాలి. అనుమతి లేకుండా ఇంటికి లేదా కార్యాలయానికి వెళ్లకూడదు. తమను బ్యాంకు ఉద్యోగులుగా పరిచయంచేసుకోవడం కూడా నిషేధం. ఈ మార్గదర్శకాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘించి వినియోగదారుడికి తప్పుడు ప్రొడక్ట్‌ను విక్రయించినట్లు తేలితే బ్యాంకు వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. వినియోగదారుడు ఎదుర్కొన్న నష్టానికి పరిహారం కూడా ఇవ్వాల్సి రావచ్చు అని ఆర్‌బిఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలు తేల్చిచెబుతున్నాయి.

## వాణిజ్యం



# జాబితాలో లేని సెక్యూరిటీల ట్రేడింగ్‌కు దూరంగా ఉండండి

### అనధికారిక ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లపై పెట్టుబడిదారులకు సెబి హెచ్చరికలు

**ముంబై, జూన్ 17:** సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) బుధవారం, అనధికారిక ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారమ్‌లు, వెబ్‌సైట్‌ల ద్వారా జాబితాలో లేని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల సెక్యూరిటీలలో లావాదేవీలు జరపవద్దని పెట్టుబడిదారులకు మరోసారి హెచ్చరిక జారీ చేసింది. అటువంటి సంస్థలు తమ నియంత్రణ పరిధిలో పనిచేయవని పేర్కొంది. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల జాబితాలో లేని సెక్యూరిటీలలో లావాదేవీలను సులభతరం చేసే అనేక ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లు పుట్టుకొస్తున్నాయని, ఇవి పెట్టుబడిదారులను గణనీయమైన ఆర్థిక, కార్యాచరణపరమైన నష్టాలకు గురిచేస్తున్నాయని మార్కెట్ల నియంత్రణ సంస్థ తెలిపింది. సెబీ డిసెంబర్ 2024, ఆగస్టు 2016లో జారీ చేసిన సలహాలను ప్రస్తావిస్తూ, పెట్టుబడిదారులు అటువంటి ప్లాట్‌ఫారమ్‌లపై లావాదేవీలు జరపడం లేదా సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం మానుకోవాలని పునరుద్ఘాటించింది. పేపర్ ట్రేడింగ్ సేవలను అందించే అనధికారిక వర్చువల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, ఫాంటసీ గేమింగ్‌తో ముడిపడి ఉన్న పెట్టుబడి ఉత్పత్తులు, జాబితాలో లేని రుణ సెక్యూరిటీలలో లావాదేవీలు జరిపే ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల గురించి తాను గతంలో జారీ చేసిన హెచ్చరికలను కూడా ఈ నియంత్రణ సంస్థ గుర్తుచేసింది. "ఇలాంటి ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారమ్‌లపై ఎలాంటి లావాదేవీలు లేదా ట్రేడింగ్ నిర్వహించడం, లేదా వాటిపై ఏవైనా సున్నితమైన వ్యక్తిగత వివరాలను పంచుకోవడంలో ఉన్న నష్టాల గురించి పెట్టుబడిదారులను మరోసారి హెచ్చరిస్తున్నాము" అని నియంత్రణ సంస్థ తెలిపింది.

# విఆర్ఆర్ వేలం ద్వారా రూ.72,300 కోట్ల నగదును వ్యవస్థలోకి ప్రవేశపెట్టిన ఆర్‌బిఐ

**ముంబై, జూన్ 17:** అడ్వాన్స్ పన్ను చెల్లింపుల కారణంగా బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు (లిక్విడిటీ) తగ్గడంతో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారం రెండు 'వేరియబుల్ రేట్ రెపో' (విఆర్ఆర్) వేలంపాటల ద్వారా రూ.72,300 కోట్ల తాత్కాలిక నగదును వ్యవస్థలోకి ప్రవేశపెట్టింది. కేంద్ర బ్యాంక్ 5.26 శాతం కట్‌ఆఫ్ రేటుతో రెండు రోజుల విఆర్ఆర్ వేలం ద్వారా రూ.50,016 కోట్లను వ్యవస్థలోకి విడుదల చేసింది. అలాగే, మరో రెండు రోజుల విఆర్ఆర్ వేలం ద్వారా అదనంగా రూ. 22,284 కోట్లను కూడా ప్రవేశపెట్టింది. బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యతలో తలెత్తే అసమతుల్యతలను నిర్వహించడానికి ఆర్‌బిఐ ఈ వేరియబుల్ రేట్ రెపో వేలంపాటలను ఉపయోగిస్తుంది. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం, జూన్ 16 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు సుమారు రూ.23,881.21 కోట్లుగా అంచనా వేయబడింది. ఇది జూన్ 15 నాటి సుమారు రూ.1.51 లక్షల కోట్ల మిగులుతో పోలిస్తే తక్కువ. అడ్వాన్స్ పన్ను చెల్లింపుల కారణంగా నగదు బయటకు వెళ్లడమే ఈ మిగులు తగ్గడానికి కారణమని నిపుణులు పేర్కొన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.